తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
నిజామాబాద్ : fb.com/vaartha Digital
Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
9-7-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 159 పేజీలు: 10+4 వెల: 6.50



SHOWROOM: TELANGANA: RENAULT NIZAMABAD Ph: 9311700672.



బుధవారం ఇండోనేసియాలో ప్రంబనన్ సందర్శనకు వచ్చిన ప్రధాని మోడీకి బ్యానర్లు, జెండాలతో ఘనంగా స్వాగతం పలుకుతున్న స్థానికులు

## 10 బ్యాంకు ఖాతాలు, 2 లాకర్లు

>> చేయాల్సి వచ్చిందని, ఉన్నతాధి కారుల అనుమతితోనే తాము ఇలా చేశామని ఎసిబి అధికారులు కోర్టుకు తెలిపారు. భీం రెడ్డికి తాము ప్రత్యేకంగా ఎలాంటి వైద్య సదుపాయా లు కల్పించలేదని, ఆయన ఇంటి పక్కనే వుండే వైద్యుడి వద్దకు తీసుకువెళ్లి చికిత్స అందించామని ఎసిబి అధికారులు తెలిపారు. ఆ వైద్యుడి సూచనల మేరకు విశ్రాంతి ఇవ్వాల్సి వచ్చిందని, ఆయన కోలుకున్న తరువాత నిబంధనల మేరకు అరెస్టు చేసి జైలుకు తరలించామని ఎసిబి అధికారులు వివరించారు. ఇక సోదాల సమయంలో భీం రెడ్డి తమకు పెద్దగా సహకరించలేదని, ఆఖరుకు ఇబ్రహీంబాగ్‌లో వుంటున్న ఖరీదైన వి ల్లా ఎలా కొన్నారనే దానిపైనా వివరాలు తెలిపేందుకు నిరాకరించారని వారు తెలిపారు. భీం రెడ్డి ఇంట్లో భారీగా నగదు, బంగారు, వెండి నగ లు, స్థిర చరాస్తుల పత్రాలు పట్టుబడ్డాయని వారు కోర్టుకు తెలిపారు. భీం రెడ్డికి పది బ్యాంకు ఖాతాలతో పాటు రెండు లాకర్లు వున్నాయని ఎ సిబి అధికారులు తెలిపారు. ఇంట్లో రెండు మెమోరీ కార్డులు, ఒక డైరీ వెలుగు చూడగా వీటి ఆధారంగా కొందరు బినామీల వివరాలు రట్టయా ్యయని ఎసిబి అధికారులు తెలిపారు. ఆయన ఇంట్లో లభించిన డైరీలో తాను ఇవ్వాల్సిన వారు, తనకు ఇవ్వాల్సిన వారు అంటూ కోడ్ భాష లో కొన్ని పదాలను భీం రెడ్డి రాసుకున్నారని, ఇందులో వున్న వారి పేర్ల ఆధారంగా కొందరిని విచారించాల్సి వుందని ఎసిబి అధికారులు తెలి పారు. భీం రెడ్డి అక్రమాస్తుల విలువ 200 కోట్ల రూపాయలకు పైబడి వుంటుందని తాము భావిస్తున్నామని వారు తెలిపారు. భీం రెడ్డిని అరె స్టు చేయకుండా వుంటే బినామీలపై ఆయన ఒత్తిడి తెచ్చి కేసును తారుమారు చేసేవాడని వారు కోర్టుకు తెలిపారు. అక్రమంగా సంపాదించిన ఆ స్తులను భీం రెడ్డి చాలా తెలివిగా తనకు నమ్మకంగా వుండే బినామీలపై రిజిస్ట్రేషన్ చేయించినట్లు తేలిందని రిమాండు రిపోర్టులో ఎసిబి అధి కారులు తెలిపారు.

ఇదిలావుండగా అక్రమాస్తుల కేసులో అరెస్టయిన డిఎస్‌పి భీం రెడ్డిని మరింతగా విచారించేందుకు ఆయనను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఎసిబి అధికారులు ఎసిబి కోర్టును కోరాలని నిర్ణయించారు. భీం రెడ్డి అక్రమాస్తుల చిట్టా వెలుగు చూడాలంటే ఆయనను మరింతగా విచారించాల్సిన అవసరం వుందని ఎసిబి అధికారులు భావిస్తున్నారు. దీనిపై రెండు రోజుల్లో ఎసిబి అధికారులు ఎసిబి కోర్టులో పిటిషన్ దాఖ లు చేయనున్నట్లు తెలిసింది. గడచిన రెండు నెలల కాలంలో ఎసిబి అరెస్టు చేసిన అక్రమార్కులను ఇలాగే కస్టడీకి తీసుకుని విచారించడం గమనార్హం.

## కెనడా సాయం

>> కెపాబిలిటీ సెంటర్లు (జీసీసీలు) హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకుంటున్నాయని తెలిపారు. మూసీ నది పునరుద్ధరణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని సీఎం రేవంత్ వివరించారు. నదీ తీరాన్ని అభివృద్ధి చేసి కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మించాలన్న లక్ష ్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అలాగే రాష్ట్రంలో సౌర విద్యుత్ విస్తరణ, హరిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కెనడా సహకారం అందించాలని కోరారు. తెలంగాణను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం వెల్లడించారు. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. ఇదే తరహాలో కెనడాకు చెందిన ప్రముఖ విశ్వవిద్యాలయాలు కలిసి హైదరాబాద్‌లో మల్టీ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు.

ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న రెండో తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్లో పాల్గొనాలని కెనడా కంపెనీలు, పెట్టుబడిదారులు, విద్యా సంస్థలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణలో కొత్త పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు ఇది మంచి వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడిన హైకమిషనర్ క్రిస్ కూటర్, తెలంగాణ ప్రభుత్వం దూరదృష్టితో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించారు. ఉద్యోగాల కల్పన, పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ అనుసరిస్తున్న విధానం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఐటీ,ఈ అండ్ సీజాయింట్ సెక్రటరీ అనుదీప్ దురి శెట్టి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రతినిధి బృందం చర్చలు

>> అయహన్, దక్షిణాఫ్రికా పార్లమెంట్ సభ్యుడు థామస్ ప్రోలిక్, సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు సెంథిల్ తొండమాన్ ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ ప్రతినిధి బృందంతో జరిగిన భేటీలో ప్రధానంగా పర్యావరణం, సామాజిక, పరిపాలనా పరమైన అంశాలతో పాటు మౌలిక సదుపాయాలు, ఏఐ వినియోగం, భవిష్యత్తు పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో గ్రీన్ గ్రోత్ ఎకనమిక్ సమ్మిట్ నిర్వహిస్తున్న మెరీడియన్ కలెక్టివ్ ప్రతినిధులు రిత్వికా భట్టాచార్య, ఉమా భట్టాచార్యతో పాటు లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 'మీసేవ' ద్వారా యూరియా బుకింగ్

>> సేవ కేంద్రాన్ని సందర్శించి, ఆపరేటర్ సహాయంతో యూరియా బుకింగ్ చేసుకోవచ్చు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల. శ్రీధర్ బాబు నేతృత్వంలో పనిచేస్తున్న మీసేవ, వ్యవసాయశాఖతో కలిసి ఈ కొత్త చొరవను ప్రారంభిస్తుంది. రైతు తన పట్టాదారు పాస్‌బుక్ నంబర్తో సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సందర్శించాలి. మీ సేవ ఆపరేటర్ రైతు వివరాలను సేకరించి, సాగు విస్తీర్ణం, పంట వివరాలను నమోదు చేస్తారు. రైతు ఎంపిక చేసిన ఎరువుల డీలర్ వద్ద అవసరమైన యూరియా పరిమాణాన్ని బుక్ చేస్తారు. రైతు నమోదిత మొబైల్ నంబర్‌కు పంపిన ఓటిపిని ధృవీకరించిన తర్వాత వెంటనే బుకింగ్ ఐడి జారీ అవుతుంది. ఈ బుకింగ్ ఐడీ 48 గంటల పాటు చెల్లుబాటు అయ్యే విధంగా ఉంటుందని, ఎంపిక చేసిన డీలర్ వద్ద యూరియా కొనుగోలు తప్పనిసరి అని స్పష్టం చేసింది. కాగా మీ సేవా రుసుము కేవలం రూ.10గా నిర్ణయించామని, యాప్ లేదా మీ సేవ ద్వారానే అధికారిక యూరియా బుకింగ్ ఉంటుందని స్పష్టం చేసింది.

## 'ధరణి'లో నకి'లీల'లు!

>> అన్యాక్రాంతమైందని గుర్తించిన సీసీఎల్ఎ ఇప్పుడు కేసు నమోదు చేసి విచారిస్తోంది.

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం మునగనూర్ రెవెన్యూ సర్వే నంబర్ 44, బై నంబర్లలో 40 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. ఇది 1954-58 (దాదాపు 70 ఏళ్ల క్రితం) అడంగల్,పహాణీల్లోనూ గైరాన్, సర్కారీ భూమిగా నమోదై ఉంది. అయితే ఇందులో కొంత భూమిని గతంలోనే ప్రభుత్వం పేదలకు అసైన్ చేసింది. నిబంధనల ప్రకారం అసైన్డ్ భూమిని అమ్మడం, కొనడం నేరం. సదరు అసైనీలకు ఆ భూమిని సాగు చేసుకుని జీవించే హక్కు మాత్రమే లభిస్తుంది. ఒకవేళ ఎవరైనా ఈ భూములను అమ్మినట్లు, కొన్నట్లు తేలితే వాటిని అసైన్డ్ ల్యాండ్స్ (పీఓటీ) యాక్ట్ 1977 కింద స్వాదీనం చేసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంది. అయితే అసైనీల వద్ద ఉండాల్సిన భూమిలో 12 ఎకరాలు ఇటీవల ఓ రియల్టర్ చేతుల్లోకి వెళ్లడం గమనార్హం. విజయవాడ హైవే-నాగార్జునసాగర్ హైవేలకు మధ్యలో ఉండే ఈ భూములు అత్యంత ఖరీదైనవి వందల కోట్ల విలువ చేసేవే. గత ప్రభుత్వ హయాంలో కన్నేసిన రియల్లర్టు కాజేసేందుకు స్కెచ్ వేశారు. ప్రభుత్వం మారడంతో కొన్నాళ్లు మౌనంగా ఉన్నారు. ఏళ్లుగా వివాదంలో ఉన్న ఈ భూములను పట్టా భూములుగా కొల్లగొట్టేందుకు కుట్రలు జరిగాయి. సర్వే నంబర్ 44/1లోని 8.39 ఎకరాలు, సర్వే నంబర్ 44/2లోని 4.25 ఎకరాలు, సర్వే నంబర్ 44/3 లోని ఒక ఎకరం, సర్వే నంబర్ 44/4లోని 7.16 ఎకరాలు, సర్వే నంబర్ 44/5లోని 18.10 ఎకరాలను మళ్లీ నిషేధిత జాబితాలో చేర్చారు. మేరకు ఐజీఆర్ఎస్ పోర్టల్లోనూ పొందుపరిచారు. అయితే అప్పటికే కన్ను పెట్టిన రియల్టర్‌తో కొందరు ప్రజా నేతలు కుమ్మక్కయ్యారు. ఈ క్రమంలో నాలా కన్వర్షన్, హెచ్ఎండీఏ అనుమతులు, నిర్మాణ పనుల ప్రారంభానికి సహకరించేందుకు అంగీకారం కుదరడంతో సర్కార్ భూమి కబ్జా కుట్రలు అమలయ్యాయి. అయితే ఈ పరిణామాలపై సర్కార్ నజర్ పెట్టింది. మునగనూర్ రెవెన్యూ సర్వే నంబర్ 44/2 సహా 44/4లో 12 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనట్లు ఇప్పటికే చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మిస్ట్రేషన్(సిసిఎల్ఎ) గుర్తించింది. సుమోటోగా తీసుకుని శాఖాపరమైన విచారణ చేపట్టింది.

మునుగనూరు భూముల వ్యవహారంలో తమకు కావాల్సిన రీతిలో రికార్డుల్లో మూడుసార్లు మార్పులు చేసుకున్నారు.

## వారం - వర్జ్యం

09-07-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
నవమి ఉ.10.34
అశ్వని మ.2.51
వర్జ్యం : ఉ.11.02-మ.12.33, రా.11.47-రా.1.16
దు.ఉ.10.01-ఉ.10.53,
2)మ.3.15-సా.4.07
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** కుటుంబ సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. నూతన పెట్టుబడులలో తొందరపాటు వద్దు. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

**వృషభం:** బాధ్యతలు సక్రమంగా నెరవేరుస్తారు. కొన్ని వాయిదా పద్ధతులలో వస్తువులను కొనుగోలు చేస్తారు.

**మిథునం:** అమ్మకాలు కొనుగోలుకు సంబంధించిన వ్యవహారాలు స్తబ్ధతగా ఉంటాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కర్కాటకం:** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. తల్లిదండ్రుల విషయంలో ప్రత్యేక శ్రద్ధను వహిస్తారు.

**సింహం:** కళారంగాలలోని వారికి సన్మానాలు, సత్కారాలు పొందుతారు. కాంట్రాక్టులు లాభిస్తాయి వస్త్రలాభం.

**కన్య :** శ్రమించి అనుకున్న పనులు ఆలస్యంగానైనా పూర్తి చేసి నామమాత్రపు ఫలితాలు సాధిస్తారు. శుభకార్యాలు.

**తుల :** ఆర్థికంగా కొంత వెనుకబాటు కనబడిన కనీస అవసరాలకు లోటు ఉండదు. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం తగదు. వాహనసౌఖ్యం.

**వృశ్చికం:** నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. మీ సహాయ సహకారాలు అందరికి అందిస్తారు. గృహనిర్మాణ యత్నాలు సాగిస్తారు.

**ధనుస్సు:** జీవితాశయాన్ని ఏ విధంగా నయినా సరే సాధించాలని దృఢ నిర్ణయానికి వస్తారు. వస్తు కొనుగోలు చేస్తారు.

**మకరం:** కోర్టు కేసుల నుండి బయటపడతారు. భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి సాధిస్తారు. స్పెక్యులేషన్ దూరంగా వుండండి.

**కుంభం:** ఎంతటి కార్యాన్నైనా దీక్ష పట్టుదలతో సాధిస్తారు. మానసిక ప్రశాంతత కొంత లోపిస్తుంది.

**మీనం:** ఉన్నతాధికారులతో మాట్లాడే టప్పుడు సహనాన్ని, ఓర్పును వహించడం చెప్పదగినది. వృత్తి సానుకూలంగా ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తెలుగు రాష్ట్రాలు సహా 20 చోట్ల ఎన్ఐఎ సోదాలు


>> కుట్రను ఏడాది క్రితం ఎన్ఐఎ రట్టు చేయడం తెలిసిందే. ఈ స ందర్భంగా అరెస్టయిన నలుగురిలో ఓ మహిళ హైదరాబాద్‌లోని చంచల్‌గూడకు చెందిన వ్యక్తి కావడం విదితమే. దీని తరువాత అటు హైదరా బాద్, ఇటు ఎపిలోని విజయవాడలో పలుమార్లు ఎన్ఐఎ సోదాలు నిర్వహించి ఉగ్రవాద వ్యాప్తికి సంబంధించిన కరపత్రాలు, వీడియోలు, పుస్తకాలు, ఇతర సామాగ్రి భారీగా పట్టుకుంది. అప్పట్లో పట్టుబడిన వారిలో కొందరు బెయిల్‌పై విడుదలవగా ఇంకొందరు ఇంకా జైల్లోనే వున్నా రు. నాటి ఘటనకు సంబంధించి కొనసాగింపుగా ఎన్ఐఎ అధికారులు మరోసారి దేశ వ్యాప్తంగా 20 చోట్ల దాడులు నిర్వహించారు. భారత్‌లో ఐసిస్, అల్ ఖైదాల కోసం పాక్‌కు చెందిన అల్ హాకీం, షుకూర్ ఆదేశాలతో ఈ నెట్ వర్క్ కొనసాగుతుందని ఎన్ఐఎ విచారణలో తేలింది. భా రత్‌ను ఇస్లామిక్ దేశంగా మార్చేందుకు అల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ పేరిట ఓ సంస్థను కొందరు యువకులు స్థాపించినట్లు ఎన్ఐఎ గుర్తించిం ది. ఇన్‌స్టాగ్రాం, టెలిగ్రాం గ్రూపుల ద్వారా యువతను ఎంపిక చేసి వారికి రహస్య ప్రాంతాలలో ఉగ్రవాద శిక్షణ ఇచ్చి వారిని ఆత్మాహుతి దా డులకు ప్రేరేపిస్తున్నట్లు ఎన్ఐఎ గుర్తించింది. వీరికి ఏడాది క్రితం అరెస్టయిన చంచల్‌గూడకు చెందిన సయిదా బేగం లీడర్‌గా వుంటూ మహిళ ల కోసం ప్రత్యేకంగా మరో విభాగాన్ని ఆమె ఏర్పాటు చేసినట్లు ఎన్ఐఎ గుర్తించింది. అప్పటి కేసులో విజయవాడకు చెందిన మహమ్మద్ రహ మతుల్లా షరీఫ్, మహమ్మద్ దానిషక్స్, మీర్జా సోహైల్‌తో పాటు చంచల్‌గూడ వాసి సయిదా బేగం, కర్నాటకలోని బళ్లారికి చెందిన అబ్దుల స లాం అరెస్టవగా తాజాగా మరో 11 మందిని ఎన్ఐఎ అరెస్టు చేసింది. వీరిలో ఒక మైనర్ బాలుడు కూడా వున్నాడు. వీరి వద్ద డిజిటల్ ఉపకర ణాలను జప్తు చేశారు. అరెస్టయిన వారు అల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ అనే గ్రూపులో పనిచేస్తున్నట్లు తేలింది. అల్ హాకీం షుకూర్ ఆదేశాల మేరకు వీరంతా భారత్‌లో ఉగ్రవాదం వ్యాప్తికి పనిచేస్తున్నట్లు తేలింది. కాగా అరెస్టయిన వారు తాము భారత్‌ను ఇస్లామిక్ దేశంగా మార్చేం దుకు నిర్ణయించి ఉగ్రవాదంలో చేరినట్లు అంగీకరించారు. తమ లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లేందుకు ఇన్‌స్టాగ్రాం, టెలిగ్రాం వేదికగా బెన్ఎక్స్ కాం అనే రహస్య గ్రూపు ఏర్పాటు చేసినట్లు వారు అంగీకరించారు. తమ సంస్థలో కొందరు పాకిస్తానీయు లు కూడా వున్నారని అరెస్టయిన వారు చెప్పారు. తాము జిహాదీ కోసం పనిచేయాలని నిర్ణయించినట్లు వారు చెప్పారు. పట్టుబడ్డ వారిపై ఉపా చట్టంతో పాటు బిఎన్ఎస్ కింద పలు సెక్షన్లు, ఐటి యాక్ట్ సెక్షన్లు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

## ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై దుష్ప్రచారం

>> ధాన్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరిస్తే ఈరోజు వరకు 13 నుంచి 14 శాతం బియ్యం కూడా ఎందుకు పంపలేదని ప్రశ్నించారు.

2024-26 ఖరీఫ్ సీజన్‌లోని బియ్యం ఇంకా ఎఫ్‌సిఐకి చేరలేదని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. బీఆర్ఎస్ హయాంలో కూడా ఇదేవిధంగా వ్యవహారించారని చెప్పుకొచ్చారు. ధాన్యం కొనుగోళ్ల కోసం ఎన్ఎస్‌డిసి ద్వారా రాష్ట్రాలకు కేంద్రం రుణాలు ఇస్తోందని వివరించారు. 2024-26లో రూ.37 వేల కోట్లు రాష్ట్రానికి రుణాలు ఇచ్చామని వెల్లడించారు. 2026-27లో కూడా సుమారు రూ.23 వేల కోట్లు రుణాలు ఇచ్చామని తెలిపారు. ఢిల్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ధర్నా చేయాలని.. వాస్తవాలు చెబుతామని అన్నారు. కేంద్రం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. రైతుల ధాన్యం ఉత్పత్తి స్థాయికి తగ్గట్లుగా మౌలిక వసతులు పెంచాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చే సన్నబియ్యంలో 70 శాతం నిధులను కూడా కేంద్రమే ఇస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రం అంగీకారం: రఘునందన్ రావుతెలంగాణ రైతాంగం పండించిన పంట సేకరణ విషయంలో 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. తాము చేపట్టిన రైతు గోస ద్వారా రైతుల ఆందోళనను స్వయంగా చూశామని తెలిపారు. తెలంగాణ రైతులను ఆదుకోవాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి విజ్ఞప్తి చేశామని అన్నారు. అదనపు ధాన్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరించినందకు కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. 2013-14లో అప్పటి యూపీఏ 2లో కాంగ్రెస్ ప్రభుత్వం 24.32 లక్షల మెట్రిక్ టన్నులనూ మాత్రమే ధాన్యం కొనుగోళ్లు చేసిందని ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో కేంద్రప్రభుత్వం 146.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో కొన్నదానికంటే 6 రెట్లు ఎక్కువగా మోదీ హయాంలో కొనుగోలు చేశామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో కేంద్రప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామని అన్నారు. వరికి రూ.2369 ఎంఎస్‌పి చెల్లిస్తున్నామని, కాంగ్రెస్ హయాంలో వరికి రూ.1300 ఎంఎస్‌పి ఇచ్చిందని తెలిపారు. వడ్ల కొనుగోలుకు రూ.34,891 కోట్లను తెలంగాణలో ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఇచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రజలు, రైతుల పక్షాన తాము నిలబడతామని మాటిచ్చారు. ధాన్యం కొనుగోళ్లను కేంద్రం చేస్తే మర ఆడించి బియ్యం పంపడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఎందుకు పడుతోందని ప్రశ్నించారు.



సమస్యలను పరిష్కరించాలంటూ పాట్నాలో బుధవారం ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు

## తాడిచర్ల ఇచ్చింది కాంగ్రెస్సే

>> సింగరేణికి మంజూరైన తాడిచర్ల2 బ్లాక్ కు మైనింగ్ లీజు ముందస్తు అనుమతులు ఇవ్వాలని పలుమార్లు లేఖలు రాసినట్లు చెప్పారు. 2024 మార్చి 7న తాను స్వయంగా కేంద్ర బొగ్గు శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశానని, 2026 మే 20న మరో సారి బొగ్గు శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి మైనింగ్ లీజు మంజూరుకు ముందస్తు అనుమతి ఇవ్వాలని కోరినట్లు వివరించారు. సింగరేణి సంస్థ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తాము ఎన్నోసార్లు చేసినప్పటికీ నాన్చుడు ధోరణితో ఇప్పటివరకు మైనింగ్ లీజుకు అనుమతించకుండా జాప్యం చేసారని అన్నారు. ఇప్పుడు కొత్తగా బ్లాకును కేటాయిస్తున్నట్టు ప్రకటించటం విచారకరమని పేర్కొన్నారు. మైనింగ్ అనుమతులు ఆలస్యం అవ్వటం వలన సింగరేణి సంస్థ ఆ గనిని ప్రారంభించ లేకపోయిందని అన్నారు. ఈ కారణం వల్ల సంస్థకు అపార నష్టం కలిగిందన్నారు. కొత్తగూడెం జిల్లాలో మణుగూరు, ఇల్లందు వంటి సింగరేణి ప్రాంతాలు 1/70 గిరిజన చట్టం పరిధిలోకి వస్తాయని చెప్పారు. ఇక్కడ గిరిజనులు మాత్రమే భూమిపై సర్వ హక్కులు కలిగి ఉంటారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే మైనింగ్ వంటి కార్యకలాపాలు చేసుకునే హక్కు కలిగి ఉంటాయన్నారు.

ఈ విషయాలు చట్టంలో స్పష్టంగా చెప్పబడినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇల్లందు సమీపంలోని కోయగూడెం3 ఓపెన్ కాస్ట్ బ్లాక్ ను, మణుగూరులోని ఓపెన్ కాస్ట్ డిప్ సైడు గనిని వేలం పాటలో పెట్టడం చట్టానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయమని గట్టిగా విమర్శించారు. గిరిజన చట్టం అమలులో ఉన్న సింగరేణి ప్రాంతంలోని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకు మాత్రమే కేటాయించడం సమంజసమని అన్నారు. సింగరేణి సంస్థ ప్రభుత్వ రంగ సంస్థ కనుక ఇక్కడ బొగ్గు తవ్వి తీసే అధికారం కేవలం సింగరేణికే ఉంటుందని పలు లేఖల ద్వారా కేంద్రం దృష్టికి తీసుకెళ్లామన్నారు. సింగరేణి సంస్థపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ప్రేమ ఉంటే సింగరేణి విస్తరించిన గోదావరి లోయ ప్రదేశంలో ఉన్న అన్ని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సింగరేణి సంస్థతో పాటు తాము కూడా పలు బొగ్గు బ్లాకుల పేర్లను ప్రస్తావిస్తూ కేంద్ర బొగ్గు శాఖకు చెబుతూ వస్తున్నామని వివరించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఇప్పటికే ప్రైవేటు వారికి కేటాయించిన కోయగూడెం3 ఓపెన్ కాస్ట్ బ్లాక్, అలాగే సత్తుపల్లి ఓపెన్ కాస్ట్3 బ్లాక్ లలో ఇప్పటివరకు మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించలేదన్నారు. వాటిని తక్షణమే సింగరేణికి అప్పగించాలని ఆయన అన్నారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని బొగ్గు బ్లాక్ లను వేలం పాటలో ఉంచకుండా సింగరేణికి కేటాయించాలని ఆయన చెప్పారు. ఇక్కడ ఉన్న గిరిజన చట్టాలు స్థానిక పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర బొగ్గు శాఖ సింగరేణికి నేరుగా కేటాయించడం ప్రభుత్వం నుంచి ప్రభుత్వానికి ( జి టు జి) అనే పద్ధతిలో సమంజసంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ వల్లే తెలంగాణకు ప్రపంచ బ్యాంకు గుర్తింపు

>> పడుతోందని ఆయన అన్నారు. తెలంగాణ ఆర్థిక పరివర్తనను ప్రపంచ బ్యాంకు సైతం ధ్రువీకరించడం కేవలం ఒక గణాంక విజయం మాత్రమే కాదని, కేసీఆర్ దార్శనికత, నిబద్ధత, పాలనా నమూనాకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు అని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు దశాబ్దాల తరబడి నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ, కేవలం పదేళ్ల వ్యవధిలోనే తన ఆర్థిక తలరాతను తిరగరాసుకుని భారతదేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న, సంపన్న రాష్ట్రాల్లో ఒకటిగా అవతరించిందని ఆయన గుర్తు చేశారు.

పారిశ్రామికంగా, ఆర్థికంగా సుదీర్ఘకాలం పాటు అనుకూలతలు ఉన్న ఇతర రాష్ట్రాల వలె కాకుండా, దార్శనిక నాయకత్వం, సాహసోపేతమైన సంస్కరణలు, వినూత్న పాలన ద్వారానే తెలంగాణ ఈ మైలురాయిని చేరుకుందని ఆయన పేర్కొన్నారు. పారిశ్రామిక అనుమతుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి అపూర్వమైన పెట్టుబడులను ఆకర్షించిన టీఎస్ఐపాస్‌తో పాటు, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, రైతుబంధు వంటి ప్రతిష్టాత్మక పథకాలు రాష్ట్రవ్యాప్తంగా సమ్మిళిత వృద్ధికి, వ్యవసాయాభివృద్ధికి, పారిశ్రామిక విస్తరణకు, మెరుగైన ఉపాధికి బలమైన పునాది వేశాయని వివరించారు. యథాతథ స్థితిని (స్టేటస్ కో) సవాల్ చేయడానికి ఒక సంస్కర్త, అపూర్వమైన ఫలితాలను అందించడానికి ఒక కార్యదక్షుడు, ఒక రాష్ట్ర తలరాతను పూర్తిగా మార్చివేయడానికి ఒక నిజమైన మార్గదర్శి అవసరమని, ఈ లక్షణాలే కేసీఆర్ పాలనను నిర్వచిస్తాయని కేటీఆర్ కొనియాడారు. తెలంగాణ అభివృద్ధి నమూనా ప్రపంచస్థాయి విశ్వసనీయతను సంపాదించుకుందనడానికి ప్రపంచ బ్యాంకు గుర్తింపే మరో నిదర్శనమని ఆయన ఉద్ఘాటించారు.

## విరుచుకుపడిన ఇరాన్

>> ఆపరేషన్ నిర్వహించినట్లు ప్రకటించింది. ఈ చర్యలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన అమెరికాకు చెందిన ఎంక్యూ9 డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ పేర్కొంది. దాడుల సమయంలో బహ్రెయిన్, కువైట్‌లలో వైమానిక దాడుల హెచ్చరిక సైరన్లు మోగినట్లు అధికారులు తెలిపారు. కువైట్ సైన్యం ప్రకారం శత్రు క్షిపణులు, డ్రోన్ దాడులను వైమానిక రక్షణ వ్యవస్థలు ఎదుర్కొంటున్నాయనితెలిపింది. హార్మూజ్ జలసంధి నిర్వహణలో అమెరికా జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేసింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, కీలక చర్చాకర్త మహమ్మద్ బాఘర్ గాలీబాఫ్ అమెరికా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపించారు. తాజా దాడులతో పాటు చమురు ఆంక్షల పునరుద్ధరణ, హార్మూజ్ జలసంధిలో ఇరాన్ చర్యలకు అడ్డంకులు, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను ఆయన ప్రస్తావించారు. జలసంధిలో భద్రతా పరిస్థితులు దిగజారడంతో కనీసం నాలుగు చమురు, గ్యాస్ నౌకలు తమ ప్రయాణాలను నిలిపివేసి వెనుదిరిగినట్లు నౌకా ట్రాకింగ్ సమాచారం వెల్లడించింది.

## మళ్లీ అదే సీన్

>> వ్యాఖ్యానించారు. అమెరికా ప్రతినిధులు చర్చలు కొనసాగించవచ్చని, కానీ వాటి ద్వారా ఎలాంటి ఫలితం వస్తుందనే నమ్మకం తనకు లేదని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు అమెరికా బలగాలు ఇరాన్‌కు చెందిన కీలక ప్రాంతాలైన బందర్ అబ్బాస్, సిరిక్ నౌకాశ్రయాలు, ఖెష్మ్ ద్వీపంపై భారీ వైమానిక దాడులు నిర్వహించిన కొన్ని గంటలకే వెలువడ్డాయి. ఈ మూడు ప్రాంతాలపై ఈ దాడులు జరిగినట్లు అమెరికా వెల్లడించింది. హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు ప్రతీకారంగానే ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. అదే సమయంలో ఇరాన్ చమురు విక్రయాలకు అనుమతించిన లైసెన్స్‌ను అమెరికా ప్రభుత్వం రద్దు చేసింది. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్ బహ్రెయిన్, కువైట్‌లపై క్షిపణి దాడులు జరపడంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దీంతో యుద్ధ విరమణ ఒప్పందం పూర్తిగా కుప్పకూలే ప్రమాదం నెలకొంది. నాటో సదస్సు సందర్భంగా విలేకరులతో మాట్లాడిన ట్రంప్, "నా దృష్టిలో ఆ ఒప్పందం ముగిసిపోయింది. ఇక ఇరాన్‌తో వ్యవహరించాలని నాకు ఆసక్తి లేదు. వారితో మాట్లాడటం సమయ వృథాఅని అన్నారు. అంతేకాకుండా ఇరాన్ నాయకత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "వారు అత్యంత ప్రమాదకర వ్యక్తులు. అణ్వాయుధాలు వారి చేతికి వస్తే వాటిని వినియోగించడానికి వెనుకాడరు. అందుకే ఈ వ్యవహారం నా దృష్టిలో ముగిసిపోయిందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా ప్రతినిధులు చర్చలు కొనసాగించవచ్చని చెప్పినా, వాటి ద్వారా ఫలితం వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరాన్‌పై భారీ అమెరికా వైమానిక దాడులుఅమెరికా మంగళవారం నిర్వహించిన వైమానిక దాడులు గత పది రోజుల క్రితం జరిగిన దాడుల కంటే నాలుగు నుంచి ఐదు రెట్లు అధిక తీవ్రతతో జరిగినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. హోర్ముజ్ జలసంధి సమీపంలో వాణిజ్య నౌకలపై జరిగిన దాడులకు శిక్షగానే ఈ వైమానిక దాడు లు నిర్వహించినట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. ఇరాన్ అత్యున్నత నాయకుడు ఖొమైనీ అంత్యక్రియలు ముగిసిన అనంతరం ఇరు దేశాల మధ్య తుది ఒప్పంద చర్చలు ప్రారంభం కావాల్సి ఉంది. హోర్ముజ్ జల సంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ అణు కార్యక్రమంపై పరిమితులు వంటి కీలక అంశాలపై చర్చలు జరగాల్సి ఉన్నప్పటికీ తాజా దాడులతో ఆ ప్రక్రియపై అనిశ్చితి నెలకొంది. ఇరాన్ ఘాటు హెచ్చరిఅమెరికా దాడుల అనంతరం దక్షిణ ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. బందర్‌మషహార్‌లో ఒక రివల్యూషనరీ గార్డ్ సభ్యుడు మరణించగా, బుషెహార్‌లో అణు విద్యుత్ కేంద్ర పరిసర ప్రాంతాలపైకూడా దాడులుజరిగినట్లు తెలిపింది.

**మళ్లీ భీకరదాడులుచేస్తాం: ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు**
ఇరాన్‌కు మరోసారి అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ రాత్రే మళ్లీ భారీ దాడులు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. అంతకముందే ఇరాన్‌తో ఒప్పందం ముగిసిందని వెల్లడించారు. అలా ప్రకటన వెలువడిన కొద్ది గంటలకే ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించారు.

## కార్యకర్త చెంప ఛెళ్లుమనిపించిన మమత

**కోల్‌కత్తా,జులై 8:** పశ్చిమ్ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సహనం కోల్పోయారు. 11 ఏళ్ల చిన్నారి సామూహిక లైంగిక దాడి, హత్యను నిరసిస్తూ కోల్‌కతాలో నిర్వహించిన ర్యాలీలో టీఎంసీ కార్యకర్త చెంప చెల్లుమనిపించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా రాజకీయ దుమారం రేగుతోంది. ఈ వీడియోను షేర్ చేసిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ భండారీ మమతా బెనర్జీ తన పార్టీ కార్యకర్తలపై పలుసార్లు చేయిచేసుకున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత మమతా బెనర్జీ మానసిక సమతుల్యతను కోల్పోయారని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత మమతా బెనర్జీ పూర్తిగా మానసిక సమతుల్యత కోల్పోయారు ఈరోజు నిరసన ప్రదర్శనలో మమతా బెనర్జీ తన సొంత పార్టీకి చెందిన పలువురిపై దాడి చేశారని భండారీ పోస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్ మహిళా మోర్చా ఇంఛార్జ్, బీజేపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ లక్ష్మీ సింగ్ సైతం దీదీపై విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో ప్రకారం ర్యాలీ సందర్భంగా మమతా బెనర్జీ సహనం కోల్పోయి, జనసమూహంలో ఆమెకు దారి ఇవ్వడానికి ప్రయత్నిస్తున్న ఒక టీఎంసీ కార్యకర్తను చెంపదెబ్బ కొట్టారు. మద్దతుదారులు ఆమె చుట్టూ ఉన్న జనాన్ని నియంత్రించడానికి ప్రయత్నిస్తుండగా, పార్టీ అధినేత్రి పెద్ద జనసమూహం మధ్య నడుస్తూ తన దగ్గర నిలబడిన ఒక కార్యకర్తను కొట్టడం ఆ క్లిప్‌లో కనిపిస్తుంది. ఈ వీడియోను షేర్ చేస్తూ లక్ష్మీ సింగ్ టీఎంసీ నిరసన సందర్భంగా మమతా బెనర్జీ అహంకారం పూర్తిగా బయటపడిందని దుయ్యబట్టారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
Tender Notice No. 12/2026-27/SE(South)/EE(South)/DB/GVMC / Dt : 06-07-2026
Number of Works - 4 Nos. Value of works : Rs. 239.93 Lakhs
Tender Opening Date : 08-07-2026
Closing Date : 23-07-2026
Note : Further details at http:// www.tender.apeprocurement.gov.in
O/o EE (South) Cell No. 8367780727
For COMMISSIONER, (GVMC)

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-7-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 159 పేజీలు: 10+4 వెల: 6.50



ఎల్ నినో కట్టడికి ప్రత్యేక కార్యాచరణ 5

3నెలలు మంత్రిని చేయండి నీళ్లు తెచ్చిచూపిస్తా: హరీష్ 7


# మళ్లీ అదే సీన్



## ఇరాన్‌తో ఇక చర్చల్లేవంటున్న ట్రంప్



### 'సీజ్‌ఫైర్' ముగిసిందంటూ ఫైర్

### అమెరికా, ఇరాన్ పరస్పరం దాడులు

**అంకారా,జులై 8:** అమెరికాఇరాన్ మధ్య యుద్ధ విరమణకు ఉద్దేశించిన తాత్కాలిక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ప్రకటించారు. ఇకపై ఇరాన్‌తో చర్చలు కొనసాగించడం సమయ వృథాతప్ప మరేమీ కాదని ఆయన >>2

### బహ్రెయిన్, కువైట్‌పై విరుచుకుపడిన ఇరాన్

**టెహ్రాన్,జులై 8:** హార్ముజ్ జలసంధిలో చమురు నౌకలపై జరిగిన దాడులకు ప్రతీకారంగా అమెరికా ఇరాన్‌పై భారీ స్థాయిలో వైమానిక దాడులు చేపట్టిన నేపథ్యంలో, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. బుధవారం బహ్రెయిన్, కువైట్‌లోని అమెరికా సైనిక కేంద్రాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు జరిపినట్లు ఇరాన్ వెల్లడించింది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ వివరాల ప్రకారం బహ్రెయిన్‌లోని అమెరికా నావికాదళ ఐదో ఫ్లీట్ స్థావరం, బందర్ సల్మాన్ ప్రాంతం, కువైట్‌లోని అలీ అల్ సలేం వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణి, డ్రోన్ >>2

# తెలంగాణకు కెనడా సాయం

### ఫ్యూచర్ సిటీ, మెట్రోలో కెనడా భాగస్వామ్యానికి సిఎం రేవంత్ చర్చలు

### కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో భేటీ

### సౌర విద్యుత్ విస్తరణకు తోడ్పడాలని వినతి

### తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో పాల్గొనాలని కెనడా కంపెనీలకు ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 8:** కెనడా హైకమిషనర్ టు ఇండియా క్రిస్ కూటర్ బుధవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కెనడా- తెలంగాణ మధ్య వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణల రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. అదే సమయంలో ముఖ్యమంత్రి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందాన్ని కెనడా పర్యటనకు రావాలని హైకమిషనర్ క్రిస్ కూటర్ ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణలో చేపడుతున్న భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు, పట్టణాభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. ముఖ్యంగా మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల్లో కెనడా భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలను ఇరువురు చర్చలు జరిపారు. తెలంగాణ-కెనడా మధ్య పెరుగుతున్న పారిశ్రామిక, ఆర్థిక సంబంధాలను ప్రస్తావించిన క్రిస్ కూటర్, ఇటీవల కెనడాకు చెందిన ప్రముఖ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం సంతోషకరమని పేర్కొన్నారు. ఫిరాన్ టెక్నాలజీ గ్రూప్, హైదరాబాద్‌లో తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం, సీఐబీసీ హైదరాబాద్‌లో తన గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ప్రారంభించడం వంటి పరిణామాలు తెలంగాణపై కెనడా కంపెనీల నమ్మకం, విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనమని అన్నారు. దాంతోపాటు, ప్రపంచ ప్రసిద్ధిచెందిన క్యాపిటల్‌సంస్థ సీపీపీ ఇన్వెస్ట్‌మెంట్స్ హైదరాబాద్‌కు చెందిన సీటీఆర్ ఎల్ఎస్ డేటా సెంటర్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుని ఒక బిలియన్ కెనడియన్ డాలర్ల వరకు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం తెలంగాణ పెట్టుబడి సామర్థ్యాన్ని మరింత బలపరిచిందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఐటీ, లైఫ్ సైన్సెస్, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో సాధించిన పురోగతిని క్రిస్ కూటర్ బృందానికి వివరించారు. ముఖ్యంగా ప్రపంచంలోని ఫార్చ్యూన్-500 కంపెనీల గ్లోబల్ >>2



బుధవారం హైదరాబాద్‌లో కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో భేటీ అయిన సిఎం రేవంత్ రెడ్డి

### సిఎంతో అంతర్జాతీయ ప్రతినిధి బృందం చర్చలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 8:** హైదరాబాద్‌లో జరుగుతున్న గ్రీన్ గ్రోత్ ఎకనమిక్ సమ్మిట్ 2026లో పాల్గొనడానికి వచ్చిన అంతర్జాతీయ ప్రతినిధి బృందం బుధవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసింది. వివిధ దేశాలకు చెందిన ప్రభుత్వ ప్రతినిధులు, వ్యాపారవేత్తలు ముఖ్యమంత్రిని కలిసి తెలంగాణలో పెట్టుబడులపై చర్చించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో మలేషియా పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ ఎం. శరవణన్,అమెరికాకు చెందిన బ్రూక్‌ఫీల్డ్ అసెట్‌మేనేజ్‌మెంట్ బోర్డు డైరెక్టర్ నిలిగిల్బర్ట్, అమెరికా వాణిజ్య శాఖ మూమెంటమ్ టెక్నాలజీస్ అడ్వైజరీ కమిటీ సభ్యులు మహేష్ కొండూరు, ఓక్సన్ టెక్నాలజీస్, గ్లోబల్ ఫ్యూచర్ కౌన్సిల్ కోచైర్ అమిత్ మెహ్రా, నార్వే ప్రభుత్వ మాజీ స్టేట్ సెక్రెటరీ, ఓషన్ హౌస్ గ్లోబల్ స్ట్రాటజీస్ సలహాదారు దిలెక్ >>2



### 'మీసేవ' ద్వారా యూరియా బుకింగ్

#### సర్కార్ వినూత్న నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై8:** రాష్ట్రంలోని రైతులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. సబ్సిడీ యూరియా అందుబాటును మరింత సులభతరం చేయటం కోసం ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. పారదర్శకతను పెంపొందిస్తూ, సకాలంలో యూరియా పంపిణీ చేయటం కోసం రాష్ట్ర వ్యవసాయశాఖ యూరియా బుకింగ్ సేవను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మీసేవ కేంద్రాల ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోలేని రైతులు తమ సమీపంలోని మీ >>2

### తాడిచర్ల ఇచ్చింది కాంగ్రెస్సే

#### సింగరేణికి కోల్‌బ్లాక్ కేటాయింపులపై కేంద్రం ప్రచారం అవాస్తవం

#### గోదావరిలోయ బ్లాకులన్నీ కేటాయించాలి..



బుధవారం సచివాలయంలో మీడియాతో డి.సిఎం భట్టి

#### కేంద్రం మంజూరు చేసింది లీజ్ మాత్రమే: డిసిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణికి 2013లో తాడిచర్ల 2 బ్లాకును కేటాయించిందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణి కాలరీస్ సంస్థకు తాడిచెర్ల2 కోల్ బ్లాక్ కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వం వాస్తవాలను మరుగున పరిచి, తప్పుడు ప్రచారం చేస్తోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు హైదరాబాద్ సచివాలయంలో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తాడిచెర్ల బొగ్గు బ్లాక్‌ను మళ్లీ సింగరేణికి కేటాయిస్తున్నట్టు కేంద్ర బొగ్గు, గనుల శాఖా మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించడాన్ని తప్పుపట్టారు. ఇప్పటికే కేటాయించిన ఈ బొగ్గు బ్లాక్‌కు ఇప్పుడు మంజూరు చేసింది కేవలం లీజు మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. 2013లో కేటాయించినా, ఇప్పటివరకు లీజు ఇవ్వకుండా కేంద్రం జాప్యం చేసిందని విమర్శించారు. తమ పభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి దీనిపై కేంద్రానికి లేఖలు రాస్తున్నామని చెప్పారు. తాము చేసిన కృషి వల్లనే కేంద్రం లీజుకు అనుమతి ఇచ్చిందని అన్నారు. సింగరేణికి 2010 నుంచి 2012 వరకు కేంద్ర బొగ్గు శాఖకు చేసిన విజ్ఞప్తులపై స్పందిస్తూ నాటి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ 2013 సెప్టెంబర్ 16న తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ ను సింగరేణి సంస్థకు కేటాయించిందన్నారు. కేటాయింపు లేఖలో స్పష్టంగా ఈ బ్లాకులో గిరిజన భూములు ఉన్నందున వాటిని ప్రభుత్వ రంగ సంస్థలే బొగ్గును తీయాలని పేర్కొందన్నారు. ఈ బ్లాకుల అన్వేషణ, అభివృద్ధి పనులు వేగంగా చేసి వీలైనంత త్వరగా బొగ్గు ఉత్పత్తి ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నాడు కేంద్ర ప్రభుత్వం ఈ కేటాయింపు లేఖలో సింగరేణికి సూచించిందని చెప్పారు. ఈ నేపథ్యంలో తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పలుమార్లు కేంద్ర బొగ్గుశాఖ మంత్రులను, ప్రధాన మంత్రిని కలిసినట్లు చెప్పారు. >>2

# 10 బ్యాంకు ఖాతాలు, 2 లాకర్లు

#### డిఎస్‌పి భీం రెడ్డి రిమాండు రిపోర్టులో ఎసిబి

#### బినామీల పేరిట అక్రమాస్తులు దాచిన భీంరెడ్డి

#### ఆ గుట్టు తేల్చేందుకు కస్టడీ కోసం పిటిషన్



**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** అక్రమాస్తుల కేసులో అరెస్టయి చంచల్ గూడ జైల్లో వున్న పోలీసు కంప్యూటర్ సర్వీసెస్ డిఎస్‌పి సంకి రెడ్డి భీం రెడ్డి రిమాండు రిపోర్టులో ఎసిబి అధికారులు సంచలన విషయాలను వెల్లడించారు. పోలీసు శాఖలో 30 ఏళ్లకు పైగా సర్వీసు కలిగి వున్న భీం రెడ్డి భారీగా అక్రమాస్తులను సంపాదించారని, వీటిని చాలా తెలివిగా తన బినామీల పేరిట వుంచినట్లు ఎసిబి అధికారులు తమ రిమాండు రిపోర్టులో తెలిపారు. గత గురువారం భీంరెడ్డిని అక్రమాస్తుల కేసులో ఎసిబి పట్టుకోగా అదేరోజు ఆయన వున్నట్లుంది తీవ్ర అ స్వస్తతకు గురవడంతో వైద్యుల సూచనల మేరకు సిఆర్‌పిసి 41 కింద నోటీసులు ఇచ్చి అరెస్టు చేయక పోవడం తెలిసిందే. నాలుగు రోజుల త రువాత గత సోమవారం నాడు భీం రెడ్డిని ఎసిబి అధికారులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు రిమాండుకు తరలించడం తెలిసిందే. కాగా భీంరెడ్డి అక్రమాస్తుల కేసుకు దారితీసిన పరిస్థితులు, దాడుల సందర్భంగా ఆయన ఇంట్లో జరిగిన నాటకీయ పరిణామాలు, వెలుగుచూసిన అ క్రమాస్తుల వివరాలను ఎసిబి అధికారులు రిమాండు రిపోర్టులో ఎసిబి కోర్టుకు సమర్పించారు. సోదాలు జరిగిన రోజున భీంరెడ్డిని అరెస్టు చేయనందుకు తమపై విమర్శలు వచ్చాయని, ఆ సమయంలో ఆయన తీవ్ర అస్వస్తతకు లోనవడంతోనే అలా >>2

### కెసిఆర్ వల్లే తెలంగాణకు ప్రపంచ బ్యాంకు గుర్తింపు

#### ఆయన దార్శనికత అసాధారణం: కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై8:** తెలంగాణను ఎగువమధ్య ఆదాయ (అప్పర్ మిడిల్ ఇన్‌కమ్) ఆర్థిక వ్యవస్థగా ప్రపంచ బ్యాంక్ గుర్తించడం.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కేసీఆర్ దార్శనిక నాయకత్వానికి, పరిపాలనా దక్షతకు దక్కిన అంతర్జాతీయ స్థాయి గుర్తింపు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాజా గుర్తింపును ప్రస్తావిస్తూ.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.4.19 లక్షల (5,407 అమెరికన్ డాలర్లు) తలసరి ఆదాయంతో తెలంగాణ.. ప్రపంచ బ్యాంక్ ఎగువ మధ్యఆదాయ కేటగిరీలో చేరిందని, ఈ మైలురాయిని సాధించిన ఐదు భారతీయ రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో తెలంగాణ సాధించిన అసాధారణ ఆర్థిక పరివర్తనకు ఈవిశేష విజయమే అద్దం >>2



### తెలుగు రాష్ట్రాలు సహా 20 చోట్ల ఎన్ఐఎ సోదాలు

#### 11 మంది అరెస్టు

#### ఐసిస్, అల్‌ఖైదాకు అనుకూలంగా కొంతమంది ప్రచారం

**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** భారత్‌లో ఐసిస్, అల్ ఖైదా ఉగ్రవాదాన్ని విస్తరించేందుకు రెండు సంస్థల తరపున ఉగ్ర బావజాలం కలిగివున్న కొందరు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తుండడంపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) బుధవారం నాడు దేశ వ్యాప్తంగా దా డులు చేబట్టింది. దేశ రాజధాని ఢిల్లీ, బిహార్, రాజస్తాన్, కర్నాటక, మహారాష్ట్ర, బెంగాల్ సహా తెలుగు రాష్ట్రాల్లో ఈ దాడులు జరిగాయి. ఐసిస్‌కు అనుకూలంగా విజయవాడలో రట్టయిన సోషల్ మీడియా ప్రచారం, ఉగ్ర >>2

### ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై దుష్ప్రచారం

#### సిఎం రేవంత్‌రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

#### కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో తెలంగాణ బిజెపి నేతల భేటీ



బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో తెలంగాణ బిజెపి నాయకులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై8:** ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ దుష్ప్రచారం చేస్తోందని కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి కేంద్రం అంగీకారం తెలిపిందని పేర్కొన్నారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో విఫలమైందని ధ్వజమెత్తారు. (బుధవారం కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీలో కలిశారు. ధాన్యం కొనుగోళ్లు, బియ్యం సేకరణ అంశాలపై కేంద్రమంత్రికి బీజేపీ నేతలు విజ్ఞాపనపత్రం అందజేశారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు వెంకట రమణారెడ్డి, పాయల శంకర్, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, తెలంగాణ బీజేపీ కిసాన్ మోర్చా నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. తాము చేపట్టిన రైతు గోస ఉద్యమం తర్వాత ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసిందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రైస్ మిల్లుల్లో మిల్లింగ్ వేగవంతం చేసి నీదికి బియ్యాన్ని పంపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలు, మిల్లింగ్‌లో సరైన విధంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని సూచించారు. ఖరీఫ్ 2024-25లో 36 లక్షల మెట్రిక్ టన్నుల >>2

# 'ధరణి'లో నకి'లీల'లు!

## కోట్ల విలువైన సర్కారీ భూమి స్వాహా కుట్ర

#### శివార్లలో రెచ్చిపోతున్న రియల్టర్లు

#### 'పట్టా'లు తప్పుతున్న ప్రభుత్వ భూములు

#### మునగనూరులో బయటపడిన వందలకోట్ల కుంభకోణం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై8:** ధరణిలో లోపాలను అడ్డుపెట్టుకొని కొందరు అక్రమార్కులు భూకుంభకోణాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. హైదరాబాద్ శివార్లలో వందల కోట్ల విలువైన సర్కార్ భూములను స్వాహా చేసేందుకు రియల్టర్లు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారు. అసైనీలు అనుభవంలో లేకపోవడంతో ఆ భూములపై ఇతరుల పేరిట రికార్డులను సృష్టిస్తున్నారు. కొందరు ప్రజా నేతల సహకారంతో కలిసి కుట్రలు చేస్తున్నారు. ప్రభుత్వ భూములు కాపాడాల్సిన కొందరు అధికారులు అప్పట్లో కాసుల కోసం వారితో కుమ్మక్కయ్యారు. అంతా కలిసి వందల కోట్ల విలువైన విలువైన భూమిని సునాయాసంగా కాజేసే పనిలో పడ్డారు. ఈ క్రమంలోనే మునగనూర్లో వందల కోట్ల విలువైన భారీ భూకుంభకోణానికి పాల్పడ్డారు. రెండేళ్ల క్రితం వరకు ఇక్కడ ప్రభుత్వ భూమి అనే పెద్ద నోటీసు బోర్డు కూడా ఉండేది. కానీ ఈ ప్రభుత్వ భూమిని ఇటీవల పట్టా భూమిగా మార్చేశారు. పొజిషన్లో లేని కొత్త వారసులను తెరపైకి రావడం, వారి పేరున రికార్డులను సృష్టించడం కలకలం రేపింది. కాగా, ప్రభుత్వ భూమి >>2

వార్త

> జీవితంలో విజయం సాధించాలంటే మెట్లవైపు చూస్తూ ఉండక, వాటివైపు పయనం సాగించాలి.
>
> - మార్షల్

# ప్రజాభిప్రాయానిదే పైచేయి!

ప్రజా జీవితాలను ప్రభావితం చేసే కీలక అంశాలపై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే అవకాశం ప్రజలకు ఇస్తే అలాంటి సందర్భంలోనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని చెప్పుకోవాలి. ఈ మధ్యనే స్విట్జర్లాండ్ ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి ప్రపంచానికే ఆదర్శంగా నిలబడింది. అదేదో సాదాసీదా విషయం కాదు. ఒకవేళ ప్రజలు ఔనన్నా కాదన్నా దాని అమలుకు బోలెడంత తతంగముంది. స్విట్జర్లాండ్ దేశ జనాభాను పది మిలియన్లకే పరిమితం చేయాలన్న ప్రతిపాదనను ప్రజలు తిరస్కరించారు. వలసలను నియంత్రించడం ద్వారా దేశంలోని గృహ సమస్య, రవాణా వ్యవస్థపై పెరుగుతున్న ఒత్తిడి నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల రీత్యా ఈ ప్రతిపాదనపై రిఫరెండం నిర్వహించారు. ఎన్నో అంశాలలో ముడిపడి ఉన్న జనాభా నియంత్రణ విషయంలో స్విస్ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారంటే వారి విజ్ఞతను మెచ్చుకోవాల్సిందే. వలసల నియంత్రణ, దేశీయ వనరుల పరిరక్షణ, మౌలిక సదుపాయాలపై పెరుగుతున్న ఒత్తిడి వంటి అంశాలపై ప్రభావితం చూపే ప్రతిపాదనను జనం గట్టిగా వ్యతిరేకించారు. 55 శాతం మంది వ్యతిరేకంగా 45 శాతం మంది అనుకూలంగా ఓటు వేశారు. ఆర్థికాభివృద్ధికి అవసరమైన నిపుణత కలిగిన విదేశీ కార్మికులు, యూరోపియన్ యూనియన్‌తో ఉన్న ఆర్థిక సంబంధాలు, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలను కూడా ప్రజలు పరిగణనలోకి తీసుకుని ఉంటారు. ప్రస్తుతం స్విట్జర్లాండ్‌కు వలసలు ఆగిపోయినట్లు భావించలేము. గృహాల కొరత, పెరుగుతున్న జనాభా ఈ దేశంలో చర్చనీయాంశమే. వలసలపై సమతుల్య విధానాలు, పట్టణ ప్రణాళిక, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి నిర్మాణాత్మక చర్యల ద్వారా పరిష్కారం సాధ్యమని స్విట్జర్లాండ్ ప్రభుత్వం ప్రజలకు సంకేతాలు పంపినట్లయింది. తాజాగా రైట్‌వింగ్ పార్టీ ఆధ్వర్యంలో 'సస్టెయిన్‌బిలిటీ ఇనీషియేటివ్ ఆధ్వర్యంలో రిఫరెండమ్ నిర్వహించారు. ప్రజాభిప్రాయం స్పష్టంగా ఉన్నందున సరిపోయింది. లేకుంటే స్విట్జర్లాండ్ ప్రభుత్వం బాగా ఆపసోపాలు పడాల్సి ఉండేది. 2050 నాటికి దేశ జనాభా కోటి మార్కులను దాటకుండా రాజ్యాంగ సవరణ చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం స్విట్జర్లాండ్ జనాభా సుమారు 91 లక్షలుగా. జనాభా క్రమేపీ పెరుగుతుండే కొద్దీ వలస నిబంధనలు కుటుంబ పునరేకీకరణ వంటి అంశాల్లో నిబంధనలు కఠినతరం చేయాల్సి ఉంటుంది. కోటి జనాభాకు చేరితే యూరోపియన్ యూనియన్‌తో ఉన్న ఆర్థిక స్వేచ్ఛా కదలికలను పునర్నిర్వచించుకోవాల్సి వస్తుంది. వలసల కారణంగా దేశంలో ఇళ్ల కొరత, రవాణా ఆరోగ్య సంరక్షణ, విద్య, పర్యావరణంపై తీవ్ర ఒత్తిడి పెరుగుతున్నందన్న జీవన ప్రమాణాలను కాపాడుకోవడమూ ముఖ్యమే. ఆది నుంచి స్విట్జర్లాండ్ ప్రభుత్వం, పార్లమెంట్, వాణిజ్యవర్గాలు జనాభా పరిమితి ప్రతిపాదనను వ్యతిరేకించాయి. ఈ మార్పులన్నీ దేశ ఆర్థికవ్యవస్థకు భారీ నష్టం చేకూరుస్తుందని, ఫార్మా, టెక్, ఫైనాన్స్ వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన విదేశీ కార్మికులపైనే దేశంఆధారపడి ఉంటుంది. ఒకరకంగా 'స్విస్ బ్రెగ్జిట్'కు దారితీయవచ్చని వారి ఆందోళన. అభివృద్ధి, భద్రత, వలసలు, ఉపాధి వంటి సంక్లిష్ట అంశాలను భావోద్వేగాలతో కాకుండా దీర్ఘకాలిక జాతీయప్రయోజనాల దృష్టి లో కోరినట్లయితే ప్రజలే మంచి తీర్పుఇవ్వగలరని, ప్రస్తుత పరిణామం తేటతెల్లం చేసింది. కొన్ని సవాళ్లను ప్రజాస్వామ్యయుత చర్చలద్వారా సమగ్రంగా పరిష్కరించుకోగలరని స్విస్ ప్రజలు సంకేతమిచ్చారు. ప్రజాస్వామ్యంలో చర్చ, వాదన, విభిన్న అభిప్రాయాలు తప్పవు. ప్రపంచంలోని అనేక దేశాల్లో వలసల అంశం రాజకీయంగా అత్యంత సున్నితమైనదిగానే పరిగణించాలి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ వంటి దేశాల్లో కూడా వలసలపై తీవ్రమైన ప్రభావితం జరుగుతోంది. భద్రత, ఉపాధి, సంస్కృతి, జాతీయ గుర్తింపు వంటి అంశాలతో ఈ చర్చలు ముడిపడి ఉంటాయి. వేటికైనా ప్రస్తుత పరిస్థితులలో విధాన నిర్ణయాల ద్వారానే సమస్య పరిష్కారం దొరుకుతుంది. ప్రజల్లో ప్రజాస్వామ్యంపై విశ్వాసం, రాజకీయ చైతన్యం, బాధ్యతాయుత నిర్ణయ సామర్థ్యం ఉన్న సందర్భాలలో దేశాలు మరింత బలపడతాయి. స్విట్జర్లాండ్ అంటేనే ఓ విభిన్నత గోచరిస్తుంది. ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఎన్నికలతో ముగిసిపోదు. కీలక విధానాలు, రాజ్యాంగ సవరణలు, పన్నులు, పర్యావరణం, సామాజిక సంక్షేమం, వలసలు వంటి అన్ని అంశాలపై నిర్ణయాలన్నీ ప్రజలే నేరుగా తీర్పు చెప్పడం అలవాటుపడ్డారు. ప్రపంచ రాజకీయాల్లో వలసల సమస్యఎక్కువగా ఉంది. స్విట్జర్లాండ్ జనాభా తక్కువ మందే అయినా అత్యంత అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలో ఒకటి. అందుచేతనే ఇలాంటి ఒత్తిడి తక్షణ మార్పును సూచించలేవు. నైపుణ్య ఆధారిత వలస విధానాన్ని అమలు అన్నిటికీ మేలు. స్విస్ ప్రజలు స్థానిక ప్రయోజనాలను కాపాడుకుంటూనే ప్రపంచీకరణ వలన కలిగిన ప్రయోజనాలను కూడా అంగీ కరించడం విశేషం. వలసలు, ఆర్థిక వ్యవస్థ, జాతీయ గుర్తింపు మధ్య నలిగిపోతున్న అన్ని అభివృద్ధి చెందిన దేశాలకూ ఈ తీర్పు వర్తిస్తుంది. 2002లో యూరోపియన్ యూనియన్‌లో ఒప్పందం తర్వాత జనాభా 25శాతం పెరిగింది. ఇందులో 28 శాతం విదేశీయులున్నారంటే వలసల ఒత్తిడి ఏమేరకు ఉన్నదో అర్థమౌతుంది. స్విట్జర్లాండ్ అనగానే వృద్ధుల దేశం. జనాభా ఇంకా పెరిగితే ప్రభుత్వం నుంచి తాము పొందే సౌకర్యాలపై వేటు పడుతుందనే భయంతో ఈ ఓటింగ్ ఈ మేరకు వచ్చిందనుకోవాలి. పట్టణ ప్రాంతాలు, ఫ్రెంచి కాంటన్లు 70 మంది ఈ ప్రతిపాదనను వ్యతిరేకించినవారిలో ఉన్నారు. కోటి జనాభా పరిమితితో యూరోపియన్ యూనియన్‌తో ఒప్పందాన్ని తెంచుకోవడమంటే ఆత్మహత్యసదృశ్యమే అవుతుంది.



> ఆత్మవిశ్వాసం లేకపోవడమే మన అపజయా లెన్నింటికో ప్రధాన కారణం.
>
> సి.బావే



> అతి సామాన్యమైన జీవితం గడపడానికి ఆసక్తి, అధికమైన ఆలోచనా శక్తి గొప్పవారి జీవిత సూత్రాలు.
>
> వి.జాన్సన్

## ప్రజావాక్కు



### గల్ఫ్ దేశాల్లో భారతీయ మహిళల ఇక్కట్లు!

ఈమధ్య కాలంలో ఉభయగోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర జిల్లాల నుండి పొట్ట కూటి కోసం, తమ కుటుంబాన్ని పోషించకోవడం కోసంఎందరో గ్రామీణ మహిళలు స్థానిక ఏజెంట్ల మాటలు నమ్మి, నకిలీవీసాలతో సౌదీ అరేబియా, దుబాయ్, బహ్రెయిన్ తదితర గల్ఫ్ దేశాలకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడి యజమానులు ఏ మాత్రం మానవత్వం చూపకుండా భారతీయ మహిళల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటున్నట్లు పత్రికల్లో ఎక్కువగా కథనాలువస్తున్నాయి. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతమంత్రినారా లోకేష్‌చొరవతో అక్కడ ఇబ్బందిపడుతున్న కొందరు మహిళలకువిముక్తి కలిగించి స్వదేశానికి తిరిగి వచ్చే ఏర్పాట్లు చేసినట్లుగా కూడా పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏజెంట్లను కట్టడిచేసి, సామాన్య ప్రజల జీవన, ఆర్థిక స్థితిగతులు మారేలా చర్యలు చేపట్టాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### మతోన్మాదం రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకోవాలి

తాజ్ మహల్ కింద శివాలయం ఉందని ఎవరూ కోర్టులో కేసు వేశారు. అంటే దీన్ని పడగొట్టి మరల శివాలయం నిర్మించాలనా! బుద్ధిలేని ఆలోచన.దేశంలో 1947 ఆగస్టు 15 నాటికి పురాతన కట్టడాలు ఎలా ఉన్నాయో వాటిని అలాగే ఉంచాలని రాజ్యాంగం చెప్తుంది.వాటికింద ఏమి ఉన్నాయో అవసరంలేదు. శంకరాచార్యుడు ఆనాటి రాజులను ఆకట్టుకొని, బౌద్ధాన్ని నాశనంచేసి వాటి శిథిలాలపై హిందూ దేవుళ్ళ ఆలయాలు నిర్మించాడు. ఆపదమొక్కులవానిగా పేరుగాంచిన తిరుపతి వెంకన్న విగ్రహం ఒక పుట్టిజైనవిగ్రహమని, తరువాతవీరభద్రుని విగ్రహంగాను, రామానుజుని కాలంలో వేంకటేశ్వరుని గాను మారిందని " ది హిస్టరీ ఆఫ్ సౌత్ ఇండియన్ టెంపుల్స్'లో ప్రముఖ చరిత్ర కారుడు స్పష్టంగా వ్రాశాడు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఫసల్ బీమా యోజన అమలు చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా అత్యల్ప వర్షపాత నమోదు, ఎల్నినో ప్రభావం దృశ్య వర్షా ఆధారిత పంట దిగుబడి చాలా తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉంది. రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాద ఉంది. కావున రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేస్తే రైతులకు కొంతైనా మేలు జరిగే అవకాశం ఉంది.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ఇవి బస్సులతో ప్రమాదం

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) ఇటీవల మరోసారి అగ్నిప్రమాదానికి గురైన జేబీఎం ఎలక్ట్రిక్ బస్సులను తాత్కాలికంగాసేవల నుంచి ఉపసంహరించుకోవడం సమయోచిత నిర్ణయం. ప్రయాణికుల భద్రత కంటే ముఖ్యమైనది మరొకటి లేదు. విద్యుత్ బస్సులు పర్యావరణ పరిరక్షణకు, కాలుష్యనియంత్రణకు ఉపయోగపడుతున్నప్పటికీ, తరచూ చోటుచేసుకుంటున్న బ్యాటరీ సంబంధిత అగ్నిప్రమాదాలు ప్రజల్లోఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఘటనలు ఆధునిక సాంకేతికతలో నాణ్యతా ప్రమాణాలు, థర్మల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థల పనితీరు, భద్రతా పరీక్షల విశ్వసనీయతపై మరింత లోతైనపరిశీలన అవసరాన్ని సూచిస్తున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల్లో బ్యాటరీల నాణ్యత, ఉష్ణ నియంత్రణ వ్యవస్థ, అత్యవసర భద్రతా పరికరాలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. కేవలంఅగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయడం మాత్రమే సరిపోదు. ప్రమాదాలకు దారితీసే మూల కారణాలను గుర్తించి వాటిని శాశ్వతంగా నివారించే చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం నిపుణుల కమిటీతో పాటు ప్రముఖశాస్త్రీయ సంస్థలసహకారంతో జరుగుతున్న విచారణను వేగవంతం చేసి, దాని ఫలితాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించడం అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పెరుగుతున్న లింగ వివక్ష

భారతదేశంలో ఆర్థిక, సాంకేతిక రంగాలు వృద్ధి చెందుతున్నప్పటికీ లింగవివక్ష రూపం మార్చుకుని కొనసాగుతోంది. క్షేత్రస్థాయి పరిశీలనలు భిన్నమైన వాస్తవాలను చూపుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయక పురుషాధిక్య ధోరణులు, బాల్యవివాహాలు, చదువు ఆపివేయడం వంటి సమస్యలు ఉన్నాయి. వ్యవసాయరంగంలో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ మహిళా కూలీలకు తక్కువ వేతనాలు ఇస్తున్నారు. భూమిపై యాజమాన్య హక్కులు లేకపోవడం వల్ల మహిళలు ఆర్థిక స్వయంప్రతిపత్తి సాధించలేకపోతున్నారు.

- ఎన్.రామారావు, నల్గొండజిల్లా

### రైతులకు ఆసరా కల్పించాలి

ఈ సీజన్లో తెలంగాణలో ఎక్కువ మొత్తంలో పూడిక తీత పనులు జరుగుతున్నాయి. తెలంగాణ గ్రామీణా ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణలోను తెలంగాణ వ్యవసాయంలో ఉత్పత్తి ఉత్పద్దకతను పెంచడంలో పూడిక తీత పనులు ఉపయోగపడుతాయి. పభుత్వం దృష్టిపెట్టాలి.ఎక్కువ పంటలు ఉపాధి హామీ కింద వచ్చేట్టు చూసి రైతులకు ఎంతో కొంత ఆసరా కల్పించాలి.

- బి. అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)


# విద్యార్థుల్లో విదేశీవిద్యపై తగ్గుతున్న మోజు

*విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ, కఠినమైన వీసా నిబంధనలు, అధిక ఖర్చుల కారణంగా కోవిడ్19 తరువాత విదేశాలకు వెళ్లేవారి సంఖ్య తగ్గిందని ఇటీవలి గణాంకాలుసూచిస్తున్నాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, గత రెండేళ్లలో విదేశాలకువెళ్లే భారతీయ విద్యార్థులసంఖ్య 31శాతం తగ్గింది. 2023లో 9.08లక్షలుగా ఉన్న ఈ సంఖ్య 2025నాటికి 6.26లక్షలకు పడిపోయింది. కెనడా, ఆస్ట్రేలియా, యూకే, అమెరికాలో కఠినమైన వీసా నిబంధనలు, పెరుగుతున్న ఖర్చులే ఈ తగ్గదలకు కారణం. అమెరికా, యూరో పియన్ యూనియన్ ఆర్థిక సవాళ్లు, ఏఐ కారణంగా ఏర్పడుతున్న ఉద్యోగాల అనిశ్చితి, వలస వ్యతిరేక ఉద్యమాలు మేధో వలసల తిరోగమనానికి ఉత్ప్రేరకంగా మారే అవకాశం లేకపోలేదు.*



యేచన్ చంద్ర శేఖర్

కొన్ని శతాబ్దాల క్రితం వరకు కూడా భారత్ ప్రపంచ జ్ఞాన కేంద్రంగా గుర్తింపు పొందింది. వాణిజ్యం, ఆధ్యాత్మికత, గణితం, తత్వశాస్త్రం వంటి రంగాలలో దీని చారిత్రక ప్రభావం బాగా విస్తరించడంతో ప్రపంచవ్యాప్తంగా పండితులు ఇక్కడి ప్రాచీన విద్యా కేంద్రాలకు ఆకర్షితులయ్యారు. ఐరోపాలో ఆధునిక విశ్వవిద్యాలయాలు స్థాపించబడటానికి చాలా ముందు, ప్రాచీన భారతదేశం ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా విలసిల్లడంతో వేలాది మంది విదేశీయులు భారత ఉపఖండంలో చదువుకోవడానికి వచ్చేవారు. ప్రత్యేకించి తత్వశాస్త్రం, వైద్యం, ఖగోళ శాస్త్రాలను నేర్చుకోవడానికి పండితులు ప్రమాదకరమైన భూ, సముద్ర మార్గాల గుండా ఇక్కడికి వచ్చేవారు. మారిన కాలమాన పరిస్థితుల కారణంగా 1990ల చివరి నుండి 2010ల మధ్య వరకు భారతదేశం నుండి మేధో వలసలు (బ్రెయిన్ డ్రైన్) అధికమయ్యాయి. స్వదేశంలో అవకాశాల లేమితో భారీ సంఖ్యలో ఇంజనీర్లు, వైద్యులు, ఐటీ నిపుణులు విదేశాలకు తరలివెళ్లారు. అమెరికాలో సరళీకృత హెచ్1బి వీసా విధానాలు, ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగం విస్తరించడం ఈ వలసలకు ప్రధాన కారణం. అయితే 'వికసిత్ భారత్' లక్ష్యంగా భారతదేశాన్ని మరోసారి తిరిగివిశ్వగురువు స్థానంలో నిలబెట్టాలన్న కృతనిశ్చయంతో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం విదేశాల్లో ఉన్న అత్యంత ప్రతిభావంతులైన విద్యార్థులు, వృత్తి నిపుణులను తిరిగి భారతదేశానికి రప్పించేందుకు ప్రత్యేక కృషి చేస్తోంది. భారతదేశం నుండి మేధో వలస 1960, 1970వ దశాబ్దాలలో బాగా ఊపందుకుంది. మొదట్లో స్వల్ప సంఖ్యలో శాస్త్రవేత్తలు, వైద్యులు, ఇంజినీర్లతో మొదలైన వలసలు, తరువాత ప్రపంచవ్యాప్తంగా అత్యంత నైపుణ్యంగల శ్రామికులకు డిమాండ్ పెరగడంతో మరింత వేగవంతమైంది. ఈ సామూహిక వలసలకు కారణాలు విదేశీ అవకాశాలు ప్రధానంగా దోహదమయ్యాయి. 1960 నుండి 1980 దశకాలలో భారతదేశంలో జటిలమైన లైసెన్స్ విధానాలు, నియంత్రణతో పాటు పెట్టుబడిదారుల అనుకూల విధానాలు లేకపోవడంతో ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలలో, పరిమిత దేశీయ ఉద్యోగావకాశాలు ఉండేవి. ఆ సమయంలో మౌలిక సదుపాయాల కొరత కూడా ఉండేది. పరిశోధన, అభివృద్ధి కోసం తక్కువ బడ్జెట్ కేటాయింపులు, అగ్రశ్రేణి సౌకర్యాల కొరత స్వదేశానికి తిరిగిరావాలనుకునే పారిశ్రామికవేత్తలను, శాస్త్రవేత్తలను తీవ్రంగా నిరాశపరిచింది. అదే సమయంలో సబ్సిడీ విద్యలో అసమతుల్యత కారణంగా ఐఐటీలు, ఎయిమ్స్ వంటి అత్యంత పోటీతత్వ సంస్థలు ప్రపంచ స్థాయి నిపుణులను తయారు చేసినప్పటికీ, వారి సేవలను దేశీయంగా వినియోగించుకోవడంలో మాత్రంచతికిలబడ్డాయి. సహజంగానే నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులు మెరుగైన జీతం, విలాసవంతమైన జీవనశైలి కోసం అభివృద్ధి చెందిన దేశాలు, ముఖ్యంగా యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్‌కింగ్‌డమ్ కెనడాకు వలసపోయారు. అంతేకాకుండా, పాశ్చాత్య దేశాలలోని అనుకూలమైన వలస చట్టాలు, దేశీయ కొరతను పూరించడానికి విద్యావంతులైన, ఆంగ్లం మాట్లాడడంతో పాటు కష్టపడేతత్వం గల భారతీయ నిపుణులకు అవకాశాలు మెండుగా ఉండడం, కూడా వలసలను బాగా ప్రోత్సహించాయి. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల ప్రయాణాలు, అనాదిగా కొనసాగుతున్న మేధో వలస ధోరణికి చక్కటి ఉదాహరణలు. భారతీయ నిపుణులు ప్రపంచ ప్రతిభా రంగంలో ఆధిపత్యం చెలాయిస్తూ కీలక



ఆర్థిక వ్యవస్థలలో స్థానిక ఉద్యోగుల కంటే అధిక మధ్యస్థ జీతాలను పొందుతున్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్, ఫైనాన్స్, ఆరోగ్య సంరక్షణ రంగాలలో భారీ ప్రతిభ కొరత కారణంగా, ప్రపంచం ప్రధాన కేంద్రాలలో భారతీయ నైపుణ్యంపై ఎక్కువగా ఆధారపడుతోంది. అమెరికాలో అధిక వేతనాలకు అవకాశంగల స్టెమ్, కార్పొరేట్ ఉద్యోగాలలో భారతీయులు ఆధిపత్యం చెలాయిస్తూ అమెరికా పౌరులకంటే 10 వేలు అధికంగా సగటున లక్షా నలభై వేల డాలర్లు సంపాదిస్తున్నారు. టెక్, సెమీకండక్టర్లు, ఏఐ రంగాలలో భారతీయులు విశేషంగా రాణిస్తున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లో కూడా భారతదేశానికి చెందిన స్కిల్డ్ వర్కర్ వీసా హోల్డర్లు స్థానికుల కంటే గణనీయంగా యేడాదికి సగటున 96,000 పౌండ్లు సంపాదిస్తున్నారు. జర్మనీలో ఆపర్చునిటీ కార్డ్ (ఛాన్సెన్‌కార్టే) వంటి కార్యక్రమాల ద్వారా భారీగా ప్రయోజనం పొందుతూ, భారతీయులు ఆటోమోటివ్ ,మెకానికల్ ఇంజినీరింగ్‌తో పాటు డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలలో కీలకంగా రాణిస్తున్నారు. పన్ను రహిత సంపాదన సామీప్యత కారణంగా యుఏఇలో భారతీయులు ఫైనాన్స్, టెలికమ్యూనికేషన్స్, క్లౌడ్ టెక్నాలజీస్ రంగాలలో రాణిస్తున్నారు. కెనడా, ఆస్ట్రేలియాలో నిరంతరం కొరత ఉండే హెల్త్‌కేర్, ఐటి రంగాలలో భారతీయులు పాయింట్ల ఆధారిత ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ, స్కిల్డ్ పిఆర్ కార్యక్రమాల ద్వారా వలసపోతున్నారు. భారతదేశాన్ని దీర్ఘకాలంగా పీడిస్తున్న ఈ మేధో వలసను అరికట్టడంతో పాటు దానిని దేశాభివృద్ధికి దోహదపడే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోంది. ప్రపంచంలోని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలు, ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థలలో సేవలందిస్తున్న భారతీయ సంతతికి చెందిన ప్రతిభావంతులైన పరిశోధకులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులువృత్తి నిపుణులను, భారతదేశంలోని కీలకప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలు, జాతీయ ప్రయోగశాలలుపరిశోధనా కేంద్రాలతో కలిసి పరిశోధనలు చేయడానికి ఆహ్వానిస్తోంది. ఈ ప్రత్యేక చొరవకింద, విద్యా మంత్రిత్వ శాఖ ప్రధాన మంత్రి పరిశోధన పీఠం పథకం 2026" (ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఛైర్ స్కీం 2026) కోసం 13 ప్రాధాన్యతా రంగాలను గుర్తించి దరఖాస్తులను ఆహ్వానించింది. 2026-27 నుండి 2030-31 వరకు 5సంవత్సరాల పాటు రూపొందించబడిన ఈ కార్యక్రమానికి రూ.200 కోట్ల బడ్జెట్ కేటాయించబడింది. ఫెలోషిప్‌లు, పరిశోధన గ్రాంట్లు, పునరావాస ఖర్చులుసంస్థాగత నిర్వహణ ఖర్చులను భరించడానికి ఈ ప్యాకేజీలు మూడు శ్రేణుల వర్గాలుగా రూపొందించబడ్డాయి. యంగ్ రీసెర్చ్ ఫెలోస్ రూ.4 కోట్ల వరకు, సీనియర్‌రీసెర్చ్ ఫెలోస్ రూ.6.50 కోట్ల వరకు, రీసెర్చ్ ఛైర్స్ రూ.14 కోట్ల వరకు పొందవచ్చు. స్వదేశానికి తిరిగివచ్చే నిపుణులకుఇక్కడ జీతభత్యాలు, పరిశోధనా మౌలిక సదుపాయాలు, పని చేసే స్వేచ్ఛ వంటివి ఏమి లభిస్తున్నాయనేది కీలకంగా మారనుంది. ప్రపంచ శాస్త్రీయ ప్రతిభకు భారతదేశం ఎంత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారుతుందో ఈ అంశాలు నిర్ణయిస్తాయి. విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ, కఠినమైన వీసా నిబంధనలు, అధిక ఖర్చుల కారణంగా కోవిడ్19 తరువాత విదేశాలకు వెళ్లేవారి సంఖ్య తగ్గిందని ఇటీవలి గణాంకాలుసూచిస్తున్నాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, గత రెండేళ్లలో విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థులసంఖ్య 31శాతం తగ్గింది. 2023లో 9.08 లక్షలుగా ఉన్న ఈసంఖ్య 2025 నాటికి 6.26 లక్షలకు పడిపోయింది. కెనడా, ఆస్ట్రేలియా, యూకే, అమెరికాలో కఠినమైన వీసా నిబంధనలు, పెరుగుతున్న ఖర్చులే ఈ తగ్గదలకు కారణం. అమెరికా, యూరోపియన్ యూనియన్ ఆర్థిక సవాళ్లు, ఏఐ కారణంగా ఏర్పడుతున్న ఉద్యోగాల అనిశ్చితి, వలస వ్యతిరేక ఉద్యమాలు మేధో వలసల తిరోగమనానికి ఉత్ప్రేరకంగా మారే అవకాశం లేకపోలేదు. ●

# ఎల్‌నినో ప్రభావం ఆహార ధాన్యాల ఉత్పత్తిపై పడనుందా?

జి. సత్యనారాయణరాజు

ప్రస్తుతం వాతావరణ శాస్త్రవేత్తలు, అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఎల్‌నినో గురించే తీవ్రంగా ఆందోళన చెందుతున్నాయి. 2026మధ్య నాటికి పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు చాలా వేగంగా పెరుగుతుండటంతో, ఈ ఏడాది సాధారణ ఎల్‌నినో కంటే ప్రమాదకరమైన 'సూపర్ ఎల్‌నినో'అంటే అత్యంత బలమైన ఎల్‌నినో ఏర్పడే అవకాశాలు 60శాతం పైగా ఉన్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ, అమెరికాకు చెందిన ఎన్ఓఎఎ హెచ్చరిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రత సగటు కంటే 2లేదా అంతకంటే ఎక్కువ పెరిగితే దానిని 'సూపర్ ఎల్‌నినో' లేదా 'వెరీ స్ట్రాంగ్ ఎల్‌నినో' అని పిలుస్తారు. గత 140 ఏళ్లలోనే ఇది అత్యంత శక్తివంతమైనదిగా మారే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. సూపర్ ఎల్‌నినో వల్ల ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయి వేడి రానుంది. ఇప్పటికే గ్లోబల్ వార్మింగ్ వల్ల భూమి వేడెక్కుతోంది. దీనికి సూపర్ ఎల్‌నినో తోడైతే, 2026 ద్వితీయార్థం, 2027 ప్రారంభంలో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు మునుపెన్నడూ లేని విధంగా పెరిగిపోయి, తీవ్రమైన హీట్‌వేవ్స్ వీస్తాయి. సాధారణ ఎల్‌నినో వస్తేనే భారత్‌లో వర్షాలు తగ్గుతాయి. అదే సూపర్ ఎల్‌నినో వస్తే రుతుపవనాలు పూర్తిగా బలహీనపడి, దేశంలోని కేంద్ర, ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో తీవ్రమైన కరువు ఏర్పడే ప్రమాదం ఉంది. ఆస్ట్రేలియా, ఇండోనేషియా, అమెజాన్ అడవుల్లో పిడుగులు, అడవి మంటలు పెరిగే అవకాశం ఉంది. అలాగే భారత్‌తోపాటు ఆసియాదేశాలలో వ్యవసాయ దిగుబడులు దారుణంగా పడిపోయి ఆహారకొరత ఏర్పడవచ్చు. ఎల్‌నినోవల్ల ఒకవైపు కరవువస్తే, మరోవైపు తూర్పుఆఫ్రికా, అమెరికాలోని కొన్ని ప్రాంతాలు, పెరూ, ఈక్వెడార్ వంటి దేశాలలో అసాధారణ భారీవర్షాలు, వినాశకరమైన వరదలు ముంచెత్తుతుంటాయి. పసిఫిక్ మహాసముద్రంలో గాలి దిశలు వేగంగా మారుతున్నాయి. అక్కడ ఏర్పడిన కొన్ని అసాధారణ తుఫానుల వల్ల వేడి నీరు తూర్పు వైపునకు నెట్టబడుతోంది. దీనివల్ల ఎల్‌నినో తీవ్రత రోజురోజుకూ బలపడుతోంది. వాతావరణ నిపుణుల ప్రకారం రాబోయే ఆగస్టు, నవంబర్ అత్యంత కీలకంగా భావిస్తున్నారు. ఈ సూపర్ ఎల్‌నినో గనుక పూర్తిస్థాయిలో విజృంభిస్తేప్రపంచ ఆర్థికవ్యవస్థ, వ్యవసాయ రంగంపై దీని ప్రభావం చాలా కాలం పాటు ఉంటుందని ఆహార నిపుణులు ఆందోళనకు గురవుతున్నారు. ఎల్‌నినో ప్రభావం భారత ఆహార ఉత్పత్తి రంగంపై ఖచ్చితంగా పడనుంది. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం అంటే దాదాపు 92శాతం వరకూ నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తం ఆహారఉత్పత్తిలో దాదాపు 40ఖరీఫ్ సీజన్ నుంచే వస్తుంది. వర్షాలు సకాలంలో పడకపోతే, లేదా తక్కువగా ఉంటే ప్రధాన ఖరీఫ్‌పంటలైన వరి, పప్పుధాన్యాలు, సోయాబీన్, జొన్నలు, మొక్కజొన్న, పత్తిసాగుపై తీవ్రప్రభావం పడుతుంది. అదిరాబోయే రోజుల్లో ఆహార సంక్షోభానికి కారణం అవుతుంది. వర్షాలు తక్కువగా పడటంవల్ల నదులు, డ్యామ్‌లలో నీటి మట్టాలు పడిపోతాయి. ఇప్పుడు వర్షాలు పడకపోతే చాలామటుకు రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీకి చేరవచ్చు. రిజర్వాయర్ల నుంచి ఉత్పత్తిఅయ్యే విద్యుత్ కూడా తగ్గుతుంది. ఖరీఫ్ ముగిసిన తర్వాత వచ్చే రబీ సీజన్‌లో పండించే గోధుమలు, శనగలు, ఆవాలు వంటి పంటలకు జలాశయాల్లోని నీరే ప్రధాన ఆధారం. ఎల్‌నినో ప్రభావంతో జలాశయాలు ఎండిపోతే రబీ పంటల దిగుబడి కూడా తగ్గుతుంది. వర్షాలు కురవకుండా, ఎండలు ఎక్కువగా ఉంటే భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతుంది. ఆహార ఉత్పత్తి తగ్గితే మార్కెట్‌లో డిమాండ్‌కు సరిపడా సరఫరా ఉండదు. దీనివల్ల బియ్యం, పప్పులు, వంటనూనెల ధరలు విపరీతంగా పెరిగే ప్రమాదం ఉంది. ఇది సామాన్యుల బడ్జెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. భారతదేశం పెట్రోల్‌లో ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యాల కోసం చెరకు, మొక్కజొన్న, విరిగిన బియ్యాన్ని ఎక్కువగా ఉపయోగిస్తోంది. ఎల్‌నినో వల్ల చెరకు, మొక్కజొన్న దిగుబడి తగ్గితే, ప్రభుత్వం ఇంధనం కంటే దేశ ఆహార భద్రతకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. దీనివల్ల ఇథనాల్ ఉత్పత్తి వ్యూహాలు మారవచ్చు. తక్కువ నీటితో పండే చిరుధాన్యాల సాగు, బిందు సేద్యం ముందస్తు నీటి యాజమాన్య పద్ధతుల ద్వారా ఈ నష్టాన్ని కొంతవరకు తగ్గించవచ్చు. ●

# బాల్య వివాహాలు సమాజానికి సవాళ్లు!

మేకిరి దామోదర్

సమాజం ఎంత ఆధునికమవుతున్నా, విద్యా ప్రమాణాలు పెరుగుతున్నా, సాంకేతికంగా ప్రపంచంతో పోటీ పడుతున్నా కుటుంబ వ్యవస్థను ప్రభావితం చేసే రెండు విరుద్ధ ధోరణులు ఇంకా మన ముందే నిలిచి ఉన్నాయి. ఒకవైపు చట్టాన్ని ధిక్కరించి జరుగుతున్న బాల్య వివాహాలు, మరోవైపు కెరీర్, ఆర్థిక స్థిరత్వం, వ్యక్తిగత లక్ష్యాల పేరుతో వివాహాలు, సంతానాన్ని మితిమీరిన స్థాయిలో వాయిదా వేయడం. ఈరెండు ధోరణులు వ్యక్తిగత జీవితాలనే కాదు, రేపటి తరాల ఆరోగ్యం, కుటుంబ బంధాలు, జనాభా నిర్మాణం, సామాజిక స్థిరత్వంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అందుకే ఈ సమస్యను భావోద్వేగాలతో కాకుండా శాస్త్రీయ, సామాజిక, ఆరోగ్యపరమైన దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉంది. చట్టం ప్రకారం అమ్మాయికి కనీస వివాహ వయస్సు 18సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు. అయినప్పటికీ దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన 2019-21 సర్వే ప్రకారం దేశవ్యాప్తంగా 23.3 శాతం మంది బాలికలు 18సంఃరాలు నిండక ముందే వివాహ బంధంలోకి అడుగు పెడుతున్నారు. పశ్చిమ బెంగాల్ (41.6 ), బీహార్ (40.8) అత్యధిక శాతంతో ముందుండగా, ఆంధ్రప్రదేశ్ (29.3) ఏడు, తెలంగాణ (23.5 ) ఎనిమిదో స్థానాల్లో ఉన్నాయి. జమ్మూ-కాశ్మీర్‌లో ఈ శాతం అత్యల్పంగా నమోదైంది. అబ్బాయిల పరిస్థితి కూడా భిన్నంగా లేదు. దేశవ్యాప్తంగా 17.7 శాతం మంది అబ్బాయిలు 21 సంవత్సరాలు నిండక ముందే వివాహం చేసుకుంటున్నారు. బీహార్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ అగ్రస్థానాల్లో ఉండగా తెలంగాణలో 16.3 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 14.5 శాతం నమోదైంది. ఈ గణాంకాలు అభివృద్ధి చెందుతున్న దేశానికి ఏమాత్రం శుభసూచకాలు కావు. బాల్య వివాహాల వెనుక అనేక సామాజిక, ఆర్థిక కారణాలున్నాయి. పేదరికం, ఆర్థిక ఇబ్బందులు, అమ్మాయి భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన చదువు మధ్యలో మానేయడం, సంప్రదాయాలు, మూఢనమ్మకాలు, కట్న భయం, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం. ప్రేమ వ్యవహారాల భయంతో తొందరపాటు నిర్ణయాలు. ఈ కారణాలన్నీ కలిసొచ్చి బాల్య వివాహాలకు దారితీస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. బాల్య వివాహాలు అధికంగా జరిగే గ్రామాల్లో వేలాది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 2025-26 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3,600 అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, 1,299 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. అంటే రోజుకు సగటున ముగ్గురు చిన్నారులను బాల్య వివాహాలబారిన పడకుండా రక్షించినట్లే. కొన్ని జిల్లాల్లో బాల్య వివాహాల



శాతం తక్కువగా ఉన్నప్పటికీ, హెల్ప్‌లైన్‌కు ఎక్కువ ఫిర్యాదులు రావడం ప్రజల్లో అవగాహన పెరుగుతోందనే సానుకూల సంకేతం. బాల్య వివాహం కేవలం చట్టవిరుద్ధ చర్య మాత్రమే కాదు; అది ఒక చిన్నారి జీవితాన్ని అనేక కోణాల్లో ప్రభావితం చేస్తుంది. చదువు మధ్యలో ఆగిపోవడం, ఉపాధి అవకాశాలు కోల్పోవడం, ఆర్థికంగా ఆధారపడే పరిస్థితి, చిన్న వయసులో గర్భధారణ, రక్తహీనత, పోషకాహార లోపం, ప్రసవ సమయంలో ప్రాణాపాయం, శిశు మరణాల ప్రమాదం, కుటుంబ హింసకు గురయ్యే అవకాశాలు పెరగడం వంటి అనేక సమస్యలు ఎదురవుతాయి. ఒక బాల్య వివాహం..ఒక తరం భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయంగా మారుతుంది. ఇప్పటి యువతలో మరో కొత్త సామాజిక ధోరణి వేగంగా పెరుగుతోంది. ఉన్నత చదువులు, విదేశీ ఉద్యోగాలు, కెరీర్, ఆర్థిక స్థిరత్వం, స్వేచ్ఛాయుత జీవనం వంటి కారణాలతో వివాహాలను సంవత్సరాల తరబడి వాయిదా వేస్తున్నారు. వివాహం అయిన తర్వాత కూడా పిల్లలను కనడానికి చాలాకాలం వేచి చూస్తున్నారు. 'ఇంకా సమయం ఉంది' అనే భావనతో తీసుకునే నిర్ణయాలు కొన్నిసార్లు జీవితాంతం బాధను మిగులుస్తున్నాయి. నేడు దేశవ్యాప్తంగా సంతానలేమి చికిత్సా కేంద్రాలు, ఐవీఎఫ్ కేంద్రాల సంఖ్య వేగంగా పెరుగుతోంది. దీనికి ఆధునిక వైద్యం అభివృద్ధి ఒక కారణమైతే, ఆలస్య వివాహాలు, ఆలస్య గర్భధారణలు మరో ప్రధానకారణమని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళల్లో 35సంవత్సరాల తర్వాత గర్భధారణ అవకాశాలు తగ్గడం, గర్భస్రావాల ప్రమాదం పెరగడం, ఇతర ఆరోగ్య సమస్యలు రావడం శాస్త్రీయంగా నిరూపితమైన అంశాలు. పురుషుల్లో కూడా వయస్సు, ఒత్తిడి, జీవనశైలి ప్రభావం సంతానోత్పత్తిపై ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఆధునిక జీవనశైలి కూడా కుటుంబ జీవితాన్ని ప్రభావితం చేస్తోంది. అధిక ఒత్తిడి, నిద్రలేమి, జంక్‌ఫుడ్, వ్యాయామం, లేకపోవడం, ఊబకాయం, ధూమపానం, మద్యపానం, వాయు కాలుష్యం, డిజిటల్ జీవనశైలి, ఇవన్నీ కలిసి యువత ఆరోగ్యాన్ని, భవిష్యత్ సంతాన అవకాశాలను ప్రభావితం చేస్తున్నాయి. సమతుల్య జీవన ప్రణాళిక అవసరం కెరీర్ అవసరం. ఆర్థిక స్వావలంబన అవసరం. జీవితంలో ప్రతి దశకు ఒక ప్రాధాన్యం ఉంటుంది. చదువు, ఉద్యోగం, వివాహం, కుటుంబం వీటన్నింటి మధ్య సమతుల్యత ఉండాలి. బాల్య వివాహాలను నిర్మూలించడంలో ప్రభుత్వయంత్రాంగం మాత్రమే కాదు, గ్రామపంచాయతీలు, పాఠశాలలు, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, మీడియా, ముఖ్యంగా తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి. ప్రతి బాలిక పాఠశాలలో ఉండాలి. ప్రతి యువకుడు, యువతి వివాహంపై శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలి. కుటుంబ ప్రణాళికపై సరైన సమాచారం అందుబాటులో ఉండాలి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశం ఎన్నో విజయాలు సాధిస్తున్న ఈ కాలంలో, ఒకవైపు బాల్య వివాహాలు, మరోవైపు అతిగా ఆలస్యమయ్యే వివాహాలు సమాజానికి రెండు విభిన్న దిశలనుంచి సవాళ్లు విసురుతు న్నాయి. బాల్య వివాహం జీవితాన్ని దెబ్బతీస్తే, అతిగా ఆలస్యమయ్యే వివాహం కూడా అనేక సందర్భాల్లో కుటుంబ ఆశయాలను సంక్లిష్టం చేయగలదు. సమతుల్యమైన నిర్ణయాలే ఆరోగ్యకరమైన కుటుంబాలకు, బలమైన సమాజానికి, భవిష్యత్ తరాలకు నిజమైన భరోసా. ●



బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివేదిక అందజేస్తున్న గోద్రేజ్ ప్రతినిధులు

## రూ.300కోట్లతో గోద్రెజ్ అయిల్ పామ్ ప్రాజెక్ట్

### సిఎం రేవంత్‌రెడ్డితో గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జులై8:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్(కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్‌స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి కలిశారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్య మంత్రికి రాకేశ్ స్వామి నివేదిక అందజేశారు. తెలంగాణలోనే మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యం లో పలు కీలక అంశాలపైన సీఎంచర్చించారు. ఖమ్మం జిల్లాలో రూ.300కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుంది.ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, ఆర్ అండ్ డీ కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5ఎకరాల భూమిని గోద్రేజ్ ఆగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సీడ్ గార్డెన్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని ఈ సంస్థ కోరింది. ప్రాసెసింగ్ మిల్ కోసం రోడ్డును విస్తరించాలని ముఖ్యమంత్రిని ఈ సంస్థ ప్రతినిధులు కోరారు. టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.




## భారత్-ఆసియాన్ ద్వైపాక్షిక వాణిజ్యం 128 బిలియన్ డాలర్లు

### న్యూఢిల్లీలో భారత్ ఆసియాన్ సంయుక్త సదస్సు

**న్యూఢిల్లీ, జులై 8:** భారత్-ఆసియాన్ దేశాలమధ్య అంతర్జాతీయ వాణిజ్యంలో సుమారు 11 శాతం వాటా ఆసియాన్‌తోనే ఉందని వాణిజ్యమంత్రిత్వ శాఖప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్-ఆసియాన్ ద్వైపాక్షిక వాణిజ్యం 128 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకుందని ఈ గణాంకాలు ఇరు పక్షాల మధ్య బలమైన ఆర్థిక భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని, భవిష్యత్తులో వాణిజ్యంతో పాటు పెట్టుబడి సహకారాన్ని మరింత విస్తరించేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని వాణిజ్యశాఖ ప్రకటించింది. బుధవారం జరిగిన సంయుక్త కమిటీ సమావేశానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వాణిజ్య విభాగ అదనపు కార్యదర్శి నితిన్ కుమార్ యాదవ్, మలేషియా పెట్టుబడులు, వాణిజ్యం మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ ట్రేడ్ డిప్యూటీ సెక్రటరీ జనరల్ మస్తూరా అహ్మద్ ముస్తఫా సంయుక్తంగా అధ్యక్షత వహించారు.ఈ సమావేశంలో ఆసియాన్‌కు చెందిన పది సభ్య దేశాలైన బ్రూనై, కంబోడియా, ఇండోనేషియా, లావో పీడీఆర్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం ప్రతినిధి బృందాలు పాల్గొన్నాయి. ఆసియాన్ దేశాలు భారతదేశానికి అత్యంత కీలక వాణిజ్య భాగస్వాముల్లో ఒకటిగా కొనసాగుతున్నాయి. వస్తు వాణిజ్య ఒప్పందం సమీక్ష ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న 13వ సంయుక్త కమిటీ సమావేశాలు ఈనెల 6 నుంచి 10 వరకు న్యూఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో జరుగుతున్నాయి. ఈ సమావేశాలు ప్రత్యక్ష, వర్చువల్ విధానాల సమ్మేళనమైన హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు.13వ సంయుక్త కమిటీ సమావేశాల సందర్భంగా ఆసియాన్ పరిధిలోని మొత్తం ఎనిమిది ఉప కమిటీలలో మూడు కీలక ఉప కమిటీల సమావేశాలు కూడా నిర్వహిస్తున్నారు.

## హద్దులు దాటితే సోషల్ మీడియాతో ముప్పు

### వైరల్ కంటే వాస్తవం ముఖ్యం

### ప్రింట్ మీడియా ప్రాముఖ్యత తగ్గకూడదు

### ఐజెయు సదస్సులో ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



**భద్రాచలం, ప్రభాతవార్త జులై 8:** ప్రజల ఆకాంక్షలను, మనోభావాలను మీడియావ్ వెల్లడించాలనీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ప్రజల మనోభారాలను తీర్చలేదని ఆయన అన్నారు. టియు డబ్ల్యు జే (ఐ జె యు ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం భద్రాచలంలో "సమాజం పై సోషల్ మీడియా ప్రభావం అనే అంశం పై సదస్సు నిర్వహించారు. టియుడబ్ల్యూజే (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాం నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సు లో శ్రీనివాస్ రెడ్డి ముఖ్య వక్త గా ప్రసంగించారు. చట్టం పరిధిలోకి రాని సోషల్ మీడియా పరిధి హద్దులు దాటితే ప్రమాదకరమని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలు ప్రభావం మంచి చెడులను నిర్దేశించే విధంగా తయారైందని ఇది అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. డిజిటల్ యుగంలో అసలైన జర్నలిస్టులు చట్ట పరిధిలోకి వస్తారని సోషల్ మీడియా ప్రతినిధులు చట్టం పది దాటి పనిచేస్తారని, వారికి గేట్ కీపర్ లేని కారణంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే అది సమాజానికి మంచిది కాదని అన్నారు. సమాజం మారుతున్న క్రమంలో ప్రచార సాధనాలలో మార్పులు సంభవించి చోటు చేసుకున్న పరిణామాలు ఇదే తరహాలో మునుముందు ఉంటాయనుకుంటే పొరపాటు అవుతుందని అన్నారు.ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచాన్ని చూడొచ్చని, సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న క్రమంలో మంచి చెడులను పరిగణలోకి తీసుకునే ఆలోచన పెరగకపోతే అది సమా జంపై విష ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. పత్రికల స్థానాన్ని ఎలక్ట్రానిక్ మీడియా మింగేసిన క్రమంలో యూరప్ లో పత్రికల మనుగడ అంతరించిపోయిందని తెలిపారు. ఈపరిస్థితి మనదేశంలో కూడా వచ్చే అవకాశం లేకపోలేదని స్పష్టం చేశారు. నిరక్షరాస్యత ఎక్కువగా ఉండటం వలన ఈ పరిణామం చోటు చేసుకుంటుందని పేర్కొన్నారు. రాబోయే కాలంలో డిజిటల్ యుగం సమాజాన్ని ఏలుతుందని ఇదే ఫైనల్ అవుతుందని అనుకుంటే పొరపాటు అవుతుందని అన్నారు. 2025 వరకు 14 ఇంటర్నెట్ కలెక్షన్లు ఉన్నాయని అత్యధికులు 44 ఏళ్ల లోపు వారే ఎక్కువగా దీని ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. ఇంటర్నెట్టు వీక్షి ంచే వారిలో 16 సంవత్సరాల నుండి 25 సంవత్సరాల వరకు ఉన్నవారు 33 శాతం మంది ఉన్నారని పేర్కొన్నారు. ఇంటర్నెట్ ద్వారా వ్యక్తిగత కమ్యూనికేషన్ పెంచుకోవచ్చని, కోట్లాదిమందికి సమాచారం అందించే శక్తి డిజిటల్ మీడియాకు వచ్చిందన్నారు.ఇదే ఇంటర్నెట్ ఒక్క సెకండ్లో వ్యక్తిని అప్రతిష్టపాలు చేసే అవకాశం కూడా ఉందని తెలిపారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రజలు ఆశించిన రీతిలో వార్తలు రాని కారణంగా సోషల్ మీడియాను ఆశ్రయిస్తున్న పరిస్థితి ప్రస్తుతం మనం చూస్తున్నామని తెలిపారు. ఐ జెయు జాతీయ సెక్రెటరీ జెనరల్ సోమసుందర్, ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకటరావు, పాయం వెంకటేశ్వర్లు, ఐ జె యు నేషనల్ కౌన్సిల్ సభ్యులు బివి రమణా రెడ్డి, టి యు డబ్ల్యు జే (ఐ జె యు ) రాష్ట్ర కమిటీ సభ్యులువేణు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు, జాగు వెంకట రత్నం, కార్యదర్శి జునుమాల రమేష్, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై అప్రమత్తమైన కేంద్రం..

### మహారాష్ట్ర, గుజరాత్, జమ్మూకాశ్మీర్ సిఎంలతో సమీక్షించిన అమిత్‌షా

**న్యూఢిల్లీ, జులై 8:** దేశంలోని పలు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల పరిస్థితిపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారం సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాలతో ఆయన ఫోన్‌లో మాట్లాడి తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. వర్షాల కారణంగా ఏర్పడిన అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో బుధవారం కుండపోత వర్షం కురవడంతో నగర జీవనం తీవ్రంగా అస్తవ్యస్తమైంది. లోకల్ రైళ్ల రాకపోకలు ఆలస్యమవడంతో ఉద్యోగులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత వారాంతం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మంగళవారం కొద్దిసేపు విరామం లభించినప్పటికీ, బుధవారం మళ్లీ భారీ వర్షం పడింది.మరోవైపు, పాల్ఘర్ జిల్లాలోని వసాయి-విరార్ రైల్వే మార్గంలో నీరు నిలిచిపోవడంతో గుజరాత్ వైపు వెళ్లే దూరప్రాంత రైళ్ల రాకపోకలు ఇంకా పూర్తిస్థాయిలో పునరుద్ధరించబడలేదు. అలాగే సోమవారం భోర్ ఘాట్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో అంతరాయం ఏర్పడిన ముంబై-పుణే మార్గంలో కూడా సేవలు పూర్తిగా సాధారణ స్థితికి చేరుకోలేదు.భారీ వర్షాల ప్రభావంతో ముంబైకి తాగునీరు సరఫరా చేసే ఏడు జలాశయాల్లో ఒకటైన తులసి సరస్సు నీటి మట్టం పెరిగి




అర్ధరాత్రి నుంచి పొంగిపొర్లడం ప్రారంభించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. నగరంలో, శివారు ప్రాంతాల్లో రోజంతా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది.ఇక గుజరాత్ దక్షిణ ప్రాంతంలో మంగళవారం అత్యంత భారీ వర్షాలు నమోదయ్యాయి. ముఖ్యంగా సూరత్ జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది. వర్షాలకు సంబంధించిన వేర్వేరు ఘటనల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, వరద ముప్పు ఉన్న ప్రాంతాల నుంచి సుమారు 2,100 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. సూరత్ జిల్లాలోని కామ్రేజ్ తాలూకాలో కేవలం 10 గంటల్లోనే 305 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల నేపథ్యంలో సూరత్, నవ్‌సారి జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు.గత 24 గంటల్లో సూరత్, వల్సాద్, దాద్రా అండ్ నగర్ హవేలీ ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణశాఖ వెల్లడించింది.సూరత్ మున్సిపల్ కమిషనర్ ఎం.నాగరాజన్ మాట్లాడుతూ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2,100 మందిని సురక్షిత శిబిరాలకు తరలించినట్లు తెలిపారు. జిల్లా విపత్తు నిర్వహణ శాఖ అధికారుల ప్రకారం, గత రెండు రోజుల్లో వర్షాలకు సంబంధించిన ప్రమాదాల్లో ఐదుగురు మరణించారు. బుధవారం విద్యుదాఘాతానికి ఇద్దరు, కామ్రేజ్ ప్రాంతంలో మరో వ్యక్తి మృతి చెందగా, సోమవారం రాండర్ ప్రాంతంలో విద్యుదాఘాతానికి ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు.జమ్మూ కశ్మీర్‌లోని దోడా జిల్లా తత్రీ పట్టణం ఎగువ ప్రాంతాల్లో మంగళవారం కురిసిన భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించాయి. దీంతో అనేక ఇళ్లు, దుకాణాలు, వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ వారం దోడా, కిష్త్వార్ జిల్లాల్లో వరదలు సంభవించడం ఇది మూడోసారి.ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో బండరాళ్లు, బురద, శిథిలాలు తత్రీ పట్టణంలోకి చేరడంతో భారీ నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. వరదల కారణంగా దోడా-కిష్త్వార్ జాతీయ రహదారి కూడా తత్రీ వద్ద మూసుకుపోవడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అంతకుముందు రోజు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా నిర్మాణంలో ఉన్న 540 మెగావాట్ల క్వార్ జలవిద్యుత్ ప్రాజెక్టు సమీపంలో కూడా ఆకస్మిక వరదలు సంభవించి దోడా-కిష్త్వార్ రహదారి దెబ్బతిన్న విషయం తెలిసిందే.

## కొమ్మిడి నరసింహారెడ్డికి కన్నీటి వీడ్కోలు

### అధికార లాంఛనాలతో అంత్యక్రియలు.. కన్నీటి సంద్రంలో బ్రాహ్మణపల్లి, కడసారి చూపుకోసం కదలివచ్చిన వేలాదిమంది



నరసింహారెడ్డి భౌతిక కాయం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి



అధికార లాంఛనాలతో జరుగుతున్న అంత్యక్రియల దృశ్యం

**యాదాద్రిభువనగిరి, బ్యూరో ప్రభాతవార్త:** బ్రాహ్మణపల్లి గ్రామం బుధవారం ఒక విషాదాన్ని మాత్రమే కాదు..ఒక విలువను సాగనంపింది. రాజకీయాలను అధికారం కోసం కాకుండా ప్రజాసేవ కోసం చేయవచ్చని తన జీవితంతో నిరూ పించిన మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నరసింహారెడ్డి అంతిమయాత్రలో కన్నీళ్లు పెట్టని వారు కనిపించలేదు. గ్రామ వీధుల్లో ఎటు చూసినా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఉదయం నుంచే బ్రాహ్మణపల్లి గ్రామం జనసంద్రంగా మారింది. ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు, ఆయన అభిమానులు, పాత సహచరులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో గ్రామానికి చేరుకొని ఆయన పార్థివదేహానికి నివాళులర్పిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని కుటుంబ సభ్యులకు అందజేయగా, ఆ క్షణం అక్కడున్న వారందరినీ తీవ్ర భావోద్వేగానికి గురి చేసింది. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి స్వయంగా అన్ని ఏర్పాట్లను పర్యవేక్షి ంచారు. పార్థివదేహాన్ని భుజాన మోసి చివరి వరకు అంతిమయాత్రలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కు మార్ రెడ్డి, రెవిన్యూ అదనపు కలెక్టర్ కే.వెం కారెడ్డి,మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ జెడ్పిచైర్మన్ కసిరెడ్డి నారాయ ణరెడ్డి,వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్య కర్తలు, జర్నలిస్టు సంఘాల నాయకులు, వేలాది మంది ప్రజలు అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతిమయాత్రలో అత్యంత హృదయవిదారక దృశ్యాలు కనిపించాయి. కుటుంబ సభ్యులు పార్థివదేహాన్ని చూసి బోరున విలపించగా, గ్రామస్థులు వారిని ఓదార్చే ప్రయత్నం చేశారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు పూలమాలలు సమర్పిస్తూ తుది వీడ్కోలు పలికారు. బ్రాహ్మణపల్లి నేలలో ఆయన భౌతికంగా కలిసిపోయినా ప్రజల గుండెల్లో కొమ్మిడి నరసింహారెడ్డి అనే పేరు ప్రజాసేవకు, విలువల రాజకీయాలకు చిరస్థాయిగా నిలిచిపోతుందనే భావోద్వేగంతో వేలాది మంది ఆయనకు అశ్రునివాళులు అర్పించారు.

## సైబర్ నేరగాళ్లకు సహకరించిన మ్యూల్ ఖాతాదారుల అరెస్టు

### రూ.4.70 కోట్ల మోసంపై వీడిన మిస్టరీ

**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త:** నగరంలోని ఓ బడా కంపెనీ ఎండి పేరిట అందులో పని చేసే ముఖ్య ఉద్యోగులకు వాట్సాప్ మెసేజ్‌లు పంపి నాలుగు కోట్ల 70 లక్షల రూపాయలను కాజేసిన సైబర్ నేరగాళ్ల ఉదంతంపై మిస్టరీ వీడింది. ఈ కేసులో అసలు నేరగాళ్లు విదేశాల్లో వుండగా సైబర్ నేరంలో భాగంగా కొట్టేసిన నాలుగు కోట్ల 70 లక్షల రూపాయల బదిలీకి వాడిన రెండు మ్యూల్ ఖాతాలను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) గుర్తించి వీటిని నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసింది. దీనికి సంబంధించిన వివరాలను టిజిసిఎస్ బి డైరక్టర్ శిఖా గోయల్ బుధవారం మీడియాకు వెల్లడించారు. నాలుగు నెలల క్రితం హైదరాబాద్‌లో వెలుగు చూసిన నాలుగు కోట్ల 70 లక్షల రూపాయల సైబర్ క్రైం సంచలనం రేపడం తెలిసిందే. ముంబాయిలోనూ ఇదే తరహాలో మోసం జరిగింది. కంపెనీ ఎండి పేరిట అందులోని కీలక ఉద్యోగులకు ఎండి ఫోటో వుంచి వాట్సాప్ సందేశాలను పంపి విదేశాల్లో వున్న సైబర్ నేరగాళ్లు సదరు కంపెనీ ఖాతా నుంచి నగదు కాజేయడం ఇందులో ప్రత్యేకత. ఇటువంటి మోసం హైదరాబాద్‌లో వెలుగు చూడగా దీనిపై టిజిసిఎస్‌బి కేసు నమోదు చేసి విచారణ చేబట్టి మొ దట ఈ మోసంలో విదేశాలకు నగదు తరలింపులో వాడిన బ్యాంకు ఖాతాల వివరాలను తెలుసుకున్నారు. ఖమ్మంకు చెందిన దోసపాటి కృష్ణసాయి, కొత్తపేట్‌కు చెందిన మండవల్లి శివ నాగరాజులు ఈ గోల్‌మాల్‌లో పాలు పంచుకున్నట్లు తేలింది. వీరిద్దరు తమ కరెంటు ఖాతాలను విదే శాల్లో వుండే సైబర్ నేరగాళ్లకు ఇచ్చి ఇక్కడి నుంచి కాజేసిన నగదును తరలించేందుకు వాడుకునే అవకాశం కల్పించారు. ఇందులో కృష్ణసాయి కోటి 80 లక్షల రూపాయలు, శివ నాగరాజు రెండు కోట్ల 49 లక్షల రూపాయల బదిలీకి తమ ఖాతాలను ఇచ్చారు. ఇందుకుగానూ వీరికి తలా రెండు లక్షల రూపాయల కమీషన్ అందింది. వీరిద్దరిని బుధవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసులో మరికొన్ని మ్యూల్ ఖాతాలు వాడినట్లు తేలింది. దీనిపై విచారణ సాగుతోంది. కాగా ఈ తరహా మోసాలపట్ల అందరు జాగ్రత్తగా వుండాలని టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ కోరారు. ఇక కంపెనీ ఉద్యోగులు వాట్సాప్ ద్వారా వచ్చే సమాచారంపై తనిఖీ చేసుకోవాలని, తమ పై అధికారులతో మాట్లాడి నిర్ధారణ చేసుకోవాలని ఆమె తెలిపారు.

## అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం కేసు

### మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రాపై సిట్ నివేదికలో ప్రస్తావనకు అవకాశం

**అయోధ్య,జులై 8:**అయోధ్యలోని రామాలయ విరాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ మరింత వేగం అందుకుంది. తుది నివేదికలో శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రా పేరును చేర్చే అవకాశముందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.సిట్ తుది నివేదికను ఈనెల 15 నాటికి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు సమర్పించనున్నది. నివేదికలో అనిల్ మిశ్రాపై చర్యలు తీసుకోవాలని కూడా సిఫార్సు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.ట్రస్టులో విరాళాల నిర్వహణ బాధ్యతలను అనిల్ మిశ్రా పర్యవేక్షించగా, ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తాను ప్రామాణిక కార్యాచరణ విధానాలు గురించి అవగాహన లేదని పేర్కొంటూ ఈ వ్యవహారం నుంచి దూరంగా ఉండే ప్రయత్నం చేసినట్లు సమాచారం. విరాళాల వ్యవహారం రాజకీయ వివాదంగా మారడంతో అనిల్ మిశ్రా, చంపత్ రాయ్ ఇద్దరూ జూన్ 26న తమ పదవులకు రాజీనామా చేశారు. ఈనెల 6న జరిగిన ట్రస్ట్ కీలక సమావేశంలో వారి రాజీనామాలను ఆమోదించారు. రామాలయ ట్రస్ట్ ఖజానాదారు గోవింద్ దేవ్ గిరి చంపత్ రాయ్‌ను కలిశారు. ఈ సమావేశంలో అనిల్ మిశ్రాతో పాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారుల పాత్రపై కూడా చంపత్ రాయ్ ప్రశ్న లు లేవనెత్తినట్లు సమాచారం.70 అనుమానాస్పద ఘటనలను గుర్తించినసిట్ విచారణలో భాగంగా ఇప్పటి వరకు 70 అనుమానాస్పద ఘటనలను గుర్తించింది. ముఖ్యంగా భక్తులు సమర్పించిన నగదు విరాళాల లెక్కింపు సమయంలో భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ప్రాథమిక నివేదికను ఇప్పటికే శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌కు అందజేశారు.ఈ వ్యవహారం కొద్దిమంది ఉద్యోగుల చోరీలకే పరిమితం కాదని, ఆలయంలోని విరాళాల నిర్వహణ వ్యవస్థలోనే తీవ్రమైన లోపాలు, సమర్థవంతమైన పర్యవేక్షణ లేకపోవడం బయటపడిందని నివేదిక స్పష్టం చేసింది. విరాళాల లెక్కింపు సమయంలో నగదు, విలువైన వస్తువులు పలు మార్లు దొంగిలించబడినట్లు, ఇవి ఒక్కోసారి జరిగిన సంఘటనలు కాకుండా అనేక రోజుల పాటు పునరావృతమైనట్లు సిట్ పేర్కొంది.విచారణలో పరిశీలించిన సీసీటీవీ ఫుటేజీల్లో కొందరు ఉద్యోగులు కరెన్సీ కట్టల నుంచి నగదు నోట్లు తీసి దాచడం, విడి నోట్లను తమ వద్ద దాచుకోవడం, నగదు కట్టలతో చెలగాటం ఆడడం వంటి అనుమానాస్పద చర్యలకు పాల్పడినట్లు కనిపించినట్లు నివేదిక వెల్లడించింది. పలుమార్లు ఉద్యోగులు జేబుల్లో నగదు నోట్లు వేసుకోవడం, కరెన్సీ కట్టలను తారుమారు చేయడం, విరాళాల లెక్కిం పు సమయంలో అనుమానాస్పదంగా వ్యవహరించడం వంటి ఘటనలు సీసీటీవీ దృశ్యాల్లో నమోదైనట్లు సిట్ పేర్కొంది.

## ఫ్యూచర్ సిటీలో ఎస్‌బిఐ డేటా సెంటర్

**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఫ్యూచర్ సిటీలో తనకు కేటాయించే భూమిలో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని స్టేట్ బ్యాంక్ యోచిస్తున్నట్లు తెలియవచ్చింది.రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని 5 ఎకరాల భూమిపై రాష్ట్ర ప్రభుత్వంతో నెలకొన్న వివాదం ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించినప్రత్యామ్నాయ భూకేటాయింపులకు గత నెల30న ఎస్‌బీఐ బోర్డు అంగీకరించడంతో అవివాదం సద్దుమణగనుంది. అయితే, నాలెడ్జ్ సిటీలో ఐదెకరాలకు బదులుగా 2.5ఎకరాలు, ఫ్యూచర్‌సిటీలో 78ఎకరాల భూమి ఇవ్వాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించగా, ఎస్‌బీఐ మాత్రం ఫ్యూచర్ సిటీలో డేటా సెంటర్‌కు 10ఎకరాల భూమి ఇవ్వాలని కోరింది. వివాదం ఈ విధంగా ముగింపు దశకు చేరుతున్న దరిమిలా ఎస్‌బీఐ తన పిటిషన్‌ను కోర్టునుంచి ఉపసహరించుకునే చర్యలు ప్రారంభించినట్లు తెలిసింది. దీనికి సంబంధించి 9న హైకోర్టులో అఫిడవిట్ వేయనుందని వెల్లడైంది.

## కరిగిపోతున్న అమర్‌నాథ్ మంచులింగం

### ఐదు రోజులకే అనూహ్య పరిణామం

**శ్రీనగర్,జులై 8:** హిందూ సమాజంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అమర్నాథ్ క్షేత్ర యాత్ర ఈ నెల 3వ తేదీన అత్యంత వైభవంగా ప్రారంభమైన సందర్భంలో మంచులింగం కరిగిపోతున్నదన్న వార్త భక్తులను తీవ్ర నిరాశకు గురిచేసింది. మొత్తం 57 రోజుల పాటు సుదీర్ఘంగా సాగాల్సిన ఈ యాత్ర మొదలైన ఐదు రోజులకే ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకోవడం ఇప్పుడు భక్తులందరిని షాక్‌కు గురి చేసింది. ఈ యాత్ర ప్రారంభం నాటికి పవిత్ర గుహలో దాదాపు 5 అడుగుల ఎత్తులో భక్తులకు దర్శనమిచ్చిన మంచు శివలింగం, ఇప్పుడు పూర్తిగా అంతర్థానమైంది. బాబా బర్ఫానీ (మంచు శివలింగం) ఇంత త్వరగా కరిగిపోవడానికి ప్రధాన కారణం భక్తుల భారీ రద్దీ, పర్యావరణ ప్రభావాలేనని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది అమర్నాథ్ యాత్ర కోసం దేశవ్యాప్తంగా ఏకంగా 4 లక్షల మంది భక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. యాత్ర ప్రారంభమైన మొదటి నాలుగు రోజుల్లోనే రికార్డు స్థాయిలో 86 వేల మంది యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారు.ఇంత భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంవల్ల గుహ పరిసర ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా పెరిగిపోయాయి. దీనికి తోడు గ్లోబల్ వార్మింగ్, పర్యావరణంలో వస్తున్న మార్పుల కారణంగా మంచులింగం ఐదు రోజుల్లోనే కరిగిపోయింది. అయితే శివలింగం కరిగిపోయినప్పటికీ, పవిత్ర గుహదర్శనం కోసం భక్తుల రిజిస్ట్రేషన్లు, యాత్ర యథావిధిగా కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.



## సిఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైన యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు

### హాజరైన మంత్రి సురేఖ, బోర్డు చైర్మన్, సభ్యులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై8:** యాదగిరిగుట్ట దేవస్థానం నూతన పాలక మండలి బుధవారం సాయంత్రం ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకం గా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. ఇటీవల నూతనంగా యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి ఏర్పాటైన విషయం తెలిసిందే. సిఎం వద్ద జరిగిన సమావేశంలో యాదగిరిగుట్ట బోర్డు చైర్మన్ ఎం. సత్యనారాయణరెడ్డి.బోర్డు సభ్యులు వినోద్ వెంకటస్వామి (ఎమ్మెల్యే , కొణిదెల సురేఖ(మెగాస్టార్ చిరంజీవి సతీమణి),విజయరాజం, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, డా మల్లయ్య,స్వాతి కాంతమనేని, ఎం. రాఘవేందర్ రావు, డాక్టర్ లక్ష్మీ ్మనారాయణ నాయక్ పాల్గొన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పలు అంశాలపై పాలక మండలికి దిశానిర్దేశం చేశారు.

## డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు ఒపిఎస్ అమలు చేయాలి

### చీఫ్ సెక్రటరీకి ఎస్టీయూ టియస్ వినతి

**హైదరబాద్,జులై 8,ప్రభాతవార్త:**కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్ కేబినెట్ తీసుకున్న నిర్ణయం మాదిరిగా డిఎస్‌సి2003 ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ రాష్ట్ర అధ్యక్ష, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి. సదానందం గౌడ్, జుట్టు గజేందర్, జాక్టో కో చైర్మన్ పర్వతి సత్యనారాయణలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. డిఎస్‌సి 2003 నోటిఫికేషన్ నవంబర్-2003లో విడుదల కాగా, ఎంపిక ప్రక్రియ జూలై-2004 నాటికే పూర్తయింది. అయితే పరిపాలనా, సాంకేతిక కారణాల వల్ల నియామక ఉత్తర్వులు నవంబర్-2005లో జారీ కావడంతో ఆయా ఉపాధ్యాయులను కంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీమ్ పరిధిలోకి తీసుకువచ్చారు. అయితే, నియామక ప్రక్రియ 1 సెప్టెంబర్ 2004కు ముందే ప్రారంభమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేసేలా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ మేరకు ఇటీవల ఆంధ్రప్రదేశ్ కేబినెట్ డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణప్రభుత్వం కూడాడిఎస్‌సి 2003 ద్వారా నియామకమైన ఉపాధ్యాయులందరికీ పాతపెన్షన్ విధానాన్ని అమలుచేసి న్యాయం చేయాలని కోరారు.

## గీత కార్మిక సహకార సంస్థకు రూ.17కోట్లు విడుదల

**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గీత కార్మికుల సహకార ఆర్థిక సంస్థకు తెలంగాణ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్స రానికి సంబంధించిన బడ్జెట్ అంచనాల నుంచి రెండో త్రైమాసిక ఖర్చుల నిమిత్తం రూ.17 కోట్లు మంజూరు చేస్తూ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.బాల మాయాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థిక శాఖ బడ్జెట్ విడుదల ఉత్తర్వులకు అనుగుణంగా ఈ నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు జీవోలో పేర్కొన్నారు. ఈ నిధులకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కమిషనర్‌తో పాటు, గీత కార్మికుల ఆర్థిక సహకార సంస్థ ఎండీని ప్రభుత్వం ఆదేశించింది.

## నిండిన కంపార్టుమెంట్లు.. కొండంతా జనం

**తిరుమల, జులై 8 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవి సెలవులు ముగిసి నెలరోజులు కావస్తున్నా వారాంతం సెలవులకు మూడు రోజుల ముందే తమ మొక్కులు తీర్చుకునేందుకు పిల్లలతో కలిసి పెద్ద ఎత్తున తిరుమలకు భక్తులు చేరుకుంటున్నారు. సాధారణ రోజుల్లోనూ తిరుమలకొండ భక్తులతో కిటకిటలాడుతోంది. బుధవారం ఉదయానికి తిరుమలలో భక్తుల రద్దీ



మునుపెన్నడూ లేని విధంగా కొనసాగుతోంది. శ్రీవారి దర్శనార్థం దేశం నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఏడుకొండలు జన సందోహంగా మారాయి. స్వామి వారి దర్శనం కోసం భక్తులు క్యూ కాంప్లెక్స్ వెలుపల కిలోమీటర్ల మేర క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఎలాంటి దర్శనం టోకెన్లు లేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం (శీఘ్రదర్శనం కానిది) లభించడానికి సుమారు 24 గంటల సమయం పడుతోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా టిటిడి అధికారులు సేవలందిస్తున్నారు. నిరంతరాయంగా మంచినీరు, పాలు, మజ్జిగ, అన్నప్రసాదాల పంపిణీ చేస్తున్నారు. మంగళవారం రాత్రి వరకు స్వామివారిని 80,706మంది భక్తులు దర్శించుకోగా, హుండీ కానుకల ద్వారా రూ.4.63 కోట్ల ఆదాయం లభించింది. భక్తుల రద్దీ రానున్న శుక్ర, శని, ఆదివారాల్లో మరింత పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు మరిన్ని ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

# నెక్లెస్‌రోడ్ భూమిలో కెటిఆర్ క్విడ్‌ప్రోకో

### ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్,జులై 8,ప్రభాతవార్త:** నక్లెస్ రోడ్ ఎంఎంటీఎస్ సమీపంలో సర్వే నెంబర్ 22లో రెండు ఎకరాల భూమిలో మాజీ మున్సిపల్‌శాఖ మంత్రి కెటిఆర్ క్విడ్ ప్రోకోతో చేసుకొన్న ఒప్పందంతో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో బ్లిస్‌పేరుతో 17 అంతస్తుల్లో రెండు టవర్లు నిర్మించిందనీ ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శించారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో బుధవారం మాట్లాడుతూ క్విడ్ ప్రోకో విధానానికి కేటీఆర్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారాడని ఎద్దేవా చేశారు. నక్సెస్ రోడ్‌లో హుస్సేన్ సాగర్ సరస్సువద్ద నిర్మాణ ప్రాంతం ఏకంగా 98 శాతం ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉందనీ కేవలం రెండుశాతం బఫర్ జోన్‌లో ఉందనీ నిర్మాణ సమయంలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ , జిహెచ్‌ఎంసి ప్లానింగ్ డిపార్ట్మెంట్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదనీ ఆయన ఆరోపించారు. చెరువులు, కాలవలు, కుంటల పక్కన ఉన్న భూములకు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ నుంచి ఎన్ ఓసీ అడగాలి,కాని యాజమాన్యం కాని, అధికారులు కూడా దీన్ని పట్టించుకోలేదనీ విమర్శించారు. స్థలం యజమానితో వివాదం ఉన్నప్పటికి ఆయనను బెదిరించి కోర్టు బయటే అప్పటి అధికార పార్టీ నాయకుల అండతో సెటిల్ చేసుకున్నారనే ఆరోపణలున్నాయనీ తెలిపారు. ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో ఈ వ్యవహారం బయటకు వచ్చిందనీ వివరించారు. మా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి 7359 చదరపు అడుగులు ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్నట్లు తేల్చారనీ ఇంకో 280 చదరపు అడుగులు బఫర్ జోన్ లో ఉన్నట్లు తేలిందనీ ఆయన తెలిపారు హుస్సేన్ సాగర్ తీరంలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇంత విచ్చలవిడిగా నిర్మాణం ఏ ధైర్యంతో జరిగిందనీ ప్రశ్నించారు. మున్సిపల్ శాఖ మంత్రిగా కెటిఆర్ ప్రమేయం లేకుండా జరుగుతుందా అనే అనుమానం సర్వత్రా వినిపిస్తోందని అన్నారు. కెటిఆర్ బెదిరించి అధికారులతో ఈ పనిచేశాడునీ అన్నారు. అప్పటి మున్సిపల్ మంత్రి కెటిఆర్‌కు చెందిన జన్వాడ ఫామ్ హౌస్ అసలు యజమాని ప్రదీప్ రెడ్డి అనీ, ఈ ప్రదీప్ రెడ్డి చెందిన నిర్మాణ సంస్థనే హుస్సేన్‌సాగర్ పక్కన టవర్లు నిర్మించిందనీ చెప్పారు. ప్రదీప్ రెడ్డికి చెందిన జన్వాడ ఫామ్ హౌస్‌లో అసలు కెటిఆర్ ఎందుకు ఉంటున్నాడు? హుస్సేన్‌సాగర్ పక్కనే ఎలాంటి అనుమతులు లేకుండా టవర్లు నిర్మించుకోవడం కోసమే కెటిఆర్‌కు ప్రదీప్‌రెడ్డి జన్వాడ ఫామ్ హౌస్ ఇచ్చాడనీ ఇది క్విడ్ ప్రోకోలో భాగమే అని ఆరోపించారు. నీకు టవర్లు, నాకు ఫామ్‌హౌస్ అని కెటిఆర్ ప్రదీప్‌రెడ్డిలు ఇద్దరు పంచుకుతున్నారనీ క్విడ్ ప్రోక్ వ్యవహారంపైన విచారణ జరిపి కెటిఆర్ పాత్ర ను తేల్చాలని మేం ప్రభుత్వాన్ని కోరుతున్నామనీ డిమాండ్‌చేశారు. క్విడ్‌ప్రోకో బాధ్యులని అరెస్టు చేయాల్సిందే అని అన్నారు.



బుధవారం గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి వివేక్

## కొత్తగా మూడు లక్షల మందికి పెన్షన్లు

### రేషన్ కార్డుల కోసం విన్నపాలు రావడంలేదు

### గాంధీభవన్‌లో కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్,జులై 8,ప్రభావార్త:** తెలంగాణ వ్యాప్తంగా సామాజిక భద్రత కోసం కొత్తగా రానున్న రోజుల్లో అర్హులైనవారికి మూడు లక్షల మందికి పెన్షన్లు ప్రభుత్వం ఇవ్వబోతుందనీ గనులు భూగర్భ, కార్మికశాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో వివేక్ వెంకటస్వామి ప్రజలతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొని మొత్తం 200కు పైగా విన్నపాలు తీసుకున్నారు. వివేక్ ఈ సందర్భంగా ఐదుగురు కలెక్టర్లు, ఒక జోనల్ కమిషనర్‌లతో ఫోన్ మాట్లాడి ప్రజల ఫిర్యాదులను స్పాట్‌లోనే పరిష్కరించినారు. పెన్షన్, డబల్ బెడ్ రూమ్, మెడికల్, భూ సమస్యల తో మంత్రి ని కలిసిన పలువురు తమ గోడును వెళ్ళగక్కారు. టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాలతో ముఖాముఖీ జరుగుతుందనీ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకునే మంచి కార్యక్రమం అన్నారు. ప్రజలకు చేరువయ్యే కార్యక్రమం ఇదీ అని అన్నారు. పెన్షన్, డబల్ బెడ్ రూమ్ కావాలని అనేక మంది తనను కలిసారని, భూ సమస్యలతో కొంత మంది వచ్చారనీ వివరించారు. ప్రజలతో మంత్రుల ముఖాముఖీ కార్యక్రమం కోసం మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశారనీ ప్రజలు ఇచ్చిన విన్నపాలపై వారు నిరంతరం పర్యవేక్షించి వారి సమస్యలు పరిష్కరించడానికి వీలైనంతగా సహాయం అందిస్తారని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని బిఆర్‌ఎస్ ఇవ్వకపోయినా మా ప్రభుత్వం వచ్చాక అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు ఇచ్చామనీ దీనితో మంత్రి ముఖాముఖీ కార్యక్రమంలో రేషన్ కార్డు కావాలని ఒక్క అర్జి కూడా రాలేదనీ ఆయన తెలిపారు.

## రైతుకు ఉచిత విద్యుత్ అందించిన ఆరాధ్యుడు వైఎస్

### ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఎందరికో జీవితం: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**హైదరాబాద్,జులై 8,ప్రభాతవార్త:** వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేసి మెట్టప్రాంత రైతులకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరాధ్యుడిగా వెలుగొందారనీ, సంక్షేమం అభివృద్ధి రెండుకళ్ళుగా పాలన సాగించిన గొప్ప నాయకుడు రాజశేఖర్ రెడ్డి అని పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం అవిభక్త ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలవేసి మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్, ఎమ్మెల్సీ బలమూర్ వెంకట్, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ నాయకులు అంజన్ కుమార్ యాదవ్, కెవిపి రామ్‌చందర్ రావ్‌లు నివాళి అర్పించారు. వైఎస్సార్‌తో నాకు వ్యక్తి గత అనుబంధం ఉందనీ రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ఆయన రాజకీయ తత్వమన్నారు. ప్రజా ప్రస్థానం పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటికి అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం వైఎస్సార్ నాయకత్వ విశిష్టత అన్నారు. ఉచిత కరెంటు సాధ్యం అవుతుంది అని నిరూపించిన మహా నాయకుడు అని అన్నారు. పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందించిన నేత, రాజశేఖర్ రెడ్డి గొప్ప ఆలోచనలో ఒకటి అన్నారు. 108 అత్యవసర అంబులెన్స్ సేవలు, ఫీజు రీయింబర్స్ మెంట్, ఇందిరమ్మ గృహాలు, జలయజ్ఞం వంటి పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రో రాజశేఖర్ రెడ్డి ఆలోచన స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్తున్నామనీ తెలిపారు. సిఎం, టిపిసిసి అధ్యక్షుడు నేతృత్వంలో ఆయన ఆశయాలు ముందుకు తీసుకొని పోతున్నామని, రాబోయే యువతరానికి కూడా స్ఫూర్తిని ఇస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా పాలన సాగిస్తామనీ శ్రీధర్‌బాబు చెప్పారు.

కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ప్రజానేత వైఎస్సార్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కట్టుబడి పనిచేయాలని బాబు పిలుపునిచ్చారు.




బుధవారం హైదరాబాద్‌లో ఫీజుల రీయింబర్స్‌మెంట్ కోసం 'తిరుగుబాటు ప్రదర్శన' నిర్వహిస్తున్న విద్యార్థులు. చిత్రంలో ఆర్.కృష్ణయ్య తదితరులు

### ఫీజుల రీయింబర్స్‌మెంట్ కోసం

## భారీగా 'తిరుగుబాటు ప్రదర్శన'

### ఆ పథకాన్ని యధాతథంగా కొనసాగించాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), జులై 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 14 లక్షల మంది నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులకు ఫీజులు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది విద్యార్థులు బుధవారం నగరంలో 'తిరుగుబాటు ప్రదర్శన' నిర్వహించారు. బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన బషీర్‌బాగ్ చౌరస్తా నుంచి ప్రారంభమై డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు కొనసాగింది. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సిఎం డౌన్, డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ తిరుగుబాటు ప్రదర్శన పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్రలు మానుకోవాలని, లక్షలాది మంది విద్యార్థులకు ఉపయోగంగా ఉన్న ఈ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థులకు కొత్త పథకాలను ఏవి ప్రవేశపెట్టలేదని, గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ పథకాన్ని అమలు చేయకుండా చెడ్డపేరు తెచ్చుకోరాదని సూచించారు. ఈ పథకానికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడరాదని, కొంత మంది అధికారులు బిసి, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు చదువుకుంటుంటే చూసి ఓర్చుకోలేక ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. గత మూడు సంవత్సరాలుగా ఫీజుల రీయంబర్స్‌మెంట్ కోసం ఉద్యమాలు చేస్తున్నామని, తరగతుల బహిష్కరణ, కళాశాలల బంద్, ధర్నాలు, నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికి ప్రభుత్వం మొండి వైఖరి అవలంభించడం సమంజసం కాదని ఆర్.కృష్ణయ్య చెప్పారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దృషిలో ఉంచుకుని వెంటనే 8 వేల కోట్ల ఫీజుల బకాయిలను విడుదల చేయాలని కోరారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలి

### సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద మానవహారం

**హైదరాబాద్, జులై8 ప్రభాతవార్త:** మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఆమోదించి, ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం భారీ మానవహారం నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పి.కె. శ్రీమతి, ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ పుణ్యవతి మాట్లాడుతూ దేశ జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించడం ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశాల్లోనే అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణ జ్యోతి, ఉపాధ్యక్షురాలు టి. జ్యోతి, రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కె.ఎన్. ఆశలత, బుగ్గవీటి సరళ, పి. ప్రభావతి, కె. నాగలక్ష్మి, ఎన్. రత్నమాల, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండి పద్మ, పి. శశికళ, ఎం. వినోద, బట్టుపల్లి అనురాధ, షబానా, వై. వరలక్ష్మితో పాటు రాష్ట్రం లోని 29 జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఐద్వా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## నాణ్యతలేని డ్యామ్‌వల్లే మంత్రి పదవి నుంచి హరీష్‌ను తొలగించిన కెసిఆర్

### సిఎం రేవంత్ అసెంబ్లీ చర్చకు సిద్ధం అంటుండు, మీ మామను తీసుకరా: జగ్గారెడ్డి



**హైదరాబాద్,జులై 8,ప్రభాతవార్త:** నీళ్లు ఇవ్వని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,ఉత్తమ్ కుమార్‌లను ఉరితీయాలని అంటున్న హరీష్‌రావు నాణ్యతలేకుండా డ్యామ్ కట్టి కూలడానికి కారణమైన నిన్ను ఏంచేయాలని మాజీ ఎమ్మెల్యే టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి ప్రశ్నించారు. గాంధీభవన్‌లో బుధవారం విలేఖరులతో ఆయన మాట్లాడుతూ నాణ్యత లేని డ్యామ్ హరీష్‌రావు నువ్వు కట్టించావనే నిన్ను ఇరిగేషన్ మంత్రి పదవి నుండి కెసిఆర్ తప్పించాడనీ నీవేమో కాంగ్రెస్ మీద నిందలు నెట్టే ప్రయత్నం చేస్తున్నావని ఆరోపించారు. కాళేశ్వరంపై అబద్ధాలు చెప్పి ప్రజల ముందు ముఖ్యమంత్రి రేవంత్ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌ను బ్లేమ్ చేసే ప్రయత్నం హరీష్ చేస్తున్నడనీ ఆవేదన చెందారు. హరీష్‌ను ఇరిగేషన్ మంత్రిగా ఎందుకు తప్పించాడు కెసిఆర్ ముందు దీనికి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్ అసెంబ్లీ లో చర్చకు సిద్ధం అంటున్నారనీ మీ మామ ను అసెంబ్లీకి తీసుకుని రా అని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి స్థాయి గురించి మాట్లాడటం తగదు ఆయన జడ్పీటిసి స్థాయి నుంచి రాహుల్ గాంధీ నాయకత్వంలో సిఎంగా అయ్యాడు, నేను 1995 లో మున్సి పల్ చైర్మన్ అయినప్పుడు నువ్వు స్టూడెంట్‌వి నువ్వెందుకు మాట్లాడుతున్నావు స్థాయి గురించి అని హరీష్‌రావును ప్రశ్నించారు. అన్నారం సుందిల్లమేడిగడ్డలో నీళ్ళు నిల్వ చేయొద్దని చెప్పింది నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అని గుర్తుచేశారు. నీళ్ళు నిల్వ చేయొద్దు అనేది సిఎం రేవంత్ మంత్రి ఉత్తంల నిర్ణయం కాదనీ ఆయన చెప్పారు. ఎన్‌డిఎస్‌ఎ రాష్ట్రప్రభుత్వం పరిధిలో ఉండదని కేంద్ర ప్రభుత్వ సంస్థ అని అన్నారు. ఎన్‌డిఎస్‌ఎ కాంగ్రెస్ సంస్థ కాదునీళ్ళు నిల్వ చేస్తేప్రాజెక్ట్ కూలి ఖమ్మం, భద్రాచలం కొట్టుకు పోతుందనీ అని డ్యామ్ సేఫ్టీ అథారిటీ చెప్పిందనీ ఆ మాత్రం ఇంగితం హరీష్ కి లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా తప్పుడు ప్రచారం చేస్తున్న హరీష్ రావు ను కాంగ్రెస్ నేతలు ఎక్కడిక్కడ ప్రశ్నించండనీ నిలదీయాలనీ కోరారు. నువ్వు మంత్రిగా ఫెయిల్ అయ్యావు అందుకే కాళేశ్వరం కుంగింది,కూలింది అని జగ్గారెడ్డి అన్నారు. దొంగ మాటలుదొంగ ముచ్చట్లు చెప్పడం లో కెసిఆర్ ఫ్యామిలీ ఎక్స్పర్ట్ వాళ్ళ కుటుంబం చెప్పే మాటలు నమ్మకండి అని ప్రజలను జగ్గారెడ్డి కోరారు.

## రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేని కెసిఆర్ కుటుంబం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్,జులై 8,ప్రభాతవార్త:** రాజస్థాన్‌లో రుడాలీలు చనిపోయిన వారి దగ్గర ఏడ్చినట్లు తెలంగాణ అభివృద్ధిని చూసి కల్వకుంట్ల కుటుంబం తెగ ఏడుస్తోందనీ ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణకు ఏ మంచి జరిగినా, ప్రజలకు లాభం కలిగినా, అభివృద్ధి జరిగినా కల్వకుంట్ల తెగకు ఏడుపే తాకుతోందని ఆవేదన చెందారు. ఫ్యూచర్ సిటీ నిర్మిస్తే ఏడుపు,మూసీ ప్రక్షాళన చేస్తే ఏడుపు, రైతులకు బోనస్ ఇస్తే ఏడుపు 25 లక్షల కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసినా బిఆర్‌ఎస్‌కు బాధే, కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ప్రతి మంచి పనిని వ్యతిరేకించడమే బిఆర్‌ఎస్ పనిగా మారిందని అన్నారు. మేడిగడ్డను నిర్మించింది, డిజైన్ మార్చింది బిఆర్‌ఎస్ ప్రభుత్వమే,వారి హయాంలోనే మేడిగడ్డ కుంగిపోయింది,ఎన్డీఎస్ఏ రిపోర్టు ప్రకారం మేడిగడ్డ ప్రాంతం భారీ బ్యారేజీ నిర్మాణానికి అనుకూలం కాదనీ అన్నారు. ఇప్పుడు బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీ ఊడిపోయి 44 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉం దనీ అన్నారు. వేలాది మంది ప్రాణాలను పణంగా పెట్టి రాజకీయాలు చేసే ప్రభుత్వం కాంగ్రెస్ కాదనీ చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టులు నిపుణుల సూచనలతో కాంగ్రెస్ నిర్మించిందనీ అన్నారు. సమయం బట్టి డాక్టర్, ఇంజనీర్ అవతారాలు ఎత్తే పగటి వేషగాళ్ల కుటుంబం బిఆర్‌ఎస్ అధినేతలది అని అన్నారు. మహారాష్ట్రతో 152 మీటర్ల ఒప్పందం చేసుకుని రాజ భవన్‌లో దావత్ చేసుకున్నది బిఆర్‌ఎస్ అని గుర్తుచేశారు. ప్రధాని మోదీతో రాజకీయ సాన్నిహిత్యం పెట్టుకున్నది కూడా బిఆర్‌ఎస్ నాయకత్వమే అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ముంపు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారనీ తెలిపారు. మెట్రో కోసం కేంద్రంతో, కృష్ణా, తుంగభద్ర జలాల కోసం పొరుగు రాష్ట్రాలతో చర్చలు జరుపుతున్నారనీ వివరించారు. సమస్యల ఉంటే లొల్లి, బ్లాక్‌మెయిల్ చేసి రాజకీయ లబ్ధి పొందడం కాంగ్రెస్ విధానం కాదనీ అన్నారు. హరీష్ రావు రాజీనామా డ్రామాలు ఆడుతున్నారనీ ఆరోపించారు. పార్టీ పగ్గాలు కెటిఆర్‌కు వెళ్తాయని తెలిసి హరీష్ రావు బిజెపిలో చేరేందుకు రంధ్రాన్వేషణ చేస్తున్నారని విమర్శ చేశారు. దమ్ముంటే సిద్ధిపేట,సిరిసిల్లలను వదిలి పక్క నియోజకవర్గాల్లో పోటీ చేసి గెలవాలనీ సవాల్ విసిరారు.

## తెలంగాణను ధ్వంసం చేసిన ఆర్థిక ఉగ్రవాదులు బిఆర్ఎస్ పాలకులు

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, జులై 8,ప్రభాతవార్త:** ఆర్థిక ఉగ్రవాదులుగా బిఆర్‌ఎస్ పాలకులు మారి తెలంగాణను ధ్వంసం చేశారనీ,అంతేకాదు తెలంగాణను అప్పుల పాలు చేశారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. సిఎల్‌పిలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ హరీష్ రావు అబద్దాలను మోస్తు కన్నెపల్లి పంప్ హౌస్ ను ఆన్ చేయమని చెపుతున్నాడనీ మూడు నెలలు ఇరిగేషన్ శాఖమంత్రి పదవి ఇస్తే నీళ్లు తెప్పిస్తానని హరీష్ రావు ప్రగల్భాలు పలుకుతున్నాడనీ ఎద్దేవా చేశారు. 2014 నుంచి ఐదేళ్ల పాటు ఇరిగేషన్ శాఖమంత్రిగా హరీష్ రావు పనితనం చూసే కెసిఆర్ తర్వాత ఆయనకు కొంత కాలం పదవి ఇవ్వకుండా పక్కన పెట్టాడనీ చరిత్రను గుర్తుచేశారు. ఇరిగేషన్ లో హరీష్ రావు అక్రమ వసూళ్లకు పరిమితం అయ్యాడనే పక్కన కూర్చోబెట్టాడనీ ఆరోపించారు. మళ్లీ నీకు ఇరిగేషన్ శాఖ కావాలా? ప్రజలకు సమాధానం చెప్పు అని సవాల్ చేశారు. ప్రతిపక్ష నేత కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి సమాధానం చెపితే వారం కాదు మూడేళ్ల సమయం ఇస్తామని మా ముఖ్యమంత్రి తేల్చి చెప్పారనీ గుర్తుచేశారు. మేడిగడ్డలో నీళ్లు నిలిపితే తలెత్తే పరిణామాలను మా సిఎం చాలా స్పష్టంగా వివరించారనీ,మేడిగడ్డ కుంగిపోయిని తర్వాత నీళ్ల కిందకు వదిలేయాలని ఎన్‌డిఎస్‌ఎ తేల్చి చెప్పిందనీ అన్నారు. మేడిగడ్డలో నీళ్లు ఉంటేనే కన్నెపల్లి పంప్ హౌస్‌ను ఆన్ చేసే అవకాశముందనీ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల 10, 8, 5 మీటర్ల నీళ్ల నిల్వ ఉంటేనే పంప్‌లు ఆన్ చేయడానికి అవకాశం ఉంటుందనీ ఆయన వివరించారు. నీళ్ల నిల్వ ఉంచినప్పుడు బ్యారేజ్‌లకు ఏదైనా జరిగి కింద ఉన్న గ్రామాలు మునిగిపోతే ఎవరిది బాధ్యత అని ప్రశ్నించారు. బ్యారేజ్‌లను రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలన్నదే మా తపన అని అన్నారు.. రాజకీయాలు తప్ప బిఆర్‌ఎస్ నాయకులకు ఏదీ పట్టదనీ విమర్శించారు. కాళేశ్వరం పేరిట రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన తీరును తెలంగాణ రైతులు గమనిస్తున్నారనీ అన్నారు.

## సత్తుపల్లి బ్లాక్-3ని సింగరేణికి కేటాయించాలి

### కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల లేఖ


**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** సత్తుపల్లి బ్లాక్3 బొగ్గు గనిని సింగరేణికు కేటాయించాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు దీనికి సంబంధించి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డికి బుధవారం రాసిన లేఖలో ప్రాంతీయ ఇంధన అవసరాలు నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో సింగరేణి తన బొగ్గు నిల్వలను, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందిం చేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ క్రమంలో వేలం ద్వారా అదనపు బొగ్గు వనరులను సమకూర్చుకునే దిశగా సంస్థ చర్యలు చేపడుతోందని వివరించారు. సింగరేణి ప్రస్తుతం నిర్వహిస్తున్న గనుల లీజు ప్రాంతాలకు ఆనుకుని ఉన్న సత్తుపల్లి బ్లాక్3ను 16వ దఫా బొగ్గు గనుల వేలంలో అవంతిక కాంట్రాక్టర్స్ దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ సంస్థతో 2024 జనవరి 8న బొగ్గు గని అభివృద్ధి మరియు ఉత్పత్తి ఒప్పందం కుదిరినప్పటికీ, ఇప్పటివరకు ఆ బ్లాక్‌లో మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. స్వతంత్రంగా గనిని అభివృద్ధి చేయడంలో ఆ సంస్థ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసిందన్నారు. సింగరేణి ఇప్పటికే నిర్వహిస్తున్న గనులకు ఆనుకుని ఉన్న సత్తుపల్లి బ్లాక్3ను కూడా కేటాయిస్తే, ప్రస్తుతం అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, గనుల నిర్వహణ వ్యవస్థ, సాంకేతిక నైపుణ్యంతో మైనింగ్ కార్యకలాపాలను ప్రారంభించే అవకాశం ఉంటుందని తెలిపారు. దీని ద్వారా బొగ్గు ఉత్పత్తి వేగంగా ప్రారంభమై దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో సింగరేణి మరింత సమర్థవంతమైన పాత్ర పోషించగలదని పేర్కొన్నారు. తక్కువ వ్యవధిలోనే బొగ్గు తవ్వకాల కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంటుందని, అదనపు భూసేకరణ అవసరం గణనీయంగా తగ్గుతుందని, పర్యావరణంపై ప్రభావం కూడా తగ్గుతుందని తెలిపారు. సింగరేణితో పాటు, రాష్ట్ర విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, సత్తుపల్లి బొగ్గు గనిని కేటాయించేలా చొరవ తీసుకొని అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఖమ్మం డెయిరీ మూసివేతపై ఉద్యమం

### హెచ్చరించిన రైతు సంఘం

**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** ప్యాకింగ్ ప్లాంట్ పునరుద్ధరణ సాకుతో ఖమ్మం విజయ డెయిరీని మూసివేతపై తెలంగాణ రైతు సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్లాంట్‌ను పునరుద్ధరించడంతో పాటు పాల సేకరణ పెంచాలని డిమాండ్ చేసింది. డెయిరీని తక్షణం తెరవకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించింది. ఈ మేరకు తెలంగాణ రైతు సంఘం బృందం మూతబడిన విజయ డెయిరీ ప్యాకింగ్ యూనిట్‌ను పరిశీలించింది. ఈ సందర్భంగా రైతు సంఘం నేతలు మాట్లాడుతూ విజయ డెయిరీ భూములను కబ్జా చేయాలనే ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. ఖమ్మం డెయిరీలో పనిచేస్తున్న వందలాది మంది సిబ్బంది రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 50 సంవత్సరాలుగా రైతుల నుండి విజయవంతంగా పాలు సేకరిస్తున్న విజయ డెయిరీని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మూత వేసిందని విమర్శించారు. ప్రభుత్వం లీటర్‌కు రూ. 4 చొప్పున ప్రకటించిన బోనస్‌ను ఇవ్వకపోగా, ప్రతి నెలా చెల్లించాల్సిన పాల బిల్లులను జాప్యం చేస్తూ రెండు నెలలకోసారి చెల్లిస్తున్నారని అన్నారు.

అలాగే గతంలో 30 వేల లీటర్ల పాల సేకరణ చేసిన డెయిరీని దిగజార్చి నేడు 3,500 నుంచి 7000 లీటర్లు మాత్రమే సేకరిస్తుండటం సరికాదన్నారు. ఇక్కడ సేకరిస్తున్న 7000 లీటర్ల పాలను హైదరాబాద్ తరలించి అక్కడి నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల సంస్థపై ఆర్థిక భారం పడుతుం దని తెలిపారు. ప్రయివేటు డెయిరీల తరహాలో వారానికోసారి బిల్లులు చెల్లిస్తే విజయ డెయిరీ వైపు రైతులు మొగ్గుచూపుతారని సూచించారు.



## వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై8:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ లోని నివాసంలో వారి చిత్రపటానికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి , మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి.రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ నివాళులు అర్పించారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఒక్కరి గుండెల్లో ఉంటాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అన్నారు. ఆయన నిరుపేదలకు అందించిన సేవలు, చూపిన సంక్షేమ బాట ఎప్పటికీ చిరస్మరణీయమని సీఎం కొనియాడారు.

## సిఎం,టిపిసిసి చీఫ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం

### గాంధీభవన్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

**హైదరాబాద్, జులై 8,ప్రభాతవార్త:** రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసిన సందర్భంగా గాంధీ భవన్‌లో ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు మోత రోహిత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా 72.58 లక్షల మంది రైతుల ఖాతాల్లో దాదాపు 8000 కోట్ల రూపాయిలు నేరుగా జమచేసిన సందర్భంగా ఎనుముల రేవంత్ రెడ్డి టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆనందోత్సాహాలతో పాలాభిషేకం నిర్వహించి, మిఠాయిలు పంచుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. దాదాపు 1 కోటి 32 లక్షల ఎకరాలకు రైతు భరోసా అందిందనీ మోత రోహిత్ ముదిరాజ్ తెలిపారు.రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. రైతులకు ఇచ్చిన ప్రతి హామీ రైతు రుణమాఫీ , పంటకు 500 రూపాయిలు బోనస్ , రైతు భరోసా ఇలానిలబెట్టుకుంటూ వారి అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందనీ తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మేము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు.

## వర్షాకాలంలోనూ నిరంతర విద్యుత్: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్

**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త:** వర్షాకాలం లోనూ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ వి పాటిల్ స్పష్టం చేశారు. విద్యుత్ అంతరాయాలు నివారించేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టామన్నారు. ఈ మేరకు బుధవారం టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ట్రీ ట్రిమ్మింగ్, యూజీ ట్రెంచ్ పునరుద్ధరణ, డీటీఆర్ మ్యాపింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ ట్రిమ్మింగ్) కార్యక్రమాన్ని అత్యవసర ప్రాతిపదికన చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో చెట్ల కొమ్మల తొలగింపు పనులు 24 గంటల్లోపు పూర్తి చేయాలని తెలిపారు. స్థానిక మున్సిపల్ అధికార్లతో సమన్వయం చేసుకుని తొలగించిన చెట్ల కొమ్మలను నిల్వ చేసేందుకు తగిన డంపింగ్ ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. లైన్ క్లియరెన్స్ కార్యక్రమాలకు ముందు విద్యుత్ శాఖ అధికారులు మున్సిపల్ శాఖలతో ఒక రోజు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు. అలాగే క్యూర్ రీజియన్ పరిధిలో ట్రీ ట్రిమ్మింగ్, లైన్ క్లియరెన్స్ కార్యక్రమాలను రాబోయే పది రోజుల్లో పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అండర్ గ్రౌండ్ కేబుల్ పనుల అనంతరం చేపట్టాల్సిన ట్రెంచ్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. క్యూర్ రీజియన్ పరిధిలో ఇప్పటికే 90 శాతం డీటీఆర్ మ్యాపింగ్ జరగ్గా, మిగిలిన వాటిని కూడా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల 10వ తేదీ తరువాత విద్యుత్ లైన్లు, స్తంభాలు, డీటీఆర్‌లను క్షేత్ర స్థాయిలో తనిఖీచేసి లోపాలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని పేర్కొన్నారు.

# సత్తా చాటుతున్న విద్యా రంగం..

### పిజిఐ ర్యాంకింగ్‌లో దూసుకొచ్చిన తెలంగాణ

### ఉపాధ్యాయుల నియామకం, శిక్షణ, ప్రత్యేక శ్రద్ధ ప్రభావం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాలయం వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జు లై8:** బడ్జెట్ కేటాయింపుల పెంపు, ఉపాధ్యాయులు నియామకం.. పదోన్నతులు... అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా కల్పిస్తున్న మౌలిక వసతులు.. అన్నింటికి మించి విద్యా రంగంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చూపుతున్న ప్రత్యేక శ్రద్ధతో తెలంగాణ విద్యా రంగం జాతీయ స్థాయిలో సత్తా చాటుతోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 2.0 (పిజి 2.0)లో తెలంగాణ ముందుకు దూసుకు వచ్చిం ది. పీజీఐలో 1000 స్కోరుకు గానూ తెలంగాణ స్కోరు 2024-25లో 552.5గా ఉండగా 2025-26లో అది 599.7కి చేరుకుంది. ఫలితంగా గతంలో 28 స్థానంలో నిలిచిన రాష్ట్రం ఇప్పుడు 10 స్థానాలు అధిగమించి 18వ స్థానానికి చేరుకుంది. గతంలో ఆకాంక్షి-1 విభాగంలో ఉన్న రాష్ట్రం ప్రస్తుతం ప్రచేష్ట-3లోకి చేరుకుంది. విద్యా ప్రమాణాలు పెరగడంతో గతంలో ఉన్న స్థానం కంటే కనీసం ఒక్కో స్థానాన్ని జిల్లాలు మెరుగుపర్చుకున్నాయి. ఈ గ్రేడింగ్‌లో ఏ జిల్లా కూడా గతం కంటే తక్కువ స్థానానికి పడిపోలేదు. ప్రతి పాఠశాలలో నాణ్యమైన విద్యా బోధన జరగ డమే ప్రస్తుత ర్యాంకింగ్ పెరగడానికి కారణ మైంది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. తెలంగాణలోని 33 జిల్లాల్లో జనగాం, మంచిర్యాల వరుసగా 383, 360 స్కోరుతో ఉత్తమ్-3 విభాగంలో నిలిచాయి. రాష్ట్రంలో విద్యా ప్రమాణాల మెరుగే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం 10,006 ఉపాధ్యాయ నియామకాలు చేపట్టింది. డీఎస్సీ 2008కి చెందిన 1,382 మందిని కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా నియమించింది. పదేళ్ల పాటు విస్మరించిన ఉపాధ్యాయ శిక్షణను పునఃప్రారంభించింది. 1,12,882 మంది ఉపా ధ్యాయులు, 1,16,084 మంది ప్రధానోపాధ్యా యులకు వేసవిలో 5 రోజుల చొప్పున శిక్షణ ఇచ్చారు. 2018 తర్వాత 2024, జూన్‌లో 34,706 మంది ఉపాధ్యాయులకు బదిలీలను చేపట్టింది. వివిధ కేడర్లలోని 25,950 మంది ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది.ప్రభుత్వ పాఠశాలల్లోని మూడో తరగతి విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల విద్యా ర్థుల కంటే మెరుగైన ప్రతిభ కనపర్చారు. మూడో తరగతి విభాగంలో తెలంగాణ ర్యాంకు 36 నుంచి 26కు, ఎనిమిది, తొమ్మిదో తరగతుల విభాగంలో 26 నుంచి 17కు ఎగబాకింది.రాష్ట్రం లోని 495 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాల యాల్లో 283 విద్యాలయాలు ఇప్పటికే ఇంటర్మీ డియట్ వరకు అప్‌గ్రేడ్ కాగా 2025-26 సంవ త్సరంలో రాష్ట్ర ప్రభుత్వం మరో 120 కేజీబీవీ లను ఇంటర్మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసింది. 93 కేజీబీవీలను యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా గుర్తించి ఇంజినీరింగ్, మెడిసిన్, న్యాయ విద్య ప్రవేశ పరీక్షలకు విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ ఫలితాల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యం తెలుగులో 9 నుంచి 35 శాతానికి, ఇంగ్లిష్‌లో 4నుంచి 29 శాతానికి, ఉర్దూలో 19 నుంచి 40శాతానికి, గణితంలో 18 శాతం నుంచి 30 శాతానికి పెరిగాయి.రాష్ట్ర ప్రభుత్వం ఏక్‌స్టెప్ ఏఎక్స్ఎల్-ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని 1,354 పాఠశాలల్లో అమలు చేస్తూ 15,848 మంది విద్యార్థులకు చదవడం, అవగాహన చేసుకోవడం, అంకెలు, సంఖ్యా పరిజ్ఞానంలో శిక్షణ ఇస్తోంది. ఫిజిక్స్‌వాలా ఉచిత డిజిటల్ కోచింగ్‌ను 194 మోడల్ స్కూళ్లు, 495 కేజీబీవీలు, 37 తెలంగాణ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో అంది స్తోంది. ఆరు నుంచి 12వ తరగతి వరకు గణితం, సైన్స్ బోధనకు ఖాన్ అకాడమీ ఉచితంగా చేయూతనిస్తోంది. 1,132 పాఠశాలల్లో ఐసీటీ ల్యాబ్‌లు, 2,036 పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, 4,249 ప్రాథమిక పాఠశాలల్లో ఏఎక్స్ఎల్ కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణత 95.15 శాతంగా నమోదైంది. 5,731 పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించాయని పేర్కొన్నారు.

## భవనం పైనుంచి కింద పడ్డ బాలుడికి రెయిన్‌బో ఆసుపత్రిలో చికిత్స

**హైదరాబాద్,జూలై 8,ప్రభాతవార్త:** ఐదంతస్తుల భవనం నుంచి ప్రమాదవశాత్తు జారిపడ్డ పద మూడేళ్ల బాలుడిని బంజారాహిల్స్ రెయిన్‌బో ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండటంతో ఆయనకు ప్రాణాపాయం తప్పిందని రెయిన్‌బో పీడియాట్రిక్ డా.అనుపమ,చీఫ్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ కోనేటి నాగేశ్వరరావు ఒక ప్రక టనలో తెలిపారు.

ఐదవ అంతస్తునుంచి కిందపడ దగానే ఆ బాలుడికి ముఖాకృతిఎముకలు దెబ్బతిన దంతతోపాటు,తొడ ఎముక విరిగడం, అనే అవయవాలు దెబ్బతినడంతో చావుబతుకుల మధ్య నిజామాపేటలోని ఒక ఆసుపత్రికి తీసుకొని రాగా అక్కడి డాక్టర్లు కూకట్‌పల్లి రెయిన్‌బో ఆసుపత్రికి తరలించారు. కూకట్‌పల్లి నుంచి ఆ బాలుడిని హుటాహుటినా వెంటిలేటర్ వాహనంలో బం జారా హిల్స్ ఆసుపత్రికి తరలించడంతో ఐసియు లోకోర్ట్రి ఆయన కు చికిత్స ఇవ్వడం మొదలు పెట్టడంతో వెంటనే ఆ బాలుడు చికిత్సకు స్పం దించారు. పిల్లవాడు ఆసుపత్రికి తీసుకొచ్చిన ప్పుడు చాలా పరిస్థితి తీవ్ర ఆందోళన కరంగా ఉన్నదని ఐతే ఎముకలు,కండ్లు, గొంతు, ముక్కు ఉదరం,ముఖాకృతిఎముకలు, గుండెతోపాటు అనేక రంగాల ప్రత్యేకవైద్యులు నడ్పులు కలిసి ఒక జట్టుగా ఆ బాలుడి ప్రాణాలు పోయడానికి అవిశ్రాంతిగా పనిచేయడంతో కోలుకోవడానికి మార్గం సుగమమైందని ప్రస్తుతం ఆయన శరీరంలోని ప్రతి అవయం కోలుకొంటున్నదని డాక్టర్ వైద్యసంగమ తెలిపారు. కోనేటి నాగేశ్వర రావు ఫోరెన్సిక్ బృహద్దమని గాయం చిన్నప్పుడే అరుదుగా అవుతోందని వెంటనే గుర్తించి ప్రాణా పాయస్థితి ఏర్పడకుండా ఎలాంటి చికిత్స చేయ డంతో రక్తస్రవరణకు ఎలాంటి ఆటంకం జరగకుండా చేశామని తెలిపారు.

## ఎరువుల సరఫరాకు తక్షణ చర్యలు తీసుకోవాలి

### కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 8, ప్రభాతవార్త:** తెలంగాణలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సరిపడా ఎరువుల సరఫరాకు తక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు లేఖ రాశారు. ఏప్రిల్-జూన్ నెలల్లో రాష్ట్రానికి జరిగిన ఎరువుల సరఫరా లోటును ఈ నెల అదనపు కేటాయింపుల ద్వారా భర్తీ చేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 55.52 లక్షల ఎకరాల్లో విత్తనాలు విత్తడం పూర్తయ్యాయని, గత ఏడాది ఇదే సమయానికి 52.04 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు జరిగగా, విస్తీర్ణం ఇప్పటికే పెరగడంతో ఎరువుల అవసరం కూడా పెరిగిం దని చెప్పారు. ఖరీఫ్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే అన్ని జిల్లాల్లో ఎరువుల నిల్వలను ఏర్పాటు చేసినప్పటికీ, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో కేంద్రం ఆమోదించిన ప్రణాళిక మేరకు సరఫరాలు జరగ లేదని తెలిపారు. ముఖ్యంగా డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల సరఫరాలో భారీ లోటు ఏర్పడటంతో బఫర్ స్టాకు తగ్గిపోయి, రైతులకు సరఫరాపై ఒత్తిడి ఏర్పడిందన్నారు. ఏప్రిల్-జూన్ కాలంలో యూరియా 0.45 లక్షల మెట్రిక్ టన్నులు, డీఏపీ 1.04 లక్షల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 2.53 లక్షల మెట్రిక్ టన్నుల మేర లోటు ఏర్పడిందని మంత్రి వివరించారు. ప్రారంభ దశ పంటలకు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువు లు అత్యంత కీలకమైనందున, ఈ లోటు రైతులకు ఇబ్బందులు కలిగించే అవకాశముందని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో ఉన్న రామగుం డం ఎరువుల కర్మాగారం నుంచి ఉత్పత్తి అయ్యే యూరియాలో 90 శాతానికి పైగా తెలంగాణకే కేటాయించాలని కోరారు.

# మియాపూర్ కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

### అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా హత్య చేసిన భార్య

**గచ్చిబౌలి, జులై 8 ప్రభాతవార్త:** అక్రమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన ఓ భార్య, భర్త తినే అన్నంలో నిద్రమాత్రలు కలిపి, అనంతరం ప్రియుడితో కలిసి దిండుతో ఊపిరాడకుండా చేసి హత్య చేయడంతో పాటు మృతదేహాన్ని మహారాష్ట్ర శివారుకు తరలించి, పెట్రోలు పోసి నిప్పంటించారు. అనంతరం ఏమీ తెలియనట్టు తన భర్త కనిపించడం లేదని పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేసింది. మియాపూర్ సంచలన హత్య కేసులో మృతుడి భార్యతో పాటు ఆమె ప్రియుడు, అతని స్నేహితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు బుధవారం మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసిపి రితిరాజ్ ఈ కేసుకు సంబంధించిన వివ రాలు వెల్లడించారు. మియాపూర్ అంబేద్కర్ నగర్‌లో నివాసం ఉండే మల్లాని పెంటేష్(57) తన మొదటి భార్యతో విబేదాల కారణంగా విడాకులు తీసుకున్నాడు. ఇతనికి అంబేద్కర్ నగర్‌లోనే నివాసం ఉంటున్న సత్యవతి(47)తో పరిచయం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లికి చెందిన సత్యవతి సైతం తన భర్తతో ఏర్పడిన విభేదాలతో భర్తకు దూరంగా ఉంటూ నగరానికి వచ్చింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయంతో ఇద్దరు పెళ్లి చేసుకున్నారు. వీరికి ఓ కుమారుడు ఉండగా, పెంటేష్ పటాన్ చెరు సమీపంలో వ్యవసాయం చేస్తున్నాడు. కాగా గత సంవత్సరం నవంబరు 19వ తేదీన ఉదయం పటాన్‌చెరులోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన పెంటేష్ తిరిగి రాలేదని, ఫోన్ చేసినా స్పందన లేదంటూ 25వ తేదీన సత్యవతి మియాపూర్ పోలీసులకు పిర్యాదు చేసింది. దీంతో మియాపూర్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసు విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి.

పెంటేష్ భార్య సత్యవతికి మర్రి మధుసూ ధన్‌రెడ్డి(47) అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ప్రియుడితో కలిసి ఉండేందుకు, భర్త ఆస్థిని కాజేసేందుకు భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన సత్యవతి ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని పథకం వేసింది. ఇందులో భాగంగా మధుసూ ధన్‌రెడ్డితో కలిసి భర్తను హత్య చేయాలని నిర్ణయించుకుంది. 2025వ సంవత్సరం నవంబరు 19వ తేదీన రాత్రి భర్త తినే ఆహారంలో నిద్రమాత్రలు కలిపింది. ఆహారం తిన్న పెంటేష్ ఆపస్మాకర స్థితికి వెళ్లడంతో ప్రియుడు మధుసూదన్‌రెడ్డిని, అతని స్నేహితుడు దిండి రాజేష్‌కుమార్(47)ను పిలిచి మొఖంపై దిండుతో ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం మధుసూధన్‌రెడ్డి, రాజేష్‌లు కలిసి పెంటేష్ మృతదేహాన్ని ఎక్స్‌యువి 500 వాహనంలో మియాపూర్ నుంచి మహారాష్ట్ర నాయిదుర్గ్ కు కారులో తరలించారు. అక్కడ నిర్మాణుష్య ప్రాంతంలో పెంటేష్ మృతదేహాన్ని పెట్రోలు పోసి తగులబెట్టి నగరానికి తిరిగి వచ్చారు.అనంతరం వారం రోజుల తరువాత భర్త కనిపించడం లేదని సత్యవతి మియాపూర్ పోలీసులకు పిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు 7 నెలల విచారణ అనంతరం భార్య సత్యవతిని అనుమానించారు.

దీంతో సత్యవతి కాల్ డేటాను పరిశీలించగా, మధుసూధన్‌రెడ్డితో ఎక్కువగా ఫోన్ మాట్లాడు తుందని గుర్తించారు. పోలీసుల విచారణలో మధుసూధన్‌రెడ్డికి సత్యవతితో వివాహేతర సంబంధం ఉందని తేలడంతో సిసి కెమెరాలను పరిశీలించిన పోలీసులకు కొన్ని ఆధారాలు లభించాయి. దీంతో సత్యవతిని అదుపులోకి తీసుకొని విచారించడంతో 7నెలల క్రితం జరిగిన హత్య విషయం వెలుగు చూసింది. దీంతో సత్యవతితో పాటు ఆమె ప్రియుడు మధుసూధన్‌రెడ్డి, అతని స్నేహితుడు రాజేష్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి ఎక్స్‌యుడి 500 కారు, 5సెల్‌ఫోన్లు, బంగారు గొలుసు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు.



## హైదరాబాద్‌కు విచ్చేసిన ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పిటి ఉష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై8:** హైదరాబాద్ నగరంలో నిర్వహించనున్న పలు క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పి.టి. ఉష బుధవారం హైదరా బాద్‌కు విచ్చేశారు.తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వివిధ కార్యక్ర మాల్లో ఆమె పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి గచ్చిబౌలి స్టేడియంలోని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ లోగోను ఆవిష్కరించ డంతో పాటు, వెబ్‌సైట్‌ను ప్రారంభించి, పలు విద్యా కోర్సులను ప్రారంభించనున్నారు. అదేవి ధంగా, తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వ ర్యంలో చేపట్టనున్న పారా నేషనల్ పారా అథ్లె టిక్ సపోర్ట్ ప్రోగ్రామ్, హైదరాబాద్‌లో నిర్వహిం చనున్న నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్‌మీట్, ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 కార్యక్రమాలను ప్రకటించ నున్నారు. అలాగే, తెలంగాణ క్రీడా శాఖ నిర్వహించే వివిధ క్రీడా లీగ్‌లను ఆమె లాంఛ నంగా ప్రారంభిం చనున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో తెలం గాణలోని వివిధ జిల్లా కేంద్రాల్లో నిర్వహిం చనున్న 'స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్' కార్యక్రమా నికి సంబంధించిన ప్రత్యేక వాహనాలను కూడా పి.టి. ఉష ప్రారంభిం చనున్నారు. బుధవారం సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయానికి చేరు కున్న పి.టి. ఉషకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సోనీ బాలాదేవి, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు స్వాగతం పలికారు.

## గురుకుల విద్యార్థుల ఆరోగ్యం-భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

### వర్షాకాల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్,జులై 8,ప్రభాతవార్త:** తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసం స్థల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత, నాణ్యమైన విద్యకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశిం చారు.వర్షాకాలం నేపథ్యంలో తాగునీరు, వేడి నీరు, పారిశుద్ధం, వైద్య సేవలపై ప్రత్యేక నిఘా పెట్టాలని స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని మంత్రి కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్, టిజిటి డబ్ల్యుఆర్ఇ ఐఎస్ విద్యా సంస్థల్లో అడ్మిషన్ల ప్రక్రియ, విద్యా నిర్వహణ, విద్యార్థుల సంక్షేమం, వర్షాకాల ఏర్పాట్లపై మంత్రి సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ గురుకులాల్లో ప్రవేశాల ప్రక్రియ పూర్తిస్థాయి పారదర్శకతతో,నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత విద్యాసంవత్సరంతో పోలిస్తే ఈసారి అడ్మిషన్ల సంఖ్య పెరిగిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులకు అవసరమైన వేడి నీరు అందుబాటులో ఉంచాలని, తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా నీటి ట్యాంకుల శుభ్రపరిచే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి,ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ సంతోష్ ,తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సంస్థ కార్యదర్శి కంభంపాటి శారద, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల అదనపు కార్యదర్శి నటరాజ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ఎల్ఐజి ఇళ్ల పథకానికి లోగో పోటీ

## విజేతలకు లక్ష రూపాయల బహుమతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై8:** తెలంగాణ ప్రభుత్వం క్యూర్ పరిధిలో ప్రతిష్టాత్మ కంగా చేపడుతున్న ఎల్ఐజీ గృహ నిర్మాణ పథకానికి అధికారిక లోగో రూపకల్పన కోసం తెలంగాణ హౌసింగ్ బోర్డు ప్రజల నుండి ఎంట్రీలను ఆహ్వానిస్తోంది. ఉత్తమ లోగోను డిజైన్ చేసిన విజేతకు రూ. 1 లక్ష నగదు బహుమతిని అందజేయనున్నట్లు ప్రకటించింది. ఆసక్తి గల వారు తమ డిజైన్లను 2026, జూలై 12వ తేదీ లోపు సమర్పించాల్సి ఉంటుంది. హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ వి.పి. గౌతమ్ ఈ వివరాలను తెలుపుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. లోగో పోటీలో పాల్గొనాలనుకునే డిజైనర్లు, విద్యార్థులు, కళాకారులు, ఇతర సృజనకారులు తమ ఎంట్రీలను హౌసింగ్ బోర్డ్ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ ద్వారా పంపవచ్చని తెలిపారు.ఇప్పటికే ఈ పథకానికి పేరు సూచించేందుకు జూన్‌నెలలో నిర్వహించిన పోటీకి ప్రజలనుండి అనూహ్య స్పందన లభిం చింది. దాదాపు 14,000 ఎంట్రీలు రాగా, ప్రస్తుతం వాటిని పరిశీలిస్తున్నారు. విజేతను త్వరలోనే ప్రకటించి, పథకం ప్రారంభోత్సవ వేడుకలో బహుమతిని అందజేస్తామని హౌసింగ్ బోర్డువైస్ చైర్మన్ వి.పి.గౌతమ్ పేర్కొన్నారు.

# ఫీజుల రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేస్తే ఉద్యమం

### రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్షాల హెచ్చరిక



అభివాదం చేస్తున్న గుజ్జ కృష్ణ, మధుసూదనాచారి, జాజుల, దత్తాత్రేయ, ఎమ్మెల్సీలు రమణ, సత్యం తదితరులు

**హైదరాబాద్, జులై 8,ప్రభాతవార్త:** ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను యధావిధిగా అమలు చేయాలని ఫీజుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని గత సంవత్సర కాలంగా బీసీలు ఉద్యమిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకు ట్టినట్లు కూడా లేదని, ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని రద్దు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని ఇదే జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వం పీఠాలు కూలుతయ్ అని అఖిలపక్ష రాజకీయ పార్టీల నేతలు, బీసీ సంఘాల నాయ కులు రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఫీజుల రియంబర్స్మెంట్ సమస్య భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ పై అ ఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం జరిగింది, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ (బీసీ జేఏసీ చైర్మన్) బండారు దత్తాత్రేయ (హర్యానా మాజీ గవర్నర్) సిరికొండ మధుసూదనాచారి, ఎల్ రమణ (టిఆర్ఎస్) నెల్లికంటి సత్యం (సిపిఐ) తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఫీజు రియంబర్స్మెంట్ రద్దు చేసి కాంగ్రెస్ బీసీల ద్రోహానికి పాల్పడుతుందని, బీసీలకు అన్యాయం చేయాలని ఉద్దేశంతోనే రాష్ట్ర హైకోర్టులో ఫీజు రియంబర్స్మెంట్ కేసులో కనీసం అడ్వకేట్ జనరల్ హాజరు కాకుండా కావాలనే ఫీజుల రద్దుకు సంబంధించిన తీర్పు రావాలని ప్రభుత్వం చూస్తుందన్నారు.హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్పగా మాటలు చెబుతున్నాడని, వారు అనుకున్న మూడు ట్రిలియన్ ఆదాయం రావాలంటే మానవ వనరుల అభివృద్ధి జరగాలంటే ప్రతి ఒక్కరు ఉన్నత విద్యను అభ్యసించి స్వశక్తితో ఎదగాలన్నారు. బిఆర్ఎస్ శాసన సభ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కావాలనే ఉద్దేశపూర్వకంగా విద్యార్థుల ఉన్నత విద్యపట్ల తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తుందన్నారు. ఈ సమావేశంలో గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, కనకాల శ్యాం కురుమ,డాక్టర్ నరసిం హ నాయక్, తారకేశ్వరి, కోటి, బండి గారి రాజు తదితరులు పాల్గొన్నారు.

## దాడులు, లాఠీచార్జ్‌తో ఉద్రిక్తత

### కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గపోరు

**యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త:** అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో తుంగతుర్తి నియోజకవర్గం వర్గపోరుకు కేంద్రబిందువుగా మారింది. నెలలుగా నివురు గప్పిన నిప్పులా ఉన్న ఎంపీ,ఎమ్మెల్యే వర్గాల మధ్య విభేదాలు బుధవారం ఒక్కసారిగా బహిర్గతమై రాజకీయంగా తీవ్ర సంచలనం సృష్టించాయి. పార్టీ మండల కమిటీల నియామకాలే చిచ్చు రేపగా, ఇరు వర్గాల మధ్య ఆధిపత్య పోరు బహిరంగ ఘర్షణలకు దారితీసింది. గాంధీ భవన్‌కు వెళ్తున్న నాయకులను అడ్డుకోవడం, తోపులాటలు, పరస్పర దాడులు, పోలీసుల లాఠీచార్జ్ వరకు పరిస్థితి వెళ్లడం కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత సంక్షోభానికి అద్దం పట్టింది.గత కొంతకాలంగా భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి కోమ టిరెడ్డి దామోదర్‌రెడ్డి వర్గాలకు చెందిన నాయ కులు ఒకవైపు, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వర్గం మరోవైపు తీవ్ర విభేదాలతో కొనసాగుతున్నాయి. ప్రతి కార్యక్రమం, ప్రతి నియామకం, ప్రతి నిర్ణయం రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరుకు వేదికగా మారుతోంది. బయటకు అంతా సవ్యంగానే ఉన్నట్లు కనిపించినా, లోలోపల అసంతృప్తి అగ్నికణాలు రగులుతూనే ఉన్నాయని పార్టీ శ్రేణులే చెబుతున్నాయి.ఇటీవల ప్రకటించిన మండల కాంగ్రెస్ కమిటీలే ఈ విభేదాలకు ప్రధాన కారణమయ్యాయి. దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తలను పక్కనబెట్టి, ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి కీలక పదవులు కట్టబెట్టారని అసంతృప్తి వర్గం తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ప్రస్తుతం తుంగతుర్తి కాంగ్రెస్‌లో రాజకీయ వేడి మరింత పెరగగా, ఈ వర్గపోరు ఎలాంటి మలుపు తిరుగు తుందన్నది ఆసక్తికరంగా మారింది.

## హెచ్1బీ, గ్రీన్‌కార్డు, విద్యార్థి వీసా నిబంధనలు మరింత కఠినతరం

### కార్యాచరణ అమలుకు ట్రంప్ ఆదేశాలు



**వాషింగ్టన్,జులై 8:** అమెరికాలో వలస విధానాలను మరింత కఠినతరం చేసే దిశగా డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హెచ్1బీ వీసా కార్యక్రమం, ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డులు, అంతర్జాతీయ విద్యార్థుల వీసాల కాలపరిమితి, వారికి అందించే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ అంటే ఓపిటి కార్యక్రమాల్లో పలు మార్పులు తీసు కురావడానికి ట్రంప్ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఉద్యోగ అనుమతి పత్రాల ఆటోమేటిక్ పొడి గింపును కూడా రద్దు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ మార్పులు అమల్లోకి వస్తే భారతీయ ఐటీ నిపుణులు, విద్యార్థులు, హెచ్4 వీసాదారులు అత్యధికంగానష్టపోతారు. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం, కార్మిక, విదేశాంగ శాఖ విడుదల చేసిన తాజా నియంత్రణ ప్రణాళికల్లో ఈ ప్రతిపాదనలు చోటు చేసుకున్నాయి. ఇవి ఇంకా అధికారిక నిబంధనల రూపంలో అమలుకు రావాల్సి ఉన్నప్పటికీ, ట్రంప్ ప్రభుత్వ వలస విధానాల దిశను స్పష్టంగా సూచిస్తున్నాయి.హెచ్ 1బీ వీసా నిబంధనలు మరింత కఠినంగా మార నున్నాయి. ఆగస్టులో విడుదలయ్యే ప్రతిపాదిత నిబంధనల ప్రకారం హెచ్1బీ వీసా కార్యక్రమంలో వార్షికంగా ఉండే 85 వేల కోటాకు మినహాయింపులు పొందే సంస్థలపై కఠిన నిబంధనలు అమలు చేయనున్నారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు, అర్హత కలిగిన పరిశోధనా సంస్థలు లాటరీ విధానానికి లోబడకుండా ఎప్పు డైనా హెచ్1బీ ఉద్యోగులను నియమించుకోవచ్చు. ఈ వెసులుబాటును పరిమితం చేసే అవకా శముంది. హెచ్1బీ ఉద్యోగులను థర్డ్‌పార్టీ సంస్థల వద్ద పనిచేయించే యజమానులపై అదనపు నిబంధనలు విధించనున్నారు. భారతీయ ఐటీ, కన్సల్టింగ్ సంస్థలు విస్తృతంగా అనుసరిస్తున్న ఈ విధానంపై ప్రభుత్వం మరింత పర్యవేక్షణ చేపట్టనుంది.

# మూడు నెలల పాటు మంత్రి పదవి ఇవ్వండి

### కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను ఆన్ చేసి నీళ్లు తెచ్చి చూపిస్తా

### సిఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై8:** కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. తనకు మూడు నెలల పాటు నీటిపారుదల శాఖ బాధ్యతలు అప్పగిస్తే, కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లను ఆన్ చేసి ఎల్లంపల్లికి నీటిని తరలిస్తానని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ఈ ప్రక్రియలో విఫలమైతే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సంచలన ప్రకటన చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ రావు పవర్‌పా యింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టులో కాంగ్రెస్ నేతలు రూ.2,328 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం గతంలోనే అనుమతి ఇచ్చి ఉంటే ఆ ఒప్పంద పత్రాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.నదుల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ జలాశయాలను నింపడం లేదని, దేవాదుల పంపులను నడపడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు.

## 7వరోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు

### తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణాన్ని పరిరక్షించాలంటూ నిరసనలు


**నాంపల్లి, జులై 8 ప్రభాతవార్త :** సురవరం ప్రతాపురెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణాన్ని పరిరక్షించాలంటూ డిమాండ్‌చేస్తూ పెద్దయెత్తున చేపట్టిన నిరసనలు, రిలే నిరాహా రదీక్షలు బుధవారంతో 7వ రోజుకు చేరుకు న్నాయి. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్లు, పూర్వ విద్యార్థులు సంఘీభావం ప్రకటించి ఉద్యమానికి పూర్తి మద్ధతు ప్రకటిం చారు. విశ్వవిద్యాలయ నాంపల్లి ప్రాంగణాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసే అధికారం ప్రభుత్వానికి లేదని, అవసరమైతే న్యాయ పోరాటాని సిద్ధమేనని ఆచార్య బృందం స్పష్టం చేసింది. నాంపల్లి బి.డిజైన్ విద్యార్థులు తమ సృజనాత్మక కళారూపాలు, చిత్రలేఖనాల ద్వారా వినూత్నరీతిలో నిరసన వ్యక్తపరిచారు. మా ఇంటి తర్వాత మేము అత్యధిక సమయం గడిపేది ఈ సరస్వతి నిలయమైన తెలుగు విశ్వవిద్యాలయంలోనేనని, ఇది మా ఆలయమని, కబ్జా చేయవద్దు అంటూ విద్యార్థులు భావోద్వేగంతో తమ ఆవేదనను వ్యక్తపరిచారు. అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు ఉద్యమానికి సంఘీభావం ప్రకటిస్తూ ప్రసంగించారు. విశ్వవిద్యాలయాన్ని యదాతథంగా కొనసాగిస్తామని స్పష్టమైన హామీనివ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తొలి ఉపాధ్యక్షుడు డా. తూమాటి దొణప్ప కుమారుడు టి.సుధాకర్‌తో పాటు ఆచార్య కడియాల సుధీర్‌కుమార్, ఆచార్య సత్తిరెడ్డి, ఆచార్య చంద్రశేఖర్ తదితరులు పాల్గొనడం విశేషం.

# పవన్ అభిమాని నిరంజన్ మృతి

### తీవ్రంగా విచారించిన ఎపి డి.సిఎం పవన్, సోనూసూద్

**హన్మకొండ టౌన్ :** ఏపీ డిప్యూటీ సీఎం,జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆత్మీయ వీరాభిమాని హనుమకొండ హనుమాన్ నగర్‌కు చెందిన పొను గంటి నిరంజన్ (17) బుధవారం హైదరాబాద్ లోని ఓఆస్పత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారు జామున తుదిశ్వాస విడిచాడు. గత కొంతకాలంగా అరుదైన జన్యు సంబంధిత (న్యూరోమస్క్యులర్) వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ ఆరోగ్యం మరింత క్షీణించడంతో కన్నుమూశారు. జూన్ 17న జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ నిరంజన్ నివాసానికి స్వయంగా వెళ్లి పరామర్శించిన సంగతి తెలిసిందే. మంచానికే పరిమితమైన నిరంజన్ పక్కన కూర్చుని, అతడిని ఆత్మీయంగా హత్తుకుని పవన్ కళ్యాణ్ ధైర్యం చెప్పారు. నిరంజన్ మృతి వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు.



నిరంజన్‌ను ఇటీవల పరామర్శించిన పవన్(ఫైల్)

నిరంజన్ కుటుంబంతో సోనూ సూద్ వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. నిరంజన్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# మళ్లీ ఇండోనేసియాకు వస్తా



## మూడేళ్లలో ప్రంబనన్ ఆలయ పునరుద్ధరణకు ప్రధాని మోడీ హామీ

### అధ్యక్షునితో కలిసి ఒకే వాహనంలో ఆలయానికి మోడీ

**జకార్తా,జులై 8:** ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో కోరిన మేరకు 2029 నాటికి ప్రంబనన్ ఆలయం పునరుద్ధరణ పనులను పూర్తి చేస్తామని తాను హామీ ఇచ్చానని, పనులు పూర్తయ్యాక ఆ వేడుకల్లో పాల్గొనేందుకు మరోసారి ఇండోనేషియాను సందర్శిస్తానని ప్రధాని నరేంద్ర మోడీ పకటించారు. ఇండోనేషియాలోని యోగ్య కర్తలో బుధవారం జరిగిన ప్రంబనన్ ఆలయ పునరుద్ధరణ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోడీ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో కలిసి పాల్గొన్నారు. ఆలయానికి ప్రధాని బసచేసిన ప్రాంతంనుంచి ఒకే వాహనంలో ఇరువురు కలిసి వెళ్లారు. ప్రంబనన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అక్కడి అధికారులతో మోడీ మాట్లాడారు. ఈ సందర్భంగా భక్తులు ఓం నమః శివాయ నినాదాలతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. పునరుద్ధరణ ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ, ఈ పనులను 2029లోపు పూర్తి చేయాలని అధ్యక్షుడు నన్ను మాట ఇప్పించారు. పునరుద్ధరణ పూర్తైన తర్వాత తప్పకుండా మళ్లీ ఇక్కడికి వచ్చి మీ అందరితో కలిసి ఈ చారిత్రక సందర్భాన్ని జరుపుకుంటానని ప్రధాని తెలిపారు. భారత్-ఇండోనేషియా మధ్య ఉన్న సాంస్కృతిక బంధాన్ని ప్రస్తావిస్తూ, సాంస్కృతిక వారసత్వమే మన రెండు దేశాలను బలంగా కలుపుతోంది.

ఈ వారసత్వాన్ని ఎంతో శ్రద్ధగా పరిరక్షించిన ఇండోనేషియా ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలని పేర్కొన్నారు. తనకు పరమశివుడితో ప్రత్యేక అనుబంధం ఉందని మోడీ చెప్పారు. నేను గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో జన్మిం చాను. అక్కడి హాటకేశ్వర్ మహాదేవ్ ప్రసిద్ధ పుణ్య క్షేత్రం. గుజరాత్‌లోనే ఉన్న సోమనాథ్ దేవాలయం ద్వాదశ జ్యోతిర్లింగాల్లో తొలి క్షేత్రం. దాని అభివృద్ధి బాధ్యతను నేను ప్రత్యక్షంగా నిర్వహిస్తున్నాను. నా పార్లమెంట్ నియోజకవర్గం కాశీ విశ్వనాథ ఆలయం ఉన్న వారణాసి. కాశీ విశ్వనాథుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ నాపై ఉంటాయి. కేదార్‌నాథ్ దేవాలయం పునర్నిర్మాణం, మహాకాళేశ్వర్ ఆలయం అభివృద్ధి, ఇప్పుడు ప్రంబనన్ ఆలయ పునరుద్ధరణ వంటి సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కైలాస్ మానససరోవర్ యాత్రలోనూ, ఇండోనేషియాలోని ప్రంబనన్ ఆలయంలోనూ వినిపించేది ఒకటే మహామృత్యుంజయ మంత్రోచ్చారణ అని ప్రధాని పేర్కొన్నారు. అక్కడా, ఇక్కడా ఓం నమః శివాయ నినాదాలు మార్మోగడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని చెప్పారు.

ఆగ్నేయాసియాలో భారతీయ సాంస్కృతిక వారసత్వానికి ప్రంబనన్ ఆలయం రెండో అతిపెద్ద గుర్తింపుగా నిలిచిందని మోడీ అన్నారు. ఈ ఆలయంలో పరమశివుడు, దుర్గాదేవి, శ్రీ గణేశుడి విగ్రహాలు ఉన్నాయని, శతాబ్దాలుగా భక్తిశ్రద్ధలతో ఇక్కడ పూజలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఆలయంలో సంప్రదాయబద్ధంగా పూజలు చేసే అవకాశం తనకు లభించడం జీవితంలో అత్యంత ఆధ్యాత్మిక క్షణాల్లో ఒకటిగా భావిస్తున్నానని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ఈ ఆలయాన్ని భవిష్యత్తులో మరింత మంది భారతీయులు సందర్శిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.



## బద్రీనాథ్ ఆలయంలోనూ విరాళాల చోరీలు

### దేవస్థాన కమిటీ ఉద్యోగి సస్పెన్షన్

**డెహ్రాడూన్,జులై 8:** ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ ధామ్‌లో భక్తుల విరాళాల నిర్వహణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు ప్రారంభమైన నేపథ్యంలో బద్రీనాథ్‌కేదార్‌నాథ్ దేవస్థాన కమిటీకి చెందిన ఓ ఉద్యోగిని సస్పెండ్‌చేశారు. మంగళవారం నలుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ దర్యాప్తు ప్రారంభించిన అనంతరం ఈ చర్య తీసుకున్నారు. బద్రీనాథ్‌కేదార్‌నాథ్ దేవస్థాన కమిటీ ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ ఆలయంతో పాటు ఇతర దేవాలయాల నిర్వహణ బాధ్యతలు చేపట్టే చట్టబద్ధ సంస్థ. దేవస్థాన కమిటీ ఛైర్మన్ హేమంత్ ద్వివేది మాట్లాడుతూ, ప్రాథమిక విచారణలో అక్రమాలకు సంబంధించిన ప్రాథమిక ఆధారాలు లభించడంతో కమిటీ ప్రైవేట్ సెక్రటరీగాపనిచేస్తున్న ప్రమోద్ నౌటియాల్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆదేశాల మేరకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం కూడా ప్రత్యేక దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ కమిటీ 15 రోజుల్లోగా తన విచారణ నివేదికతో పాటు సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనుంది. దేవస్థాన కమిటీలో అవినీతికి ఏమాత్రం తావులేదని హేమంత్‌ద్వివేది స్పష్టం చేశారు. దర్యాప్తులో ఎవరైనా ఉద్యోగి తప్పిదానికి పాల్పడినట్లు తేలితే వారిపై శాఖాపరమైన చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు కూడా కఠినంగా తీసుకుంటామని హెచ్చరించారు. బద్రీనాథ్ ధామ్‌లో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపులో అక్రమాలు జరిగాయంటూ సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు వెలువడిన తర్వాత ఈ విషయం ప్రాధాన్యం సంతరించుకుంది. అనంతరం భైరవ్ సేన అనే సంస్థ ఫిర్యాదు చేస్తూ సమగ్ర విచారణ జరిపి, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేసింది. దీంతో గత వారం బీకేటీసీ నలుగురు సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. సిసిటివి ఫుటేజీలు, సంబంధిత ఉద్యోగుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ కమిటీ దర్యాప్తు ప్రారంభించింది. ఇదేసమయంలో అయోధ్య రామమందిరంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణలు వెలుగు చూసిన నేపథ్యంలో, బద్రీనాథ్ ధామ్‌లోకూడా ఇలాంటి ఆరోపణలు రావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనను ప్రస్తావిస్తూ రాష్ట్రంలోని పుష్కర్ సింగ్ ధామి ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ఉత్తరాఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్ గోడియాల్ ఈ వ్యవహారంపై న్యాయ విచారణ లేదా రాష్ట్ర శాసనసభ సంయుక్త కమిటీతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.



## పూరీ రథయాత్రకు 12 వేల మంది పోలీసులతో భద్రత: డిజిపి

**భువనేశ్వర్, జులై 8:** ప్రపంచ ప్రఖ్యాత పూరీ జగన్నాథ రథయాత్ర ఉత్సవాలకు ఒడిశా పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. లక్షలాది మంది భక్తులు హాజరయ్యే ఈ తొమ్మిది రోజుల వేడుకను సురక్షితంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించేందుకు భూమి, జల, గగన మార్గాల్లో సమగ్ర భద్రతా కార్యాచరణను రూపొందించారు. ప్రధానంగా జనసమ్మర్ధ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర పరిస్థితులకు వేగవంతమైన స్పందన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. గగనతల నిఘా కోసం డ్రోన్లు, యాంటీడ్రోన్ వ్యవస్థలను వినియోగించనున్నారు. సముద్ర మార్గ భద్రతను మరింత బలోపేతం చేయడానికి భారత నౌకాదళం, భారత తీర రక్షక దళం (కోస్ట్ గార్డ్), ఒడిశా పోలీసుల మెరైన్ స్టేషన్ సంయుక్తంగా సముద్రంలో గస్తీ నిర్వహించనున్నాయి. నౌకల్లో క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు సిద్ధంగా ఉండనున్నాయి. రథయాత్ర భద్రతా ఏర్పాట్లపై మంగళవారం జరిగిన సమన్వయ సమావేశంలో ఈ కార్యాచరణ ప్రణాళికను ఒడిశా పోలీసులు వెల్లడించారు. ఒడిశా డిజిపి వై.బీ. ఖురానియా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, భారత తీర రక్షక దళం తదితర కీలక భద్రతా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. రథయాత్ర సందర్భంగా కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, ఎన్ఎస్‌జీ బృందాలు, ఎన్ఎస్‌జీ క్విక్ రెస్పాన్స్ టీమ్‌ల మోహరింపుపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యప్రాంతాల్లో యాంటీసబోటాజ్ తనిఖీలను మరింత కఠినతరం చేయనున్నారు. బాంబు నిర్వీర్య దళాలు, స్నిఫర్ డాగ్ బృందాలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. పూరీ నగరంలో నేరాల నియంత్రణ కోసం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఖురానియా ఆదేశించారు.

# ఎల్‌నినో కట్టడికి ప్రత్యేక కార్యాచరణ



### జూన్‌లో వర్షపాతం 33% లోటు నమోదు

### జులైలో మెరుగుపడ్డ రుతుపవనాల ప్రభావం

### ఖరీఫ్ పంటల సాగు తగ్గిన మాట వాస్తవమే

### - కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

**న్యూఢిల్లీ, జులై 8:** ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వం నిశితంగా దృష్టి సారిస్తోందని, దీనిని పర్యవేక్షించేందుకు విస్తృతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేశామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ జులై నెలలో వర్షపాతం మరింత వృంజుకుంటుందని, తద్వారా ఖరీఫ్ విత్తన వేయం ప్రక్రియ వేగవంతం అవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో, కేంద్రం సమగ్ర సన్నద్ధత, స్పష్టమైన వ్యూహం, క్షేత్రస్థాయిలో బలమైన చర్యలతో ఈ పరిస్థితిని ఎదుర్కొం టోందని ఆయన చెప్పారు. "సవాళ్లు ఉన్నప్పటికీ, వాటి ప్రభావాన్ని తగ్గించేందుకు మొత్తం వ్యవస్థను ముందుగానే అప్రమత్తం చేసి, చురుకుగా పని చేసేలా చర్యలు తీసుకున్నామ్ము అని బుధవారం మీడియా సమావేశంలో మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వివరించారు. జూన్ నెలలో 33 శాతం వర్షపాతం లోటు నమోదైనప్పటికీ, జులైలో రుతుపవనాల పరిస్థితి మెరుగుపడిందని, దీనివల్ల మొత్తం లోటు 24 శాతానికి తగ్గిందని చౌహాన్ తెలిపారు.

ఇదే సమయంలో, దేశంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల మంచి వర్షాలు కురవడంతో, వర్షపాతం లోటు ఉన్న జిల్లాల సంఖ్య 262 నుండి 178కి తగ్గింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లోని పరిస్థితులను ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఇప్పటివరకు 350.85 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ విత్తన వేయం పూర్తయింది. ఇది గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే సుమారు 91.95 లక్షల హెక్టార్లు తక్కువ. రుతుపవనాలు ఆలస్యంగా రావడం వల్ల ముఖ్యంగా సోయాబీన్, పత్తి పంటల విత్తన వేయంపై ప్రభావం పడిందని మంత్రి పేర్కొన్నారు. "అయితే, వర్షాలు ఆలస్యం కావడం వల్ల కలిగే ప్రభావాన్ని తగ్గించేందుకు, తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే మొక్కజొన్న, సజ్జలు (బాజ్రా), పెసలు (మూంగ్) వంటి పంట లను సాగు చేయాలని రైతులకు సూచించామ్ము అని కేంద్ర మంత్రి చౌహాన్ చెప్పారు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసిఎఆర్) సహకారంతో, ప్రభావితమయ్యే అవకాశం ఉన్న జిల్లాల కోసం అత్యవసర ప్రణాళికలను రూపొందించి, వాటిని ముందుగానే రాష్ట్ర ప్రభుత్వాలకు అందించామని తెలిపారు. జూన్‌లో నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్'లో భాగంగా దేశవ్యాప్తంగా 1.24 లక్షలకు పైగా కార్యక్రమాలను నిర్వహించి, 80 లక్షల మందికి పైగా రైతులకు నేరుగా అవగాహన కల్పించారు. అంతేకాకుండా, ఏ పరిస్థితుల్లోనైనా విత్తనాల లభ్యతకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రభుత్వం సుమారు 1.75 లక్షల క్వింటాళ్ల జాతీయ విత్తన నిల్వను సిద్ధంగా ఉంచినట్లు కేంద్ర మంత్రి చౌహాన్ తెలిపారు.

## చైనాలో భారీ వర్షాలు, వరదల బీభత్సం

### 21 మంది మృతి, లక్షలాది మంది ప్రభావితం

**లియులాన్ (చైనా), జూలై 8:** చైనాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. వరదల కారణంగా ఇప్పటివరకు 21 మంది మృతిచెందగా, పలువురు గల్లంతయ్యారు. భారీ వర్షాల కారణంగా డజన్ల కొద్దీ నదులు పొంగిపొర్లడంతో పాటు ఒక జలాశయ ఆనకట్ట కూడా తెగిపోయింది. రానున్న రోజుల్లో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ వారం దక్షిణ, మధ్య చైనా ప్రాంతాలను తీవ్ర వాతావరణ పరిస్థితులు అతలాకుతలం చేశాయి. ఇదే సమయంలో మరో సూపర్ తుఫాను తూర్పు చైనా ప్రావిన్సుల వైపు దూసుకొస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దక్షిణ చైనాలోని గ్వాంగ్సీ ప్రాంతంలో మేసాక్ తుఫాను ప్రభావంతో కురిసిన కుండపోత వర్షాలు, వరదల కారణంగా ఆరుగురు మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదకర పరిస్థితుల నేపథ్యంలో కనీసం 1.30 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గ్వాంగ్సీతో పాటు పొరుగు గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో కూడా మరింత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ అధికారులు హెచ్చరించారు. భారీ వర్షాల కారణంగా గ్వాంగ్సీలో 40 నదులు, జలమార్గాలు ప్రమాద స్థాయిని దాటి ఉప్పొంగాయి. వేగంగా ప్రవహించిన బురద నీరు నదీ తీరాలను ఛేదించి, సుమారు 5,260 హెక్టార్ల వ్యవసాయ భూమి దెబ్బతిన్నట్లు ప్రభుత్వ మీడియా వెల్లడించింది.

# భారీ వర్షాలకు సూరత్ పోద్దార్ ఆర్కేడ్‌లో వరదనీరు



### రూ.150 కోట్ల నష్టం అంచనా

**సూరత్,జులై 8:** సూరత్‌లో కురిసిన భారీ వర్షాలతో ప్రముఖ వాణిజ్య సముదాయం పొద్దార్ ఆర్కేడ్ పూర్తిగా జలమయమైంది. రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు మార్కెట్‌లోని అనేక దుకాణాల్లో ఇంకా నీరు నిలిచిఉంది. ఈ ఘటనలో రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్ల వరకు ఆస్తి నష్టం సంభవించిందని వ్యాపారులు ఆరోపించారు. అలాగే పరిస్థితిని అదుపు చేయడంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని మండిపడ్డారు. అకస్మాత్తుగా భారీ వర్షం కురవడంతో కేవలం అరగంట వ్యవధిలోనే గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం నీటిలో మునిగిపోయింది. అనంతరం మొదటి అంతస్తులో సగం వరకు వరదనీరు చేరడంతో దుకాణాలను మూసివేసే అవకాశం కూడా లేకుండా ప్రాణాలు కాపాడుకునేందుకు బయటకు పరుగులు తీయాల్సి వచ్చిందని వారు తెలిపారు. మెట్రో నిర్మాణ పనులకోసం రహదారికి ఇరువైపులా ఏర్పాటుచేసిన బ్యారికేడ్లు వర్షపు నీటి సహజ ప్రవా హానికి అడ్డంకిగా మారాయని వ్యాపారులు ఆరోపిం చారు. దీంతో వర్షపు నీరు డ్రైనేజీ వ్యవస్థలోకి వెళ్లకుండా నేరుగా ఆర్కేడ్ బేస్‌మెంట్‌లోకి చేరి మొత్తం మార్కెట్‌ను ముంచెత్తిందన్నారు. బేస్ మెంట్‌లో తగిన నీటిపారుదల వ్యవస్థ లేకపోవడం పరిస్థితిని మరింత దిగజార్చిందని పేర్కొన్నారు. నీటిని తొలగించేందుకు తొలుత ఏర్పాటు చేసిన ఒకే ఒక్క మోటార్ పంపు భారీ నీటి ప్రవాహాన్ని తట్టుకోలేక పనిచేయకుండా పోయిందని, దీంతో మార్కెట్ మొత్తం నీటితో నిండిపోయిందని వ్యాపా రులుతెలిపారు. సూరత్‌లో మొబైల్ ఫోన్ల విక్రయా లకు ప్రధాన కేంద్రంగా పేరుగాంచిన పొద్దార్ ఆర్కేడ్‌లో వేల సంఖ్యలో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రా నిక్ పరికరాలు, మొబైల్ యాక్సెసరీస్ నీటిలో మునిగి దెబ్బతిన్నాయని వ్యాపారులు తెలిపారు. ఒక్కో దుకాణానికి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలవరకు నష్టం వాటిల్లిందని,మొత్తం మార్కెట్‌కు రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్ల వరకు నష్టం జరిగి ఉండొచ్చని అంచనా వేశారు.

**పుణెలో భవనం కూలి విషాదం..**

మహారాష్ట్రలోని పుణె జిల్లాలో బుధవారం భారీ ప్రమాదం చోటుచేసుకుంది. పింప్రిచించ్వాడ్ పరిధిలోని మోషి ప్రాంతంలో ఓ భవనం కూలిపోవడంతో కనీసం 14 మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. పింప్రిచించ్వాడ్ మేయర్ రవి లాంగ్డే వివరాల ప్రకారం ప్రమాదం జరిగిన సమయంలో కార్యాలయంలో మొత్తం 16 మంది సిబ్బంది భోజనం చేస్తున్నారు. వారిలో ఇద్దరు సురక్షితంగా బయటపడగా, మిగిలిన వారిని రక్షించేందుకు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాయి. గత కొన్ని రోజులుగా నగరంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నీటి మట్టాలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని మేయర్ తెలిపారు. వర్షపు నీటితో పేరుకుపోయిన భారీ చెత్త, వ్యర్థాల గుట్ట ఒక్కసారిగా కార్యాలయ భవనంపై కూలిపోవడంతో కాంక్రీట్ స్లాబ్ కూలి ఈ ప్రమాదం సంభవించినట్లు వివరించారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, విపత్తు నిర్వహణ అధికారులు, స్థానిక పరిపాలన సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. శిథిలాలను తొలగిస్తూ లోపల చిక్కుకున్న వారిని గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.



## భూటాన్ నకిలీ శరణార్థుల కేసు:

### నేపాల్ మాజీ హోం మంత్రులు సహా 23 మంది దోషులుగా కోర్టు తీర్పు

**ఖాట్మండు, జూలై 8:** నకిలీ భూటానీస్ శరణార్థుల కుంభకోణంలో నేపాల్‌కు చెందిన ఇద్దరు మాజీ మంత్రులు సహా మొత్తం 23 మందిని ఖాట్మండు జిల్లా కోర్టు దోషులుగా తేల్చింది. దేశానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినట్లు కోర్టు నిర్ధారించింది. కోర్టు తీర్పు ప్రకారం మాజీ మంత్రి టాప్ బహదూర్ రాయమాఝి, మాజీ హోం మంత్రి బాల్ కృష్ణ ఖండ్తో పాటు మరో 21 మంది నిందితులు దోషులుగా తేలారు. ఈ కేసులో మూడేళ్ల క్రితం మొత్తం 30 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విడుదల చేసిన తీర్పు ప్రకారం, నిందితులు నేపాల్ పౌరులను భూటానీస్ శరణార్థులుగా తప్పుడు గుర్తింపుతో చూపించి అమెరికాకు పంపిస్తామని నమ్మబలికి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసిన కుట్రలో పాల్గొన్నట్లు రుజువైంది. ఈ కేసులో మాజీ హోంకార్యదర్శి టెక్ నారాయణ్ పాండే, మాజీ విదేశాంగ మంత్రి సుజాతా కొయిరాలా మాజీ సహాయకుడు కేశవ్ ప్రసాద్ దులాల్ కూడా దేశానికి వ్యతిరేక నేరాలకు పాల్పడినట్లు కోర్టు తేల్చింది.

# ఢిల్లీలో పెట్రోల్ బాంబు దాడుల కుట్ర భగ్నం

### ఆరుగురు అనుమానితుల అరెస్ట్

**న్యూఢిల్లీ,జులై 8:** దేశ రాజధాని ఢిల్లీలో కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పెట్రోల్ బాంబులతో దాడులు చేయాలనే కుట్రను ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ భగ్నం చేసింది. ఈ కేసులో ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల నుంచి ఆరుగురు అనుమానితులను బుధవారం అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు. వీరిని విచారించగా, పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ హ్యాండ్లర్‌గా ఆరోపణలు ఎదుర్కొంటున్న షెహజాద్ భట్టి ఆదేశాల మేరకు ఈ కుట్ర పన్నినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడయింది. దర్యాప్తు సంస్థల సమాచారం ప్రకారం, నిందితులు ఢిల్లీలోని పలు అత్యంత భద్రతా ప్రాంతాలు, రద్దీ ప్రదేశాలను ముందుగానే పరిశీలించినట్లు గుర్తించారు. సివిల్ లైన్స్‌లోని న్యూ పోలీస్ లైన్స్, ఆనంద్ విహార్ అంతర్రాష్ట్ర బస్ టెర్మినల్, ఒక రైల్వే స్టేషన్‌తో పాటు పలు రద్దీ మార్కెట్ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. నిందితుల మొబైల్ ఫోన్లలో ఈ ప్రాంతాలకు సంబంధించిన వీడియోలను స్వాధీనం చేసుకున్నట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఈ వీడియోలను నిషేధిత మెసేజింగ్ యాప్ ద్వారా షెహజాద్ భట్టికి పంపినట్లు గుర్తించినట్లు తెలిపారు. భట్టి మరియు నిందితుల మధ్య జరిగిన సోషల్ మీడియా చాట్‌లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జూన్ చివరి వారంలో భట్టి మరియు ప్రధాన నిందితుల్లో ఒకరైన డానిష్ అలియాస్ చంద్ మియాన్ మధ్య జరిగిన సంభాషణలు వెలుగులోకి వచ్చాయి. అందులో "మెటీరియల్" సాయంత్రానికి అందుతుందని, దానిని స్వీకరించి భద్రంగా ఉంచాలని, తదుపరి ఆదేశాల కోసం వేచి ఉండాలని భట్టి సూచించినట్లు అధికారులు చెబుతున్నారు. దర్యాప్తు ప్రకారం, "మెటీరియల్" అంటే ఢిల్లీలో పెట్రోల్ బాంబు దాడులు నిర్వహించేందుకు ఉపయోగించాల్సిన వస్తువులని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసు దర్యాప్తులో భాగంగా రాజ్‌ఘాట్ వెనుకనున్న విజయ్ ఘాట్ ప్రాంతం నుంచి పెట్రోల్ బాంబులను స్పెషల్ సెల్ స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన ఆరుగురు నిందితులు భట్టి ఆధ్వర్యంలో పనిచేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌కు చెందిన కనీసం మరో పది మందితో కూడా సంబంధాలు కొనసాగించినట్లు గుర్తించారు.

# సంక్షిప్త వార్తలు

## ముంబై విమానాశ్రయంలో తప్పిన పెను ప్రమాదం



**ముంబై, జులై 8:** ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని ఒకే రన్‌వేపై రెండు ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు ఎదురుపడ్డాయి. ముంబైలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఎటిసి) సకాలంలో స్పందించడం వల్ల ఒక పెద్ద ప్రమాదం తప్పింది. మంగళవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో, ఢిల్లీ వెళ్లే ఎయిర్ ఇండియా విమానం ఎఐ 816 టేకాఫ్ కోసం సిద్ధమవుతుండగా, అదే రన్‌వేపై ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఆగి ఉండటంతో ఈ సంఘటన జరిగింది. ఎటిసి తక్షణ సూచనల మేరకు, సిబ్బంది టేకాఫ్ ప్రయత్నాన్ని విరమించుకున్నారు, దీంతో రెండు విమానాలు ఢీకొనకుండా నివారించబడ్డాయి. ముంబై విమానాశ్రయంలో జరిగిన ఈ సంఘటనను ధ్రువీకరిస్తూ, ఎయిర్ ఇండియా ప్రతినిధి మాట్లాడుతూ, ఎటిసి సత్వర జోక్యం వల్ల ఒక పెద్ద ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు.

## నిజ్జర్ హత్యతో భారత్‌కు సంబంధం లేదు: కెనడా

**న్యూఢిల్లీ, జులై 8:** 2023లో జరిగిన కెనడా పౌరుడు, ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యతో భారత ప్రభుత్వ అధికారులకు సంబంధం ఉందని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేవని కెనడా పోలీసులు బుధవారం తెలిపారు. భారత ఏజెంట్లకు, నిజ్జర్ హత్యకు మధ్య 'సంభావ్య సంబంధమ్ము ఉందన్న విశ్వసనీయ ఆరోపణలపై భద్రతా సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయని మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించిన దాదాపు మూడేళ్ల తర్వాత ఈ ప్రకటన వెలువడింది. నిజ్జర్ హత్యకు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ బాధ్యుడని అమెరికా న్యాయ శాఖ తాజాగా వెల్లడించిన అభియోగపత్రాలు గుర్తించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

## బ్యాంకిపూర్ నుంచి బిజెపి అభ్యర్థిగా అభిషేక్ కుమార్

**న్యూఢిల్లీ:** బీహార్‌లో ప్రతిష్ఠాత్మకంగా మారిన బ్యాంకిపూర్ అసెంబ్లీ ఉపఎన్నికకు భారతీయ జనతా పార్టీ తొలి సారి ఎన్నికల బరిలోకి దిగుతున్న అభిషేక్ కుమార్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో జన సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్, రాష్ట్రీయ జనతా దళ్ నేత రేఖా గుప్తా, బిజెపి అభ్యర్థి అభిషేక్ కుమార్ మధ్య త్రిముఖ పోటీ నెలకొంటుంది. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్ అరుణ్ సింగ్ మంగళవారం అభిషేక్ కుమార్ అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించారు. అభ్యర్థిత్వం తనకు గౌరవంతో పాటు గొప్ప బాధ్యత అని అభిషేక్ కుమార్ పేర్కొన్నారు.

## పంజాబ్ నాయకత్వ మార్పు లేదన్న భూపేష్ బఘేల్

**చండీగఢ్,జులై 8:** పంజాబ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి, కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి భూపేష్ బఘేల్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంలో ఎలాంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. అమరీందర్ సింగ్ రాజా వారింగ్ పంజాబ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతారని వెల్లడించారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడి మార్పుపై జరుగుతున్న ఊహాగానాలను ఖండించిన భూపేష్ బఘేల్, "కాంగ్రెస్ అధ్యక్షుడి నియామకం గుడ్డాగుడ్డి ఆటకాదు. పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాన్ని మార్చే ప్రసక్తే లేదు" అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే తన నిర్ణయాన్ని ప్రకటించిందని, రాజా వారింగ్ పంజాబ్ కాంగ్రెస్‌కు నాయకత్వం వహిస్తూనే ఉంటారని ఆయన పేర్కొన్నారు.

## అమర్‌నాథ్ యాత్రకు భక్తుల వెల్లువ



**శ్రీనగర్,జులై 8:** జమ్మూకశ్మీర్‌లో కొనసాగుతున్న పవిత్ర అమర్‌నాథ్ యాత్రకు భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. యాత్ర ప్రారంభమైన తొలి ఐదు రోజుల్లోనే 1.13 లక్షల మందికి పైగా భక్తులు అమర్‌నాథ్ గుహలోని పవిత్ర హిమలింగాన్ని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బుధవారం ఉదయం మరో 9,837 మంది యాత్రికులతో కూడిన ఏడో విడత బృందం జమ్మూలోని భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య కశ్మీర్‌లోని అమర్‌నాథ్ యాత్ర బేస్ క్యాంపుల వైపు బయలుదేరింది.

# ఇంటి బడ్జెట్‌కు పంచ ప్రణాళికలు !

ప్రభుత్వ బడ్జెట్ సంగతెలా ఉన్నా.. మన ఇంటి పద్దు మాత్రం మనమే రాసుకోవాలి. సంపాదనకు తగ్గట్లు ఖర్చులకు కత్తెర వేసుకోవాలి. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల భారాన్ని, నిత్యావసరాల ధరా ఘాతాన్నీ భరించాలి. అవసరాల్ని సమన్వయం చేసుకుంటూ.. ఆ సెగ ఇంటిల్లిపాదికీ తగలకుండా చూసుకోవాలి. ఇంటి పద్దులు వేసే ఇల్లాళ్లకు ఆర్థిక క్రమశిక్షణ సూత్రాలివి..



**పొదుపు చేయాలి :** ఎంతసేపూ ఖర్చులేనా? ఏ నెల జీతం అప్పుడే ఖర్చయిపోతే భవిష్యత్తు ఎలా? అందుకే.. ఖర్చులు తగ్గించుకుంటూ కొంత పొదుపులకూ కేటాయించు కోవాలి. అలాగని నెలకు ఎంతో కొంత మొత్తాన్ని తీసి పొదుపు చేస్తే చాలు. అదే ఆర్థిక ప్రణాళిక అనుకుంటారు చాలామంది కానీ, కాదు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాల జాబితాను సిద్ధం చేసుకోవాలి. వచ్చే ఆదాయంలో కనీసం ముప్ఫై శాతమైనా పొదుపు కోసం కేటాయించుకోవాలి. మీ స్థాయికి తగ్గట్లు రూ.500 నుంచే క్రమానుగత పెట్టుబడులు పెట్టొచ్చు. ఏ యేటికేడు దీన్ని పెంచుకుంటూ వెళ్లడం వల్ల ఆర్థిక స్థిరత్వమూ సాధ్యమవుతుంది. ఇలాకాకుండాఅప్పు చేసి మదుపు చేయడం, అవసరానికి మించి ఖరీదైన వస్తువులు కొనడం వంటివి మీ జీవితాన్ని కల్లోలం చేస్తాయి. దాన్ని గుర్తించి లెక్కలు వేయండి.

**లెక్క తెలియాల్సిందే:** చాలామందికి డబ్బు లెక్కలు పెద్దగా పట్టవు. ఆదాయం, ఖర్చుల వివరాలు రాయడం అసలే ఇష్టం ఉండదు. విలాసాలు, అవసరాలకు మధ్య తేడానూ గుర్తించరు. ఇలాంటప్పుడే చిక్కుల్లో పడేది. మీ ఇంట్లోనూ అలాంటివారున్నారా? అయితే, ఆదాయం, వ్యయాల మధ్య సమతూకం కుదరాలంటే.. ప్రతీ ఖర్చు వివరమూ పద్దులో ఉండాలి.

**అవసరాలు-లక్ష్యాలు :** నేటి అవసరాలను తీర్చుకుంటూనే భవిష్యత్ వ్యయాలనూ అంచనా వేయాలి. ఉదాహరణకు ఇంట్లోకి కావాల్సిన వస్తువులు కొనడం స్వల్పకాలిక అవసరాలు. సొంతిల్లు, కారు కొనాలను కోవడం మధ్యకాలిక లక్ష్యాలు. పదవీ విరమణ, పిల్లల వివాహం దీర్ఘకాలిక వ్యూహాలు. మీఇంటి పరిస్థితులకు అనుగుణంగా వాటిని మీరే నిర్ణయించుకోవాలి. వీటిపై స్పష్టత వస్తేనే.. మన దగ్గర ఉన్న వనరుల్ని ఎలా వినియోగించుకోవాలో తెలుస్తుంది. వాటిని ప్రతి రెండు నెలలకోసారి సమీక్షించుకోవాలి. ఖర్చుల నియంత్రణ సూత్రాన్ని ఇంట్లోని ప్రతి ఒక్కరూ పాటించేలా చూసుకోవాలి.

**అత్యవసర నిధి :...** ప్రణాళిబద్ధంగా పెట్టుబడులు పెట్టే క్రమంలో మధ్యలో ఏదో చిన్న కష్టమొచ్చిందని వాటిని వెనక్కి తీసుకుంటారు చాలామంది. అలా చేయొద్దు. ఈ తీరు మీ ఆర్థిక క్రమశిక్షణను దెబ్బ తీస్తుంది. బదులుగా ఇలాంటి పరిస్థితుల్ని ముందుగానే ఊహించుకోవడం అలవాటు చేసుకోండి. వీటిని దాటే యడానికి కొంత అత్య వసర నిధిని ఏర్పరుచుకోండి. మీ కుటుంబ బడ్జెట్లో దీనికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వండి. దాన్ని ఆపత్కాలం లో ఆరునెలల పాటు రోజువారీ జీవితాన్ని గడపడా నికీ, వాయిదాలు చెల్లింపులకు ఉపయోగపడేలా సిద్ధం చేసుకోండి. అప్పుడే మీ లెక్క తప్పదు.

**ఖర్చుల నియంత్రణ :..** ఏ వస్తువు కొన్నా ఆచితూచి కొనడం మహిళలకు అలవాటే. కానీ, ఈ మధ్య ఆన్లైన్ షాపింగ్.. మనల్ని గాడి తప్పేలా చేస్తోంది. అవసరం లేకున్నా వస్తువుల్ని దుస్తుల్ని కొనేస్తున్నాం, ఇందుకు ఆకర్షణీ యమైన చిత్రాలు, ప్రకటనలూ, రాయితీలు వంటివి ఏవైనా కావొచ్చు. ఈ-వ్యాలెట్లలో డబ్బులు నింపి ఉంచడం, ఆయా షాపింగ్ వెబ్సైట్లలో కార్డుల వివరాలు నమోదు చేయడం ఆటోమేటిక్ డెబిట్ ఆప్షన్లు తీసుకోవడం వంటి సదుపాయం వల్ల కూడా త్వరపడి కొనేస్తుంటాం. వాటికి దూరంగా ఉండండి. ఒకవేళ ఏదైనా కొనాలనుకున్నా వాయిదాలు చెల్లించేలా కాకుండా పొదుపు చేసి కొనడానికి ప్రయత్నించండి. ఇవన్నీ మీ బడ్జెట్ పద్దుల్ని తలకిందులు కానివ్వవు. □

# వృధ కౌన్సెలింగ్‌తో మరణభయం తగ్గుతుంది !



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

**ప్రశ్న:** మా అమ్మ మరణభయంతో బాధపడుతోంది. అప్పుడప్పుడు 'నేను చనిపోతానేమో' అని ఏడుస్తోంది. మేమంతా ధైర్యం చెప్పినప్పుడు కొంతసేపు ప్రశాంతంగా ఉన్నా, మళ్లీ అదే ఆందోళనకు గురవుతోంది. గత ఆరు నెలలుగా ఈ సమస్య తరచూ కనిపిస్తోంది. కొన్నిసార్లు గుండె దడ కూడా వస్తోంది. ఆకలి, నిద్ర కూడా కొంత తగ్గాయి. ఆమె వయస్సు 60 సంవత్సరాలు. పదేళ్లుగా రక్తపోటు, మధుమేహానికి మందులు వాడుతున్నారు. టీచర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. మా నాన్నకు 70 సంవత్సరాలు. ఆయన కూడా రిటైర్డ్ టీచర్. ఆయన ఆరోగ్యంగా ఉన్నారు. కుటుంబ సభ్యులందరం అమ్మను ఎంతో ప్రేమగా చూసుకుంటున్నాం. నేను కూడా అదే ఊరిలో ఉండడంతో తరచూ వెళ్లి కలుస్తుంటాను. అయినా ఆమె ఎందుకు ఇలా బాధపడుతోందో అర్థం కావడం లేదు. దీనికి పరిష్కారం ఏమిటి?

- ఒక సోదరి, నెల్లూరు



**జవాబు:** మీ అమ్మలో కనిపిస్తున్న లక్షణాలను బట్టి థానటో ఫోబియా, లేదా మరణ భయం ఉండే అవకాశం కనిపిస్తోంది. అంటే చనిపోతాననే ఆలోచన లేదా మరణం గురించి మితిమీరిన భయం, ఆందోళన కలగడం. వృద్ధాప్యంలో కొంతమందికి మరణం గురించి అప్పుడప్పుడు ఆలోచనలు రావడం సహజమే. అయితే ఆ భయం రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసేంతగా పెరిగితే మాత్రం దానిని నిరక్ష్యం చేయకూడదు. ఇలాంటి సమస్యతో బాధపడుతున్నవారిలో గుండె దడ, చెమటలు పట్టడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వికారం, తలనొప్పి, నిద్రలేమి, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. కొన్నిసార్లు ఇది ఆందోళన రుగ్మత లేదా డిప్రెషన్‌తో కూడా కలిసి ఉండవచ్చు.మీ అమ్మలో ఈ సమస్య గత ఆరు నెలలుగా కొనసాగుతున్నందున ఒక సైకాలజిస్ట్‌ను సంప్రదించి కౌన్సెలింగ్ (సైకోథెరపీ) చేయించడం మంచిది. అవసరమైతే సైకియాట్రిస్టు పరీక్షించి మందులు కూడా సూచించవచ్చు. సరైన చికిత్సతో ఈ సమస్య చాలా వరకు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే కుటుంబ సభ్యులు ఆమెకు ఎల్లప్పుడూ ధైర్యం చెప్పాలి. వీలైనంత వరకు ఆమెను ఒంటరిగా ఉండనివ్వకుండా, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి సమయం గడిపేలా చూడాలి. ఆమెకు ఇష్టమైన పనులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పుస్తక పఠనం, సంగీతం వంటి వ్యాపకాలు కల్పించడం కూడా ఉపయోగపడు తుంది. రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉండేలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలి. సమతుల ఆహారం, ప్రతిరోజూ అర్ధ గంట నడక, తగిన నిద్ర ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే థైరాయిడ్, విటమిన్ బి 12, విటమిన్ డి వంటి లోపాలు ఉన్నాయేమో వైద్యుల సలహాతో పరీక్షలు చేయించుకోవడం మంచిది. సమయానికి కౌన్సెలింగ్, అవసరమైన వైద్య చికిత్స, కుటుంబ సభ్యుల ప్రేమాభిమానాలు, ఆరోగ్యకర మైన జీవనశైలి ఉంటే మరణ భయం క్రమంగా తగ్గి, ఆమె మళ్లీ ప్రశాంతమైన జీవితాన్ని గడపగలుగుతారు.

# సాయి వైభవం

శిరిడి సాయి నామం 'అపూర్వం, అద్భుతం అసామాన్యం. అతి శక్తివంతం, సాయి నామాన్ని నిరంతరం భక్తి శ్రద్ధలతో జపించే వారికి సర్వ పాపాలు ప్రక్షాళన అవుతాయి. ఆ సాయినాథుని సన్నిధికి సత్వరం చేరుకోగలము. తెలిసీ, తెలియక మనం చేసిన పాపాలు నిళించి పోవాలంటే సాయి నామాన్ని పట్టుకోవడం ఒక్కటే చక్కని మార్గం. ఈ కలియుగంలో సర్వ పాపములు ప్రక్షాళన కావడానికి, భక్తి మార్గంలో వయనించి ఆ సాయినాధునిలో ఐక్యం కావడానికి, నిరతరం మానవాళిని పట్టి పీడించే అరిషడ్వర్గముల నుండి విముక్తి కావడానికి అతి సులువైన మార్గం నామ జపం చేస్తే ఇక ఏ యుగ్జ్య యాగాదులు అవసరం వుండవు. అతి సులభంగా ఆ భగవంతుని దర్శించగగలము. ఎన్నో వేల జన్మలలో అపారమైన పుణ్యం చేసుకొని వుంటే తప్ప సాయి భక్తులం కాలేము. ఆ పరరబహ్మ స్వరూపమైన శిరిడీ సాయికి శిష్యులం కాగలిగాము అటే కొన్ని వేల జన్మలలో మనం చేసుకున్న అదృష్టం అంటే అతిశయోక్తి కాదు. కాని మాయలో పడిపోయిన మనము ఈ విషయాన్ని గ్రహించలేక మామిడి పూత వలె మధ్యలోనె రాలి పోతున్నాం లేక గురువారం భక్తులుగా మిగిలిపోతున్నాం. మనకు ఆ భగవంతుడైన సాయి కేవలం గురువారం మాత్రమే గుర్తుకు రావడం నిజంగా మన దురదృష్టకరం. సాయిని కేవలం కోరికలు తీర్చే యంత్రంగానే వినియోగించుకుంటున్నాం. సాయి భక్తులమైన మనము సాయి నుండి కోరవలసింది భౌతికమైన ఇహిళపరమైన కోరికలు కాదు. కోరికలు కలుగని స్థితిని ప్రసాదించమని సాయి జీవితం నుండి తెల్సుకోవల్సింది కరుణ, దయ, ప్రేమ, పరిపూర్ణమైన వైరాగ్యం, పాపభీతి కలిగి వుండడం నిరంతరం సాయినే ధ్యానించు. నిరంతరం సాయి నామస్కరణ చెయ్యి, నిరతరం సాయితోనే మాట్లాడు, జీవితాన్ని సాయి మయం చేసుకోవలెయును.

# స్క్రబ్ మసాజ్ మంచిదే !

ముఖం మీద స్క్రబ్ రాసుకోవటం మంచిదే. దీనివల్ల మృత కణాలు తొలగి పోతాయి. ముఖ్యంగా దుమ్ము, ధూళి కారణంగా ముఖం మీద అట్టకట్టినట్లుంది. దీనివల్ల సిబం ఉత్పత్తి అయి చర్మం జిడ్డుగా మారి రకరకాల సమస్యలు వస్తాయి. అందుకే స్క్రబర్స్‌తో ముఖాం రుద్దుకోవాలి. స్క్రబ్ చేసే ముందు కచ్చితంగా ముఖాన్ని గోరు వెచ్చటి నీటితో కడిగేయాలి. ఆ తర్వాత మెత్తని టవల్‌తో తుడుచు కోవాలి. ఇలా స్మూత్‌గా ఉన్నప్పుడే స్క్రబ్ చేసుకోవాల్సి ఉంటుంది. బొబ్బాయి స్క్రబ్, గ్రీన్ టీ స్క్రబ్, కోకనట్-నిమ్మ స్క్రబ్, కుకుంబర్ మింట్ స్క్రబ్. లాంటి చల్లని స్క్రబ్స్ మాత్రమే ముఖం మీద అప్లై చేయాలి. ఇలా చేయటం వల్ల చర్మం చల్లగా ఉంటుంది. స్క్రబర్స్‌తో మరీ గట్టిగా చర్మాన్ని రుద్దుకూడదు. దీనివల్ల చర్మం ఎర్రగా కందిపోతుంది. మరిన్ని చర్మ సమస్యలు వస్తాయి. మొత్తానికి ముఖ చర్మం బట్టి స్క్రబర్స్ ఎంపిక చేసుకోవాలి. ముఖ చర్మం మీద మసాజ్‌లా మెలగా రుద్దాలి. దీని వల్ల రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. ముఖం కాంతివంతంగా మెరుస్తుంది. □




# శొంఠితో మేలు



**శొంఠి పొడి వేసి టీ కాస్తే.. ఆ రుచి భలే పసందుగా ఉంటుంది. జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కూడా. ఇవే కాదు శొంఠితో మరిన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయండోయ్!**

* రోజూ కాసింత శొంఠిపొడిని ఆహారంలో చేర్చుకుంటే నెలసరి సమయంలో అధిక రక్తస్రావంతో బాధపడే వాళ్లకి చక్కని ఉపశమనం దొరుకుతుంది. మొదటి మూడు రోజులు శొంఠిపొడి వేసిన అన్నం 2తింటే నొప్పి కూడా తగ్గుతుంది. * కాలి పిక్కలు పట్టేయడం, కండరాల నొప్పులతో బాధపడటం వంటి సమస్యలుంటే ఇది మంచి ఔషధం. *. కొవ్వుని కరిగించడంలో శొంఠి ముందుంటుంది. ట్రైగ్లిజరాయిడ్ సమస్యతో బాధపడేవారు. కొన్ని రోజులు శొంఠి టీ తాగితే చక్కని ఫలితం కనిపిస్తుందట. * శరీరం లోపలి వాపులకి, కీళ్లదగ్గర పట్టేసిట్టుగా ఉన్నా ఇది మేలు చేస్తుంది. □

# 'డ్యూ డేట్' చిత్రం ప్రారంభం !



పీఆర్‌ఓగా, జర్నలిస్ట్‌గా తెలుగు సినీ పరిశ్రమలో అందరికి సుపరిచితుడైన ఏలూరు శ్రీను నిర్మాతగా మారుతూ, మరో నిర్మాత పవన్ తరిగోపులతో కలిసి నిర్మిస్తున్న చిత్రం 'డ్యూ డేట్' చిత్రం ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు బుధవారం హైదరాబాద్‌లో పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరిగాయి. వర్షిష్ స్టూడియోస్ పతాకంపై ఆనంద్.కె. దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సందర్భంగా హీరో లోమేష్ పూడిపెద్ది, హీరోయిన్ జయశ్రీతో పాటు కీలక పాత్రల్లో కనిపించబోతున్న ప్రణీత పట్నాయక్, విజ్ఞానిలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు మారుతి క్లాప్ నివ్వగా, సక్సెస్‌ఫుల్ నిర్మాత బన్నీవాస్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఇటీవల సక్సెస్‌లకు కేరాఫ్ అడ్రస్‌లుగా మారిన నిర్మాతలు ఎస్‌కేఎన్, ధీరజ్ మొగిలినేని, వంశీ నందిపాటిలు చిత్ర దర్శకుడికి స్క్రిప్ట్‌ను అందజేశారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు, దర్శకుడు విజయ్ కనకమేడల, విఐ ఆనంద్‌లతో పాటు పలువురు దర్శకులు, నిర్మాతలు పాల్గొన్నారు. ప్రజెంట్ బర్నింగ్ ఇష్యూ ఆధారంగా అల్లుకున్న ఈ కమర్షియల్ కోర్ట్ రూమ్ డ్రామా ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా ఉత్కంఠభరితంగా ఉంటుందని, టైటిల్ దగ్గర నుంచి సినిమాలోని ప్రతి అంశం ప్రేక్షకులకు కొత్తదనంతో పాటు పూర్తి సంతృప్తిని కలిగించే కథ.

# 'కొత్త సినిమా' 'మేము కూడా సినిమా తీసినాముగో' సాంగ్ లాంచ్



సినిమా పట్టణంలోనే కాదు పల్లెపల్లెనా ఉంటుందని నిరూపిస్తూ కొత్త దర్శకుడు అజర్ లోకల్ టాలెంట్‌తో స్థానికంగా రూపొందించిన సినిమా 'కొత్త సినిమా'. ఈ సినిమాతో వంద మంది న్యూ టాలెంట్ టాలీవుడ్‌కు పరి చయం కావడం విశేషం. సురేశ్, రాకేష్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రానికి అజర్ స్టోరీ స్క్రీన్ ప్లే డైరెక్షన్‌తో పాటు డైలాగ్స్, ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మహమ్మద్ వాసిమ్ అక్రమ్, సాగి సుధీర్ రావు, యడండ్ల సతీష్ యాదవ్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా కోసం చరణ్ అర్జున్ లిరిక్స్ రాసి కంపోజ్ చేసిన 'మేము కూడా సినిమా తీసినాముగో..' పాటను ఈ రోజు హైదరాబాద్‌లో ఘనంగా లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి, డైరెక్టర్ సాయిలు కంపాటి, నటుడు సాగర్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో నటుడు సురేశ్ మాట్లాడుతూ మాది గోదావరిఖని దగ్గర మార్కండేయ కాలనీ. నేనొక కిరణా షాప్ నడుపుకుంటూ ఉంటాను. నాకు సినిమాల మీద ఇష్టం ఉండేది. అజర్ ఆడిషన్స్ కోసం మా గోదావరిఖని వచ్చినప్పుడు నేనూ వెళ్లాను. వెనక నిలబడే చిన్న పాత్ర దక్కితే చాలు అనుకున్నాను. కానీ ఈ సినిమాలో నాకు లీడ్ రోల్ ఇచ్చారు. అజర్‌కి థ్యాంక్స్ ప్రొడ్యూసర్ మహమ్మద్ వాసిమ్ అక్రమ్ మాట్లాడుతూ మా కొత్త సినిమాను సపోర్ట్ చేసేందుకు వచ్చిన పెద్దలందరికీ థ్యాంక్స్. టైటిల్ కు తగినట్లే మా సినిమా నిజంగా కొత్తగా ఉంటుంది. మీరంతా థియేటర్స్ లో చూసి ఆదరించాలని కోరుతున్నా. అన్నారు. ప్రొడ్యూసర్ సాగి సుధీర్ రావు. అజర్ ఈ చిత్రంతో వందమంది కొత్త వాళ్లను పరిచయం చేయడం అభినందనీయం నటుడు రాకేష్ మాట్లాడుతూ మా స్వస్థలం రామగుండం. నేను సింగరేణి ఎంప్లాయ్ ని. సినిమాలంటే చిన్నప్పటి నుంచి ఆసక్తి ఉండేది. అయితే మధ్య తరగతి కుటుంబం కావడం వల్ల హైదరాబాద్ వచ్చి సినిమా అవకాశాల కోసం ప్రయత్నించే వీలు దొరకలేదు. అజర్ అన్న మా ఊర్లో ఆడిషన్స్ చేస్తున్నారని తెలిసి వెళ్లాను. మెయిన్ లీడ్‌కు నన్ను సెలెక్ట్ చేశారు.

# తెర

## 'చెన్నై లవ్ స్టోరీ' సక్సెస్ పక్కా



'చెన్నై లవ్ స్టోరీ' కల్ట్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ బర్త్ డే సెలబ్రేషన్స్ కల్ట్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ బర్త్ డే సెలబ్రేషన్స్ ఈ రోజు హైదరాబాద్ ఎఫ్ ఎన్ సీసీలో చెన్నై లవ్ స్టోరీ మూవీ టీమ్ సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం, ప్రొడ్యూసర్, డైరెక్టర్ సాయి రాజేష్, నిర్మాత ధీరజ్ మొగిలి నేని, డైరెక్టర్ రవి నంబూరి, హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ తదితరులు పాల్గొన్నారు. ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ మా మిత్రుడు ఎస్ కే ఎన్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపు కోవాలి. ఏడాదికి రెండు చిత్రాలు నిర్మించాలి. హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ ఎస్ కేఎన్ ఇలాగే ప్రతి పుట్టినరోజు హ్యాపీగా జరుపు కోవాలి. మరెన్నో మంచి చిత్రాలు నిర్మించాలి. డైరెక్టర్ సాయి రాజేష్ మాట్లాడుతూ నా మిత్రుడు ఎస్ కేఎన్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఈ రోజు ఆయన బర్త్ డే సెలబ్రేషన్స్ జరుగుతున్నాయి. హీరో అరుణ్ ఆదిత్ మాట్లాడు తూ మనం మంచి మూవీస్ చేద్దాం డార్లింగ్ అని ఎస్ కేఎన్ గతం లోనే చెప్పేవారు. ఆయన చెప్పినట్లే మంచి మూవీస్ చేస్తున్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ఎస్ కేఎన్ ప్రతి బర్త్ డే ను ఇలాగే గ్రాండ్ జరుపుకోవాలి. ఆయన నుంచి మరిన్ని సక్సెస్ ఫుల్ మూవీస్ రావాలి. కల్ట్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లాడుతూ నేను జర్నలిస్ట్‌గా కెరీర్ ప్రారంభించా. పీఆర్‌ఓగా పనిచేశా. పాత్రికేయ మిత్రుల్లో ఒకరిగా మీ స్నేహాన్ని పొందా. ఇప్పుడు ప్రొడ్యూసర్‌గా ఈ వేదిక మీద నిలబడ్డా. ఈ జర్నీలో ప్రతి సందర్భంలో జర్నలిస్ట్ మిత్రులు నా తోడుగా ఉన్నారు. మీరు లేకుండా నా సక్సెస్ లేదు. బేబి కల్ట్ బ్లాక్ బస్టర్ అందుకున్న మూడేళ్ల తర్వాత ఇప్పుడు చెన్నై లవ్ స్టోరీ అనే క్లాసిక్ బ్లాక్ బస్టర్ తో మీ ముందుకు రాబోతున్నాం. అన్నారు.

# 'మారెమ్మ' : సాంగ్ లాంచ్



మాధవ్, దీపా బాల, మంచాల నాగరాజ్, మయూర్‌రెడ్డి బండారు, మోక్ష ఆర్ట్స్ 'మారెమ్మ' మారి సాంగ్ లాంచ్ మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమా రుడు మాధవ్ విలేజ్ యాక్షన్‌డ్రామా 'మారెమ్మ'తో హీరోగా బిగ్ స్క్రీన్ పై అడుగుపెడుతున్నారు. ఈ చిత్రంతో మంచాల నాగరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మయూర్ రెడ్డి బండారు మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మారెమ్మ' ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్,ఫస్ట్ సింగిల్ బబావ బావ' సాంగ్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సాంగ్ లాంచ్ ఈవెంట్ లో హీరో మాధవ్ మాట్లాడుతూ... మీడియా మిత్రులందరికీ చాలా థాంక్స్. సినిమా మొత్తం రెడీ అయిపోయింది. ఈ నెలాఖరులో విడుదల చేయాలని అనుకుంటున్నాం. నిర్మాత మయూర్‌రెడ్డి బండారు మాట్లాడుతూ.. ఈ పాట మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా తెలంగాణ నేటివిటీ, తెలంగాణ సంస్కృతి నేపథ్యంలో తెరకెక్కింది. నాగరాజు ఈ కథ చెప్పగానే మా ఊరి నేపథ్యం మొత్తం నాకు గుర్తొచ్చింది. హీరోయిన్ దీపా బాలు మాట్లాడుతూ.. మా సినిమా టీజర్‌కు, అలాగే 'బావ బావ' పాటకు మీరుటచాలా మంచి సపోర్ట్ ఇచ్చారు. దర్శకుడు మంచాల నాగరాజు మాట్లాడుతూ.. ఈ సినిమాఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. విడుదలకు సిద్ధంగా ఉన్నాం. తెలుగులో ఇది చాలా కొత్త స్క్రీన్‌ప్లేతో ఉండే సినిమా. మారి' పాటలో తమోగ్న, సర్కార్ ఇద్దరూ చాలా బ్యూటిఫుల్‌గా చేశారు.

# 'లెనిన్' 10న గ్రాండ్‌గా విడుదల



లెనిన్‌ను నిజాయితీగా చేశాం.. మా కంటెంట్ మాట్లాడుతుంది రిలీజ్ ప్రెస్ మీట్‌లో అఖిల్ అక్కినేని అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ నిర్మించిన చిత్రం 'లెనిన్'. ఈ సినిమాకి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ మూవీ జూలై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. కింగ్ నాగార్జున మాట్లాడుతూ నందు ఈ కథ శ్రీరామపురంలో జరుగుతుందని చెప్పగానే నాకు మా నాన్న గుర్తొచ్చారు. నందు ఈ కథను అద్భుతంగా రాశారు. డైలాగ్స్ గొప్పగా ఉంటాయి. నందు తన సొంతూరు శ్రీరామపురంకి అఖిల్‌ను తీసుకు వెళ్లాడు. నందు ఇంట్లో అఖిల్‌ను సొంత బిడ్డలా చూసుకున్నారు.'లెనిన్' కథలో ఉండే పెయిన్‌ని అఖిల్ తన జీవితంలోనూ ఎదుర్కొన్నాడు. హీరో అఖిల్ అక్కినేని మాట్లాడుతూ .. మన మూలాలకు, తెలుగు ప్రేక్షకుల మూలాలకు దగ్గరగా ఉండేలా లెనిన్ కథ ఉంటుంది. 'లెనిన్'ను కమర్షియల్ లెక్కల్లోంచి చూడలేదు. ఈ స్క్రిప్ట్‌ని నేను ఎక్కువగా గౌరవించాను. మేం నిజాయితీగా కష్టపడ్డాం. కథ విన్న వెంటనే సినిమాని ఒప్పుకున్నాను. . నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ .. లెనిన్ సినిమాలో అఖిల్ కొత్తగా, ఇది వరకెన్నడూ కనిపించనట్టుగా కనిపిస్తారు. అదే మా మూవీకి ప్లస్ పాయింట్. జూలై 10న వస్తున్నాం.. కొడుతున్నాం అని నాగార్జున చెప్పినట్టే జరుగుతుంది. మంచి చిత్రం చేశామని గర్వంగా చెప్పగలను. అఖిల్ ఈ మూవీ కోసం చాలా కష్టపడ్డారు. భాగ్యశ్రీ అద్భుతంగా నటించారు. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు మాట్లాడుతూ .. అఖిల్‌కి కథ చెప్పిన వెంటనే నచ్చిందని అన్నారు. మీకు ఏం కావాలన్నా నేను ఇస్తాను, చేస్తాను అని అఖిల్ అండగా నిల్చున్నారు. నాకు అవసరం వస్తే.. రాత్రి రెండు గంటలకు అఖిల్ ఫోన్ చేసి భరోసానిచ్చారు. మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ .. అఖిల్‌ది, నాది కేవలం సినిమా బంధం మాత్రమే కాదు. బయటకు కనిపించేంత సాఫ్ట్ కాదు (నవ్వుతూ). బాల్ కొడితే స్టేడియం బయట ఉన్న కార్ల అద్దాలు పగులుతుంటాయి. అఖిల్ గుండెల్లో ల్యాండ్ మైన్ ఉంటుంది.హీరోయిన్ భాగ్యశ్రీ భోర్సే మాట్లాడుతూ. నాకు ఎలాంటి సినీ నేపథ్యం లేదు. ఇలాంటి మంచి ఇండస్ట్రీలో మంచి పాత్రలు ఇస్తున్న దర్శక, నిర్మాతలకు థాంక్స్. భారతి పాత్ర నా మనసుకు ఎంతో దగ్గరైంది. నందు సార్ గారు మంచి కథను రాశారు. ఇలాంటి ఓ గొప్ప పాత్రను నాకు ఇచ్చిన నందుకి థాంక్స్.

# 'హృదయం మురళి' రిలేట్ అయ్యే సినిమా



అథర్వా, ప్రీతి ముకుందన్, కయదూ ప్రధాన పాత్రల్లో ఆకాష్ బాస్కరన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 'హృదయం మురళి'. ఫహాద్ ఫాజిల్ కీలక పాత్ర పోషించారు. అలాగే స్టార్ కంపోజర్ థమన్ ఎస్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందించడంతో పాటు కీలక పాత్రలో నటించారు. మైత్రీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ చిత్రం జూలై 10న తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ప్రెస్ మీట్‌లో హీరో అథర్వా మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులు చూపించే ఆదరణ చాలా అద్భుతం. నా గత చిత్రాలకు ఎంతో ప్రేమను అందించారు. 'హృదయం మురళి'. స్పెషల్ సినిమా. ఈ సినిమా కోసం రెండేళ్లు కష్టపడి పనిచేశాం. ప్రీతి ముకుందన్ మాట్లాడుతూ.. 'హృదయం మురళి' సినిమా జూలై 10న థియేటర్లలో విడుదల అవుతోంది. అందరూ తప్పకుండా థియేటర్లకు వచ్చి చూడండి. ఇది హృదయాన్ని హత్తుకునే ప్రేమకథ. ఈ సినిమాలో మ్యూజిక్ చాలా బాగుంటుంది. సెల్వన్ మాట్లాడుతూ.. 'డ్యూడ్' సినిమాలో నేను చేసిన పాత్రను తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. మైత్రి శశి మాట్లాడుతూ.. ఈ సినిమాను మేము డిస్ట్రిబ్యూట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ట్రైలర్, పాటలు చాలా బాగున్నాయి. గతంలో వచ్చిన 'హృదయం' ఎంత పెద్ద బ్లాక్‌బస్టర్ అయిందో, 'హృదయం మురళి' కూడా అంత పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నాం.



# సెమీ ఫైనల్‌కు జోకోవిచ్

**న్యూఢిల్లీ:** ది ఛాంపియన్‌షిప్స్‌లో అత్యంత సుదీర్ఘమైన క్వార్టర్‌ఫైనల్‌ను గెలిచిన తర్వాత, నోవాక్ జొకోవిచ్ తీవ్రంగా పోరాడి తన 55వ గ్రాండ్ స్లామ్ సెమీఫైనల్‌కు, వింబుల్డన్‌లో వరుసగా ఎనిమిదవ సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. ఫెలిక్స్ ఆగర్‌అలియాసిమ్ నుండి గట్టి పోటీని తట్టుకుని, ఐదు గంటల పదిహేను నిమిషాల పోరులో 7-6(10), 3-6, 6-3, 6-7(4), 7-6(104) తేడాతో నాటకీయ విజయాన్ని సాధించడం ద్వారా జొకోవిచ్ రికార్డు స్థాయిలో 15వ సారి వింబుల్డన్ సెమీఫైనల్స్‌కు తిరిగి వచ్చాడు.
జొకోవిచ్ తన మొదటి వింబుల్డన్ సెమీఫైనల్ చేరిన 19 సంవత్సరాల తర్వాత, 39 సంవత్సరాల 51 రోజుల వయస్సులో తన 15వ సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. 1974లో ది ఛాంపియన్‌షిప్స్ ఫైనల్‌కు 39 సంవత్సరాల 246 రోజుల వయస్సులో చేరుకున్న ఆస్ట్రేలియాకు చెందిన కెన్ రోజ్‌వాల్ తర్వాత, ఓపెన్ శకంలో చివరి నలుగురిలోకి చేరిన రెండవ అత్యంత వయస్సు గల ఆటగాడిగా కూడా అతను నిలిచాడు. 24 సార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ అయిన 39 ఏళ్ల అతను, గత 50 ఏళ్లలో అత్యంత వయసున్న సెమీఫైనలిస్ట్‌గా నిలిచాడు. ఓపెన్ ఎరాలో 39 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉండి వింబుల్డన్ సెమీఫైనల్స్‌కు చేరిన కెన్ రోజ్‌వాల్ తర్వాత ఇతను కేవలం రెండవ వ్యక్తి మాత్రమే. అతను ఇప్పుడు ది ఛాంపియన్‌షిప్స్‌లో 107 మ్యాచ్ విజయాలు సాధించాడు. గత ఏడాది జరిగిన సెమీఫైనల్ పునరావృతంలో, జొకోవిచ్ ఇప్పుడు శుక్రవారం సిన్నర్‌ను ఎదుర్కోనున్నాడు.

ఆట



# వింబుల్డన్ జూ. క్వార్టర్స్‌కు అర్నవ్

**న్యూఢిల్లీ:** వింబుల్డన్ జూనియర్స్ 2026లో అర్నవ్ పాపర్‌కర్ బాలుర సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్ లోకి దూసుకెళ్లి, గత 36 ఏళ్లలో ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా నిలిచాడు. 1990లో వింబుల్డన్ జూనియర్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన చివరి భారత బాలుర సింగిల్స్ ఆటగాడు లియాండర్ పేస్. ఆ తర్వాత పేస్, ఫైనల్‌లో మార్కోస్ ఒంద్రుస్కాను 7-5, 2-6, 6-4 తేడాతో ఓడించి బాలుర సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. 18 ఏళ్ల పాపర్‌కర్ బుధవారం జరిగిన రౌండ్ ఆఫ్ 16లో జపాన్‌కు చెందిన ర్యో తబటాను ఓడించాడు. ఈ భారత ఆటగాడు కేవలం 52 నిమిషాల్లోనే వరుస సెట్లలో 6-2, 6-1 తేడాతో సునాయాస విజయాన్ని నమోదు చేశాడు.
అంతకుముందు, రౌండ్ ఆఫ్ 32లో అమెరికాకు చెందిన ప్రపంచ నంబర్ 3 కీటన్ హాన్స్‌ను 6-2, 6-3 తేడాతో ఓడించి పాపర్‌కర్ టెన్నిస్ వర్గాలను ఆశ్చర్యపరిచాడు. అతను గ్రేట్ బ్రిటన్‌కు చెందిన జోషువా క్రేజ్‌పై 6-2, 6-2 తేడాతో గెలిచి తన 2026 వింబుల్డన్ జూనియర్స్ ప్రచారాన్ని ప్రారంభించాడు. ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు ఒక్క సెట్‌ను కూడా కోల్పోలేదు. క్వార్టర్ ఫైనల్స్‌లో పాపర్‌కర్ తదుపరి అమెరికాకు చెందిన జోర్డాన్ లీ లేదా తనిష్క్ కొండూరిలలో ఒకరిని ఎదుర్కోనున్నాడు. వింబుల్డన్ జూనియర్స్‌లో బాలుర సింగిల్స్ టైటిల్‌ను కేవలం ముగ్గురు భారతీయులు రామనాథన్ కృష్ణన్ (1954), రమేష్ కృష్ణన్ (1979), పేస్ (1990) మాత్రమే గెలుచుకున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఫామ్‌తో పాపర్‌కర్ ఇప్పుడు ఆ వరుసలో తర్వాతి స్థానం కోసం బరిలోకి దిగాడు.



## వరల్డ్ నం.3 స్థానానికి
# మానవ్-మనుష్

**న్యూఢిల్లీ:** టేబుల్ టెన్నిస్‌లో భారత్ జోడీ మానవ్ థక్కర్-మనుష్ షా ప్రపంచ నెం. 3 స్థానానికి ఎగబాకారు. తాజా ర్యాంకింగ్‌లలో ఠక్కర్, షా ఒక స్థానం మెరుగుపడి, ఈ క్రీడా చరిత్రలోనే అత్యధిక ర్యాంకు సాధించిన భారతీయ ప్యాడ్లర్లుగా నిలిచారు. మొత్తం 3560 పాయింట్లతో ఠక్కర్, షా ఇప్పుడు ర్యాంకింగ్స్‌లో చైనాకు చెందిన లిన్ షిడాంగ్‌హువాంగ్ యుజెంగ్ (5510), ఫ్రాన్స్‌కు చెందిన అలెక్సిస్ లెబ్రూన్‌ఫెలిక్స్ లెబ్రూన్ (4058)ల తర్వాత స్థానంలో ఉన్నారు. ఇప్పటివరకు ప్రపంచ నెం.4 ర్యాంకుతో అత్యధిక ర్యాంకు సాధించిన భారతీయులుగా రికార్డు సృష్టించిన మణికా బాత్రా, అర్చన కామత్‌ల మాజీ మహిళల డబుల్స్ జోడీని అధిగమించి, గుజరాత్‌కు చెందిన ఈ ద్వయం ఇప్పుడు భారత టేబుల్ టెన్నిస్‌లో ఒక సరికొత్త స్థాయికి చేరుకుంది. నాలుగేళ్ల క్రితం 2022లో వారు ఈ ఘనతను సాధించారు. మరోవైపు, బాత్రా సత్యన్ జ్ఞానశేఖరన్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రపంచ నెం.5 ర్యాంకును కూడా సాధించాడు. ఠక్కర్ మరియు షా యొక్క ర్యాంకింగ్ పాయింట్లలో అధిక భాగం 2026 సింగపూర్ స్మాష్ నుండి వచ్చాయి, అక్కడ వారు సెమీఫైనల్‌కు చేరుకుని 900 పాయింట్లను సాధించారు. వారు ఇటీవల జరిగిన 2026 యూఎస్ స్మాష్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు కూడా చేరుకున్నారు, దీనివల్ల వారికి అదనంగా 580 పాయింట్లు లభించి ప్రపంచ ర్యాంకుకు ఎగబాకారు. వారి ఇతర ముఖ్యమైన ఫలితాలలో 2025 డబ్ల్యూటిటి స్టార్ కంటెండర్ ఫోజ్ డో ఇగువాకులో రన్నరప్ స్థానం (420 పాయింట్లు), మరియు 2026 కంటెండర్ లాగోస్‌లో టైటిల్ విజయం (400 పాయింట్లు) ఉన్నాయి.

# శాంసన్‌కు కీలక బాధ్యతలు
## అర్థరాత్రి బిసిసిఐ సంచలన నిర్ణయం

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత జట్టు చారిత్రాత్మక పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ ఘోర ఓటమి క్రికెట్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడిన తర్వాత భారత జట్టు ప్రదర్శన నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌లు, ఆ తర్వాత ఇంగ్లండ్‌తో జరిగిన మొదటి మూడు మ్యాచ్‌లు, ఇలా వరుసగా ఐదు పోరాటాల్లో కనీసం ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయలేక చతికిలపడింది.
ముఖ్యంగా ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టీ20లో కేవలం 76 పరుగులకే కుప్పకూలి, 125 పరుగుల భారీ తేడాతో అవమాన పాలవడం భారత క్రికెట్ చరిత్రలోనే ఒక చేరని మచ్చగా మిగిలిపోయింది. ఈ ఘోర వైఫల్యంపై బీసీసీఐ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ప్రస్తుత టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ల వ్యూహాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. మూడో టీ20 ఓటమి వెంటనే, బీసీసీఐ అర్ధరాత్రి ఆన్‌లైన్ వేదికగా అత్యవసరంగా సమావేశమయ్యారు. జట్టును మళ్లీ విజయాల బాట పట్టించడం ఎలా అనే అంశంపై సుదీర్ఘంగా చర్చించి జట్టులో పెను మార్పులకు శ్రీకారం చుట్టారు. ప్రపంచకప్ లాంటి ఒత్తిడితో కూడిన టోర్నీలో అద్భుతంగా రాణించి, భారత్ కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన సంజూ శాంసన్‌ను అసలు జట్టు నుంచి ఎందుకు పక్కన పెట్టారంటూ సెలెక్టర్లను గట్టిగా ప్రశ్నించినట్లు సమాచారం.
దీంతో పాటు, ప్రస్తుత ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీలు కనీసం సింగిల్స్, డబుల్స్ తీస్తూ స్ట్రైక్ రొటేట్ చేయలేకపోతున్నారని, కేవలం భారీ షాట్లకే పరిమితమవుతున్నారని విమర్శలు వచ్చాయి. అలాగే జట్టులో శ్రేయస్ అయ్యర్ మినహా మిగిలిన ప్రధాన బ్యాటర్లంతా ఎడమచేతి వాటం వారే కావడం కూడా జట్టు సమతుల్యతను దెబ్బతీస్తోందని బోర్డు అభిప్రాయపడింది.
దీంతో సంజూ శాంసన్‌కు ఇకపై టీ20 తుది జట్టులో (ప్లేయింగ్ 11) నిరంతరం అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. మూడో స్థానం (వన్ డౌన్) నుంచి ఇషాన్ కిషన్‌ను తప్పించి, ఆస్థానంలో సంజూను బరిలోకి దించనున్నారు.



శాంసన్ పిచ్ పరిస్థితిని బట్టి అటు క్లాస్ ఇన్నింగ్స్, ఇటు మాస్ హిట్టింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పగల సమర్థుడు. అంతేకాకుండా, బ్యాటింగ్ ఆర్డర్‌లో కుడి, ఎడమచేతి వాటం కలయిక (రైట్‌లెఫ్ట్ కాంబినేషన్) కుదురుతుందని బీసీసీఐ భావిస్తోంది. ఇకపై టీ20 జట్టు ఎంపికలో ప్రధాన కోచ్, కెప్టెన్ల జోక్యం అస్సలు ఉండకూడదని బీసీసీఐ కరాఖండిగా తేల్చిచెప్పింది.



# ఐసిసి ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాల్లో ఇషాన్, అభిషేక్



**న్యూఢిల్లీ:** భారత్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య ఇంగ్లాండ్ ఆధిపత్యం ప్రదర్శించడంతో పలువురు ఆటగాళ్లు గణనీయంగా పురోగతి సాధించినప్పటికీ, తాజా ఐసీసీ పురుషుల టీ20ఐ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ అగ్ర రెండు స్థానాలను నిలబెట్టుకున్నారు.
ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ర్యాకింగ్స్‌లో రెండో టీ20లో 46 బంతుల్లో అజేయంగా 76 పరుగులు చేసి ఇంగ్లండ్‌ను విజయపథంలో నడిపించిన జాకబ్ బెథెల్, టీ20ఐ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఏడు స్థానాలు ఎగబాకి 8వ స్థానానికి చేరుకున్నాడు. దీంతో అతను అత్యంత వేగంగా పురోగమించిన ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. రెండో మ్యాచ్‌లో 3/33తో అద్భుత ప్రదర్శన చేసిన తర్వాత, మూడో మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఘనవిజయంలో అజేయంగా 41 పరుగులు చేయడంతో సామ్ కర్రన్ మూడు విభాగాల్లోనూ పురోగతి సాధించాడు. అతను టీ20ఐ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 12 స్థానాలు ఎగబాకి 108వ స్థానానికి, బౌలర్లలో మరో 12 స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 71వ స్థానానికి, మరియు ఆల్‌రౌండర్ల జాబితాలో ఆరు స్థానాలు ముందుకు వెళ్లి సంయుక్తంగా 13వ స్థానానికి చేరుకున్నాడు.
మూడో టీ20లో 2/14 గణాంకాలు నమోదు చేసిన సీనియర్ లెగ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్, టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం పైకి ఎగబాకి మూడో స్థానానికి చేరుకున్నాడు. ఈ సిరీస్‌లో బంతితో రాణించిన విల్ జాక్స్ కూడా పురోగతి సాధించి, ఆరు స్థానాలు ఎగబాకి 7వ స్థానంతో టాప్ 10లోకి ప్రవేశించాడు. టెస్టులో ఏకైక ఐదు వికెట్ల ప్రదర్శనను నమోదు చేసిన ఫాస్ట్ బౌలర్ అసిథా ఫెర్నాండో, బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ఎగబాకి 20వ స్థానానికి చేరుకున్నాడు.

## ఇపిఎఫ్ చందాదారులకు
# వడ్డీచెల్లింపులు

**న్యూఢిల్లీ,జులై 8:** ఈపీఎఫ్‌వో ఖాతాదారులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వడ్డీ చెల్లింపుప్రారంభించింది. ఈపీఎఫ్ లబ్ధిదారులకు 8.25 శాతం వడ్డీని సంస్థ చెల్లిస్తోంది. ఈ పాటికే కొందరి ఖాతాల్లోకి వడ్డీ జమ అయింది. దశలవారీగా ఈ వడ్డీ చెల్లింపు జరుగుతున్నట్లు ఈపీఎఫ్‌వో సంస్థ తెలిపింది. దాదాపు 8 కోట్ల మంది లబ్ధిదారులకు ఈ వడ్డీ జమకానుంది. ఖాతాదారులకు



దీనికి సంబంధి జమ అయిన నగదును తమ ఖాతాల్లో చూసుకోవచ్చు. అందరికీ జమ కావడానికి కాస్త సమయం పడుతుందని సంస్థ తెలిపింది. వార్షిక వడ్డీ 8.25 శాతం చెల్లించాలని సంస్థ క్షేత్రస్థాయి ఆఫీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఒకవేళ ఎవరి ఖాతాలో అయినా వడ్డీ జమకాకుంటే కంగారు పడాల్సిన అవసరం లేదని, దశలవారీగా వడ్డీ జమ అవుతుందని వివరించింది. వడ్డీ జమ అయిన తర్వాత తమ కార్ప్స్‌లో పెరిగిన నగదును చూసుకోవచ్చు.
ఖాతాదారులు తమవడ్డీ, బ్యాలెన్స్ వివరాల్ని ఇలా చెక్‌చేసుకోవచ్చు. యూఏఎన్ నెంబర్, పాస్‌వర్డ్ ద్వారా ఈపీఎఫ్‌వో మెంబర్ పాస్‌బుక్ పోర్టల్‌లోకి లాగిన్ అయ్యి వివరాలు తెలుసుకోవచ్చు. అలాగే, ఉమాంగ్ యాప్ ద్వారా పాస్‌బుక్ సెక్షన్‌లోకి వెళ్లి బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు. ఈపీఎఫ్‌వో బ్యాలెన్స్ చెక్ చేసుకోవడానికి మిస్డ్ కాల్ అలర్ట్ కూడా ఉంది. ఖాతాదారులు తమ రిజిష్టర్డ్ మొబైల్ ద్వారా 9966044425 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా ఎస్ఎంఎస్ రూపంలో బ్యాలెన్స్ సమాచారం అందుతుంది.
అలాగే, 77382 99899 నెంబర్‌కు రిజిష్టర్డ్ మొబైల్ నుంచి మెసేజ్ పంపడం ద్వారా కూడా బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు. అయితే, దీనికోసం ముందుగా యూఏఎన్ నెంబర్‌ను పాన్, ఆధార్, బ్యాంక్ అకౌంట్ వంటి వివరాలతో లింక్ చేసుకుని ఉండాలి.

వాణిజ్యం



## అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం:
# స్టాక్ మార్కెట్లలో భారీ పతనం
## ఇన్వెస్టర్లకు రూ.7.89 లక్షల కోట్ల నష్టం

**ముంబయి,జులై 8:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికాఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిందని ప్రకటించిన వెనువెంటనే ప్రపంచ మార్కెట్లపై ఒత్తిడిపెరిగింది. భారతీయ స్టాక్ మార్కెట్లపైనా తీవ్ర ప్రభావం చూపాయి. బుధవారం దేశీయ ఈక్విటీ సూచీలు మార్చి 30 తర్వాత అత్యంత భారీ ఒక్కరోజు పతనాన్ని నమోదు చేయగా, పెట్టుబడిదారుల సంపద సుమారు రూ.7.89 లక్షల కోట్లు ఆవిరైంది.బీఎస్ఈ గణాంకాల ప్రకారం, బుధవారం ట్రేడింగ్ సెషన్‌లో ఇన్వెస్టర్ల మార్కెట్ విలువ రూ.7.89 లక్షల కోట్లు తగ్గింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 516.65 పాయింట్లు కోల్పోయి 23,882.05 వద్ద ముగిసింది. అదే సమయంలో బీఎస్ఈ సెన్సెక్స్ 1,677.12 పాయింట్లు క్షీణించి 76,503.60 వద్ద స్థిరపడింది. మార్కెట్ పతనంలో ప్రధానంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాల షేర్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నిఫ్టీ పతనానికి అత్యధికంగా కారణమైన షేర్లలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ), భారతి ఎయిర్‌టెల్ ఉన్నాయి.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఒక్కటే నిఫ్టీ సూచీ నుంచి 66.38 పాయింట్లు తగ్గించగా, ఐసీఐసీఐ బ్యాంక్ 55.64 పాయింట్లు, రిలయన్స్ ఇండస్ట్రీస్ 50.30 పాయింట్లు, ఎల్ అండ్ టీ 26.79 పాయింట్లు, భారతి ఎయిర్‌టెల్ 23.53 పాయింట్లు తగ్గించాయి.మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతాయన్న ఆందోళనలతో పెట్టుబడిదారులు భారీగా అమ్మకాలకు దిగడంతో సూచీలు ఒక్కరోజులోనే భారీ నష్టాలను చవిచూశాయి. బుధవారం ట్రేడింగ్‌లో దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టాలతో ముగిశాయి.నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ అత్యధికంగా 2.72 శాతం క్షీణించింది. నిఫ్టీ బ్యాంక్ 2.51 శాతం పడిపోయింది. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 2.49 శాతం నష్టపోయింది.నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ 2.45 శాతం,నిఫ్టీ రూరల్ 2.34 శాతం,నిఫ్టీ మీడియా 2.31 శాతం,నిఫ్టీ ఆటో, నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ చెరో 2.23 శాతం,నిఫ్టీ కన్సంప్షన్ 2.07 శాతం క్షీణించాయి. నిఫ్టీ రియాల్టీ 1.87 శాతం, నిఫ్టీ ఇండియా డిఫెన్స్ 1.67 శాతం, నిఫ్టీ ఐటీ 1.37 శాతం, నిఫ్టీ ఎనర్జీ 1.26 శాతం, నిఫ్టీ ఫార్మా 0.97 శాతం, నిఫ్టీ మెటల్ 0.91 శాతం నష్టాలతో ముగిశాయి. ఓఎన్‌జీసీ, బజాజ్ ఆటో, హిందాల్కో షేర్లు స్వల్ప లాభాలు నమోదు చేసినప్పటికీ, విస్తృత స్థాయి అమ్మకాల ఒత్తిడిని తట్టుకోలేకపోయాయి. అమెరికాఇరాన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలతో మార్కెట్లలో ఆందోళనలు మరింత పెరిగాయి.

# ఒక్కనెలలో 60 కోట్లకుపైగా యుపిఐ లావాదేవీలు




**న్యూఢిల్లీ,జులై 8:** స్మార్ట్‌ఫోన్‌లలోని వేలిముద్ర, ముఖ గుర్తింపు ద్వారా యూపీఐ చెల్లింపులకు అనుమతి ఇచ్చే బయోమెట్రిక్ ధృవీకరణ ఫీచర్ ఎంతో మేలుచేస్తోందని ఎన్‌పిసిఐ వెల్లడించింది. యూపీఐ చెల్లింపుల్లో బయోమెట్రిక్ ధృవీకరణ వినియోగం పెరుగుతుండటం, సులభమైన, వేగవంతమైన మరియు సమర్థవంతమైన చెల్లింపు విధానాలపై వినియోగదారుల ఆసక్తి పెరుగుతున్నదానికి నిదర్శనమని ఎన్‌పీసీఐ గ్రోత్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోహిని రాజోలా పేర్కొన్నారు.జూన్ నెలలో ఈ విధానం ద్వారా 60 కోట్లకు పైగా లావాదేవీలు నమోదయ్యాయని, యూపీఐలో రుపే క్రెడిట్ కార్డు చెల్లింపులతో పాటు పలు వినియోగాల్లో ఈ సదుపాయానికి మంచి ఆదరణ లభిస్తున్నట్లు ఆమె తెలిపారు.ఇప్పటికే అనేక బ్యాంకులు, యూపీఐ యాప్‌లు తమ వినియోగదారులకు బయోమెట్రిక్ ధృవీకరణ సౌకర్యాన్ని అందిస్తున్నాయని, భద్రతతో పాటు సౌలభ్యం కారణంగా మరింత మంది ఈ విధానాన్ని ఎంచుకుంటారని ఎన్‌పీసీఐ ఆశాభావం వ్యక్తం చేసింది. ఎన్‌పీసీఐ ప్రకారం, రోజువారీ డిజిటల్ చెల్లింపుల కోసం యూపీఐ వినియోగదారులు బయోమెట్రిక్ ఆధారిత ధృవీకరణను వేగంగా స్వీకరిస్తున్నారు. దీంతో డిజిటల్ చెల్లింపులు మరింత వేగవంతంగా, సులభంగా, వినియోగదారులకు అనుకూలంగా మారుతున్నాయి.వ్యక్తులమధ్య, వ్యక్తులనుంచి వ్యాపారులకు జరిపే యూపీఐ చెల్లింపులు ఎంతో సులువుగా జరుగుతున్నట్లు తెలిపింది. యూపీఐ ద్వారా జరిగే రుపే క్రెడిట్ కార్డు చెల్లింపులకు కూడా బయోమెట్రిక్ ధృవీకరణను అందుబాటులోకి తీసుకురావడంతో, యూపీఐ పిన్ నమోదు చేయాల్సిన అవసరం లేకుండానే క్రెడిట్ కార్డు చెల్లింపులను పూర్తి అవుతాయి. దీంతో సేవింగ్స్ ఖాతా చెల్లింపుల మాదిరిగానే క్రెడిట్ లావాదేవీలు కూడా వేగంగా పూర్తవుతున్నాయి.

# కృత్రిమమేధ ఖర్చులతో మైక్రోసాఫ్ట్ పొదుపు మంత్రం

**శాన్‌ఫ్రాన్సిస్కో,జులై 8:** ఏఐ ఖర్చుల భారం అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ పొదుపు కార్యాచరణ అనుసరిస్తోంది. మైక్రోసాఫ్ట్ గత కొంతకాలంగా తన యాప్స్‌లో ఓపెన్ ఏఐ, ఆంత్రోపిక్ సంస్థల ఏఐ మోడల్స్‌ను వినియోగిస్తోంది. అయితే, ఇటీవల వీటిని పక్కన పెట్టి సొంతంగా అభివృద్ధి చేసుకున్న మోడల్స్‌ను యాప్స్‌లో వినియోగిస్తున్నట్టు సమాచారం. ఎక్సెల్, ఔట్‌లుక్ వంటి వాటిల్లో ప్రస్తుతం ఎమ్ఏఐ మోడల్ యూజర్ల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్నట్టు తెలుస్తోంది. అయితే, ఈ వార్తలపై మైక్రోసాఫ్ట్ ఇంతవరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు. మైక్రోసాఫ్ట్ సొంతంగా అభివృద్ధి చేసుకున్న మోడల్స్ ప్రస్తుతం సంస్థలోని కొన్ని పనులను మాత్రమే చేస్తున్నాయి. సొంత ఏఐ మోడల్స్ వైపు మైక్రోసాఫ్ట్ మళ్లుతోందంటే వాటి సామర్థం



గతంలో కంటే మెరుగైనట్టేనని నిపుణులు చెబుతున్నారు. మరింత తక్కువ ఖర్చుతో వీటిని మైక్రోసాఫ్ట్ అభివృద్ధి చేయగలుగుతోందని అంటున్నారు. సొంతంగా అభివృద్ధి చేసుకున్న మోడల్స్ వినియోగాన్ని పెంచుతున్నామని మైక్రోసాఫ్ట్ ఏఐ విభాగం చీఫ్ సులేమాన్ జూన్ లోనే వెల్లడించారు.




## పసిడి, వెండి ఇటిఎఫ్‌లకు
# ట్రంప్ షాక్!

**ముంబయి,జులై 8:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలతో ప్రపంచ ఆర్థిక మార్కెట్లు ఒక్కసారిగా ఒత్తిడికి గురయ్యాయి. సురక్షిత పెట్టుబడులుగా భావించే బంగారం, వెండి ఆధారిత ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లో భారీ అమ్మకాలు జరిగి 3 శాతం వరకు క్షీణించాయి. దలాల్ స్ట్రీట్‌లో విస్తృత స్థాయిలో అమ్మకాల ఒత్తిడి, పెట్టుబడిదారుల ఆందోళన ఈ పతనానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.బంగారం ఈటీఎఫ్‌లలో ప్రుడెన్షియల్ గోల్డ్ ఈటిఎఫ్ 1.6 శాతం క్షీణించి రూ.121.01 వద్ద ట్రేడవగా, కోటక్ గోల్డ్ ఈటిఎఫ్ 1.44 శాతం పడిపోయి రూ.118కు చేరుకుంది. డీఎస్పీ గోల్డ్ ఈటిఎఫ్ కూడా 1.53 శాతం తగ్గి రూ.137.27 వద్ద ట్రేడైంది. వెండి ఈటీఎఫ్‌లలో నష్టాలు మరింత తీవ్రంగా కనిపించాయి. మోతీలాల్ ఓస్వాల్ సిల్వర్‌ఈటిఎఫ్ 3.19 శాతం పడిపోయి రూ.216.93కు చేరుకోగా, మిరాయ్ అసెట్ సిల్వర్ ఇటిఎఫ్ 3 శాతానికి పైగా క్షీణించి రూ.213.48 వద్ద ట్రేడైంది. డీఎస్పీ సిల్వర్ ఈటిఎఫ్ కూడా 3.17 శాతం తగ్గి రూ.211.17కు చేరింది. డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మూలధన, ఈక్విటీ, కమోడిటీ, ఆర్థిక మార్కెట్లపై తీవ్రభారం మోపాయి. బ్యారెల్‌కు 70 డాలర్ల దిగువకు చేరిన ముడి చమురు ధరలు మళ్లీ ఒక్కసారిగా పెరిగాయి. అంతర్జాతీయ ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ ధర 6.5 శాతం పెరిగి బ్యారెల్‌కు 78.9 డాలర్లకు చేరుకోగా, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర 6.49 శాతం పెరిగి బ్యారెల్‌కు 75.01 డాలర్ల వద్ద ట్రేడైంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో ఆగస్టు గోల్డ్ ఫ్యూచర్స్ ధర 10 గ్రాములకు రూ.2,240 లేదా 1.5 శాతం తగ్గి రూ.1,43,037కు చేరుకుంది. సెప్టెంబర్ సిల్వర్ ఫ్యూచర్స్ కిలోకు రూ.7,307లేదా క్షీణించి రూ.2,23,550వద్ద ట్రేడయ్యాయి.

# రాబడులు పెరిగినా లాభాల మార్జిన్‌లపై ఒత్తిళ్లు
## మోర్గాన్‌స్టేన్లీ, జెఫరీస్ బ్రోకరేజెస్ అంచనాలు

**న్యూఢిల్లీ,జులై 8:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత కార్పొరేట్ సంస్థలరాబడులు వృద్ధిపెరుగుతాయని అయితే ఇంధనం మరియు ముడిసరుకు ధరల పెరుగుదల కారణంగా పలు రంగాల్లో లాభాల మార్జిన్లు ఒత్తిడిని ఎదుర్కొనే అవకాశం ఉందని ప్రముఖ బ్రోకరేజ్ సంస్థలు జెఫరీస్ , మోర్గాన్ స్టాన్లీ తమ త్రైమాసిక అంచనాల్లో పేర్కొన్నాయి. జెఫరీస్ అంచనా ప్రకారం, చమురుగ్యాస్, లోహాలు, ఆర్థిక సేవల రంగాలను మినహాయించి తమ కవరేజ్‌లో ఉన్న కంపెనీల ఆదాయ వృద్ధి వార్షిక ప్రాతిపదికన 16 శాతానికి చేరుకునే అవకాశం ఉంది. ఇది గత 13 త్రైమాసికాల్లో అత్యధిక వృద్ధి. త్రైమాసిక ప్రాతిపదికన కూడా ఆదాయం 2 శాతం పెరగవచ్చని అంచనా వేసింది. ఇదే సమయంలో చమురు గ్యాస్, లోహాలను మినహాయించి కంపెనీల లాభాలు వార్షికంగా 12 శాతం వృద్ధి నమోదు చేసే అవకాశం ఉందని తెలిపింది.




బ్యాంకింగ్ రంగంలో ట్రెజరీ ఆదాయాన్ని మినహాయిస్తే కీలక రాబడులు సుమారు 15 శాతం పెరగనున్నాయని జెఫరీస్ అంచనా వేసింది. రుణాల పంపిణీ బలంగా ఉండటం, చెడు రుణాల వ్యయం తగ్గడం దీనికి ప్రధాన కారణాలుగా పేర్కొంది. అయితే నికర వడ్డీ మార్జిను స్వల్పంగా తగ్గుతాయి. నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు కూడా బలమైన ఫలితాలు నమోదు చేయనున్నాయని, గృహ రుణ సంస్థలు, ఎస్‌బీఐ కార్డ్స్‌ను మినహాయిస్తే లాభాలు 25 శాతానికి పైగా పెరగవచ్చని అంచనా వేసింది. రుణాల వృద్ధి, స్థిరమైన నికర వడ్డీ మార్జిన్లు, తగ్గిన క్రెడిట్ వ్యయాలు దీనికి దోహదం చేయనున్నాయని పేర్కొంది.
టెలికాం రంగంలో భారతి ఎయిర్‌టెల్ మరోసారి బలమైన పనితీరును కొనసాగిస్తూ సుమారు 15 శాతం వృద్ధి అంచనావేసింది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో మార్కెట్ ఒడిదుడుకులు పెరగడంతో ఫ్యూచర్స్, ఆప్షన్స్ ట్రేడింగ్ వాల్యూమ్స్ పెరిగాయని, దీని ఫలితంగా బీఎస్ఈ, ఎంసీఎక్స్ వంటి ఎక్స్ఛేంజ్‌ల లాభాలు గత ఏడాదితో పోలిస్తే 1.6 నుంచి 2 రెట్లు పెరిగే అవకాశం ఉందని జెఫరీస్ పేర్కొంది.క్విక్ కామర్స్ వ్యాపారాల లాభదాయకత మెరుగుపడటంతో ఇంటర్నెట్ కంపెనీల మార్జిన్లు కూడా పెరగనున్నాయి. ఎటర్నల్, నైకా కంపెనీలకు ఇది అనుకూలంగా ఉండగా, పీబీ ఫిన్‌టెక్‌పై ఆపరేటింగ్ లెవరేజ్ ప్రభావం కొంత ప్రతికూలంగా ఉండవచ్చని అంచనా వేసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.